ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 91 పేజీలు: 10+4 వెల: 6.50




ఒడిలో నాలుగేళ్ల కొడుకుతో తల్లిమృతి

జబల్పూర్ పడవ ప్రమాదం

5లో

## మండుతున్న పిడుగురాళ్ల



46°కు చేరిన ఉష్ణోగ్రత

252 మండలాల్లో 41° పైగా నమోదు

రాష్ట్రంలో కొన్ని చోట్ల వర్షాలు

**విజయవాడ,మే1, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. రాష్ట్రంలోని 20 జిల్లాల పరిధిలో ఎండ తీవ్రత పెరిగింది. 252 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదయింది. పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలో అత్యధికంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. మరో వైపు ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఒడిశా నుంచి ఏపీ మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. కొన్ని రోజులుగా ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వాన ఊరటనిచ్చింది. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలోని పలు చోట్ల వడగళ్ల వర్షం కురిసింది. పలు చోట్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అనంతపురం నగరంలో తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నిన్న సాయంత్రం నుంచే తీవ్ర గాలులు వీచాయి. తీవ్ర ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు >>2

# కార్మిక సంక్షేమమే లక్ష్యం



శుక్రవారం పమిడిముక్కలలో శ్రమశక్తి పురస్కారాలను అందచేస్తున్న సిఎం చంద్రబాబు

నైపుణ్యం పోర్టల్‌తో వివిధ శాఖల సమన్వయం

మచిలీపట్నం బైపాస్ ఆరు లేన్లుగా అభివృద్ధి

35మంది భవన నిర్మాణ కార్మికులకు రూ.5లక్షల ఆర్థిక సాయం

ఉత్తమ కార్మికులు, పరిశ్రమల యాజమాన్యాలకు శ్రమశక్తి పురస్కారాలు

పమిడి ముక్కల మేడే 'పేదలసేవ'లో సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే1,ప్రభాతవార్తప్రతినిధి:** కార్మిక సంక్షేమానికి ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అనేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. శ్రామికుల కోసం ప్రత్యేక కార్యచరణరు చేపడతామన్నారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన మేడే, పేదల సేవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. మేడేను పురస్కరించుకుని కార్మికులు, యాజమాన్యాలకు ప్రభుత్వం పురస్కరాలను అందజేసారు. ఉత్తమ కార్మికులు, పరిశ్రమల యాజమాన్యాలకు మేడే పురస్కారాలు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రమ శక్తి పురస్కారాలను అందించి సత్కరించిన సీఎం చంద్రబాబు అంతకు ముందు కార్మికుల సంక్షేమం, నైపుణ్యం పెంపు అంశాలను తెలియ జేస్తూ ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. వివిధ శాఖలను నైపుణ్యం పోర్టల్‌తో ఇంటిగ్రేట్ చేసినట్లు సీఎంకు అధికారులు తెలిపారు. కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని స్కిల్ డెవలెప్మెంట్ కార్పొరేషన్, మెప్మా, హెల్త్, సివిల్ సప్లైను నైపుణ్యం పోర్టల్‌తో ఇంటిగ్రేషన్ చేశామని సీఎంకు అధికారులు వివరించారు. 35 మంది భవన నిర్మాణ కార్మికులకు పీ4లో భాగంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును సీఎం అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అమరావతిలో నూతన ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించే యోచనలో ఉన్నట్లు చెప్పారు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలు, శ్రీసిటీ, తిరుపతి, ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తామని తెలిపారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా లక్ష్యమని అన్నారు. ఆడబిడ్డలకు 33 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని తేల్చిచెప్పారు. చట్టసభల్లో 33 శాతం మంది మహిళలు ఉంటే సభకే శోభ వస్తుందని అన్నారు. కృష్ణా పుష్కరాల నాటికి కృష్ణా జిల్లాలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. బందర్ పోర్టు పనులు 57 >>2

# మహానాడుకు స్థలాన్వేషణ



శుక్రవారం మహానాడు నిర్వహణపై నేతలతో చర్చిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

27 నుంచి నిర్వహించే సభల కోసం కోవూరు, రాజుపాలెం, నెల్లూరులో స్థల పరిశీలన

5లక్షల మందితో వైభవంగా నిర్వహణకు సిద్ధం:మంత్రి ఆనం

**కొడవలూరు (నెల్లూరు), మే 1, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక మహానాడు కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మే 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న మహానాడు కోసం జిల్లా వ్యాప్తంగా అనువైన స్థలాల పరిశీలన కొనసాగుతోందన్నారు. మహానాడు నిర్వహణకు సంబంధించి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ రవిచంద్ర, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కాకర్ల సురేష్, కృష్ణారెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు కోవూరు జాతీయ రహదారి సమీపంలోని రేగడి చెలిక వద్ద సుమారు 110 ఎకరాల ఏపీఐఐసీ స్థలాన్ని పరిశీలించారు. అలాగే రాజుపాలెం సమీపంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాంతాన్ని కూడా సందర్శించారు.

ఇదే సమయంలో నెల్లూరు రూరల్ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న సాక్షి కార్యాలయం సమీప ప్రాంతాలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతో కలిసి పరిశీలించారు. మహానాడు నిర్వహణకు అనువైన అన్ని ప్రాంతాలపై సమగ్ర నివేదికను పార్టీ కేంద్ర కమిటీకి పంపిస్తామని మంత్రి ఆనం వెల్లడించారు. అనంతరం పార్టీ అధిష్టానం తుది వేదికను ఖరారు చేస్తుందని చెప్పారు.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయించడం జిల్లా నేతలు, కార్యకర్తల అదృష్టంగా భావిస్తున్నామని మంత్రి ఆనం పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త గర్వపడేలా మహానాడును పసుపు పండుగలా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని తెలిపారు.

మే 28న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా లక్షలాది మంది కార్యకర్తల సమక్షంలో మహానాడు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఐదు లక్షల మందికి పైగా కార్యకర్తలు, నాయకులు పాల్గొనే ఈ కార్యక్రమం కోసం భారీ బహిరంగ సభ వేదిక, వేలాది వాహనాలకు పార్కింగ్, మూడు రోజులపాటు భోజన వసతి, అతిథులకు నివాస సదుపాయాలు వంటి అన్ని అంశాల్లో సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ డిఎస్పి శ్రీనివాసరావు, కొడవలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ దుర్గా ప్రసాద్ రావు, స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి మరియు ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుకపై

## లోకాయుక్త కొరడా

సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు

సంస్థ నుంచి రూ.3 కోట్లు వసూలు

**కర్నూలు, మే 1, ప్రభాతవార్త :** ప్రకాశం జిల్లాలో అనుమతించిన పరిమితులకు మించి జరిగిన ఇసుక త్రవ్వకాలు, అక్రమ రవాణా, మరియు సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై నమోదైన ఫిర్యాదులు (1238/2021/బి1, 1301/2021/బి1)పై ఆంధ్రప్రదేశ్ ఉపలోకాయుక్త పి. రజని స్వయంగా విచారణ పూర్తి చేశారు. విచారణలో లైసెన్సుదారు సంస్థ బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అనుమతించిన పరిమాణాన్ని మించి ఇసుక త్రవ్వకాలు నిర్వహించినట్లు తేలడంతో సంస్థపై భారీ జరిమానా విధించబడింది. ఉపలోకాయుక్త సిఫార్సుల మేరకు సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు అమలు చేయబడ్డాయి. గనులు మరియు భూగర్భ శాఖ ఉప సంచాలకుడు నరసింహారెడ్డికి రెండువార్షిక వేతన వృద్ధులు సమీ >>2



శుక్రవారం గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

గ్రామీణులకూ నేత్ర వైద్యం

## అందుబాటులోకి

గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ ఐకేర్ సెంటర్‌ను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

వైద్య, ఆరోగ్యానికి రూ.19,305 కోట్లు కేటాయింపు

**విజయవాడ మే1, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు సంక్షేమం అభివృద్ధితో పాటు ఆరోగ్యానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత బడ్జెట్ కంటే ఈసారి వైద్యారోగ్యానికి రూ.19,305 కోట్లను కేటాయించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి ఆస్పత్రులు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమని వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఫౌండర్ చైర్మన్ జీఎన్ రావులతో కలిసి ఈ ఐ కేర్ సెంటర్ ను సీఎం ప్రారంభించారు.. ఈ ఐ కేర్ సెంటర్ ఏర్పాటుకు సహకారం అందించిన సువెన్ లైఫ్ సైన్సెస్ సంస్థ చైర్మన్ జాస్తి వెంకట్ ను సీఎం అభినందించారు. సమాజానికి తిరిగి ఇవ్వాలన్న లక్ష్యంతో జాస్తి వెంకట్ ఈ ఐ కేర్ సెంటర్ కు ఆర్థిక సహకారాన్ని అందించారన్నారు. ఈ ప్రాంతంలో పేదలకు సైతం ఉత్తమ నేత్ర వైద్యం >>2



శుక్రవారం ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీ వర్ష దృశ్యం

# అటు ఉడుకు.. ఇటు వణుకు

ఉత్తరాంధ్రలో మారిన వాతావరణం

పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షం

మామిడి, జీడి, అరటి రైతులకు అపార నష్టం

**శ్రీకాకుళం/వీరఘట్టం, మే 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉపరితల ద్రోణి ప్రభావంతో వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గత కొన్ని రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలకు కొంత ఉపశమనం లభించగా, పలు ప్రాంతాల్లో మేఘావృతం ఏర్పడింది. ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత మేఘాలు కమ్ముకోవడంతో ఒక్కసారిగా వాతావరణమే మారిపోయింది. ఫలితంగా శుక్రవారం మధ్యాహ్నం నుండి బీభత్సమైన ఈదురు గాలులతో హుదూద్ తుఫాన్ గుర్తుకొచ్చేలా ఉరుములు, పిడుగులతో ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేసింది. భారీగా వర్షం కురవడంతో ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ బీభత్సం వల్ల ఎక్కువగా మామిడి, జీడి, అరటి రైతులకు అపార నష్టం చేకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పండించిన పంటలు ఒక్కసారిగా నేల కొరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట చేతికొస్తున్న టైంలో ఇటువంటి ప్రకృతి సృష్టించిన బీభత్సంతో కుదలైపోతున్నామని రైతులు దిగాలు పడుతున్నారు. అలాగే ఈ భారీ వర్షానికి పలు రహదారులు కూడా పాడైన దాఖలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతివేగంగా >>2

# భగ్గుమన్న వాణిజ్య సిలిండర్



రూ.993 మేర భారీగా పెంపు

ఢిల్లీలో ధర రూ.3071.50

**న్యూఢిల్లీ, మే 1:** దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను ఏకంగా రూ.993కు పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ పెంపు నేటి నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల సిలండర్ ధర రూ.3,071.50కి చేరింది. అదే హైదరాబాద్‌లో అయితే 19 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరలు రూ.1000 పెరిగి రూ. 3315వరకూ చేరింది. ఈ ధరలు శుక్రవారంనుంచే అమలులోకి వచ్చాయి. అయితే గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. అమెరికా ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో విడతల వారీగా కమర్షియల్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు పెంచాయి. ఫిబ్రవరి 28 తర్వాత కమర్షియల్ సిలిండర్ ధరలు పెరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. మార్చి ప్రారంభంలో సుమారు రూ.115 పెరిగిన ధరలు, ఏప్రిల్ 1న 200 వరకు పెరిగాయి. ఇప్పుడు ఒకేసారి రూ.993 పెంచారు. దీంతో ఒక్క వాణిజ్య సిలిండర్ ధర రూ.3వేలు దాటింది. తాజా పెంపుతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలపై అదనపు భారం పడనుంది. ఇంధన ధరల విషయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వివరాల ప్రకారం పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరిగినప్పటికీ ఆయిల్ కంపెనీలు వాటిని భరిస్తున్నాయని తెలిపింది. దీంతో ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పులేదు. ఇక దేశీయ >>2



ఓట్ల లెక్కింపు సిబ్బందిపై

## 'సుప్రీం'కు మమత

ఇసి వైఖరిపై సిఎం ధ్వజం

**న్యూఢిల్లీ, మే 1:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓట్లలెక్కింపు సిబ్బందిగా కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులను నియమించడంపై మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలుచేసి అత్యవసరమని కోరింది.

# గంజాయి మత్తుకు క్షణాల్లో చెక్!




మూత్ర పరీక్ష ద్వారా నిర్ధారణ

రాష్ట్రంలో తొలిసారి తిరుపతిలో అమలు

గంజాయి నిర్మూలనకు నాలుగంచెల విధానం

**తిరుపతి,మే 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పుణ్యక్షేత్రంగానే గాక యాత్రాస్థలంగా కూడా ప్రసిద్ధి చెందడం, పుణ్యక్షేత్రాల జిల్లాగా అలరారుతుండటంతో మత్తుపదార్థాల నిషేధమే లక్ష్యంగా పోలీస్‌శాఖ పనిచేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో గంజాయి నిర్మూలనకు నాలుగు అంచెల విధానాన్ని అవలంభిస్తున్నట్లు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా తిరుపతి జిల్లాలో పోలీసుశాఖ తరపున నూతన పరికరాలను తెప్పించారు. ఈ పరికరం ద్వారా గంజాయి సేవించినా, మత్తులో ఉన్నా వెంటనే మూత్రం పరీక్షద్వారా క్షణాల్లో పాజిటివ్ గా నిర్థారణ అవుతుంది. ఈ పరికరంలో మూత్రం రెండు చుక్కలతో ఆ వ్యక్తి యొక్క మత్తు ఎరుపురంగులో మారితే పాజిటివ్‌గా నిర్థారణ చేస్తారు. >>2

# అకాల వర్షానికి అపార నష్టం

## శ్రీకాకుళం జిల్లాలో నేలకూలిన బొప్పాయితోటలు

## కరిగిపోయిన ఉప్పు మడులు



ఈదురుగాలులకు నేలకూలిన బొప్పాయి పంట

**సంతబొమ్మాళి/బూర్జ (శ్రీకాకుళం జిల్లా), మే 1 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి, బూర్జ మండలాల్లో అకాల వర్షం ధాటికి భారీ నష్టం వాటిల్లింది. సంతబొమ్మాళి మండలంలో గత రెండు రోజులుగా ఉరుములు మెరుపులతో కూడిన గాలివానతో ఉప్పుకుప్పలు నీటమునిగాయి. దీంతో ఉప్పు రైతులకు అపార నష్టం వాటిల్లి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మండలంలో నౌపడ, సీతానగరం, శెలగపేట, మర్రిపాడు గ్రామాల్లో పలువురు ఉప్పు రైతులు ఉప్పు పంట సాగు చేస్తున్నారు. చేతికి అందవచ్చిన పంట మడుల లోనే గంగపాలు అవటంతో 50శాతం పైగా ఉప్పు పంటకు నష్టం వాటిల్లిందని లబోదిబోమంటున్నారు. వర్షానికి పూర్తిగా ఉప్పు మడుల్లో వర్షపు నీరు చేరడంతో మరో పది రోజుల వరకు ఎటువంటి పని ఉండదని, ఉప్పునిల్వ చేసేందుకు ప్లాట్ పామ్ లేకపోవడం పండిన పంటకు రక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఆరుగాలం కష్టపడి పండించుకున్న మామిడి, బొప్పాయి చేతికి అంది వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యంలో చెట్లు నేలకొరిగి కాయలన్నీ రాలిపోయి తీవ్ర నష్టం ఏర్పడింది.

## భవన నిర్మాణ కార్మికులతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు

**విజయవాడ. మే 1, ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణాజిల్లా వీరంకిలాకు గ్రామంలో మేడే సందర్భంగా సిఎం చంద్రబాబు కొత్తగా నిర్మిస్తున్న ఓ భవనం వద్దకు వెళ్లిన సీఎం అక్కడ పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులను పలకరించారు. తాపీ మేస్త్రీ అల్లా భక్షు, అక్కడ కూలీగా పనిచేస్తున్న మహిళ సుమలతతో మాట్లాడి వారి రోజు వారీ ఉపాధి, కుటుంబ నేపథ్యం, ఇబ్బందులను గురించి ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. అనంతరం వారికి మన మిత్ర వాట్సప్ యాప్‌ను ద్వారా కార్మికులను అందుబాటులో ఉన్న సేవలు, వాటిని ఉపయోగించుకునే తీరును స్వయంగా తెలియజేశారు. అదే భవనంలోని మొదటి అంతస్తులో పని చేస్తున్న రాడ్ బెండింగ్ కార్మికుడు కొండేటి సీమయ్య, సెంట్రింగ్ కార్మికుడు బోలెం శ్రీనివాసరావుతో మాట్లాడి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శ్రీహరిరావు అనే భవన నిర్మాణ కార్మికుడి కుమార్తె మణికొండ అఖిల ఇటీవలే ఓ బిడ్డకు జన్మనివ్వటంతో కార్మికుల సంక్షేమంలో భాగంగా రూ.20 వేల చెక్కును ఆమెకు ఆర్థికసాయంగా ముఖ్యమంత్రి అందించారు.

## పూడి శ్రీహరికి ఏపీ హైకోర్టులో ఊరట!

**విజయవాడ, మే 1, ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సీఎం జగన్ సీపీఆర్వో పూడి శ్రీహరికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది..సోషల్ మీడియా పోస్టుల కేసులో అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.. 41ఏ నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలని ఏపీ హైకోర్టు సూచించింది..వైసీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు సీపీఆర్వో పూడి శ్రీహరి పని చేసారు. సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుత సీఎం చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు పెట్టినందుకు పోలీసులు కేసులు నమోదు చేసింది.

## జలజీవన్ ద్వారా సురక్షిత నీటి సరఫరా

### మిషన్ అదనపు కార్యదర్శి కమల్‌కిషోర్

**పోలవరం జిల్లా ప్రతినిధి మే 1 ప్రభాతవార్త**

దేశంలోని వివిధ రాష్ట్రాల్లోఉన్న మారుమూల గ్రామాల ప్రజలకు జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందని కేంద్ర ప్రభుత్వ అడిషనల్ జల జీవన్ మిషన్ కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ అన్నారు. శుక్రవారం పోలవరం జిల్లా మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీలోని పందిరి మామిడి కోట గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు కులాయిలు ప్రారంభోత్సవానికి కేంద్ర ప్రభుత్వ జల జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ షోన్, పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్‌కుమార్, గ్రామీణ నీటిపారుదల ఇంజనీరింగ్ చీఫ్ గాయత్రి ముఖ్య అతిథులుగా హాజరై తాగినీటి కులాయిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమల్ కిషోర్ సోన్ మాట్లాడుతూ దేశంలోని గిరిజన ప్రాంతాలలో గిరిజనులు తాగునీటి ద్వారా అనారోగ్య సమస్యలు రాకుండా జలజీవన్ మిషన్ ద్వారా మారుమూల గ్రామాల్లో ఇంటింటికి తాగునీరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, ఆసుపత్రులకు, పంచాయితీ కార్యాలయాలకు, గ్రామీణ గృహాలకు,తాగునీరు అందించే విధంగా ఎక్కడికి అక్కడ చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు.ప్రతిరోజు జల జీవన్ మిషన్ ద్వారా ఒక్కొక్క కుటుంబానికి సుమారు 55 లీటర్ల సురక్షితమైన త్రాగు నీటిని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో తరతరాలుగా కాలువలు, చలమనీరు తాగేవరని,గతంలో అనారోగ్య సమస్యల బారినపడేవారని అదేవిధంగా గిరిజన ప్రాంతంలోని ప్రజలు తాగునీటి ద్వారా ఎటువంటి వ్యాధులు రాకుండా జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పందిరి మామిడి కోట గ్రామంలో జల జీవన్ మిషన్ నిధులతో రూ.15.7 లక్షల రూపాయల వ్యయంతో 20వేల లీటర్ల సామర్థం ట్యాంక్ ధ్వారా 98 కుటుంబాలకు ఇంటింటికి త్రాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు.జల జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన కుళాయిలు ప్రతి ఇంటిలో త్రాగు నీటిని వృధా చేయకుండా త్రాగునీటి కుళాయిలు చెడిపోకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నీటిని వాడుకోవాలని ఆయన అన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా ఎప్పటికప్పుడు త్రాగు నీటిని పరీక్ష చేసే విధంగా ఐదుగురు సభ్యులను గ్రామ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రతిగ్రామంలో రానున్న తరాల వారికి భూగర్భ జలాలు సుమారు 6 మీటర్లు పెంచాలని, ప్రతి వర్షపు నీటి బొట్టును వృధాకాకుండా ఎక్కడికి అక్కడ నీటిని కట్టడ చేసి భూగర్భ జలాన్ని పెంచే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. పూర్వం నుండి కాలువల నీరు తాగడం వల్ల బాగుందా? అదేవిధంగా జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు పథకం ద్వారా ఇంటింటికి కుళాయిలు వేయడం ఈ పథకం బాగున్నదా? అని గ్రామస్తులను ఆయన అడిగి తెలుసుకున్నారు. పూర్వం నుండి పందిరి మామిడి కోట లోని గిరిజనులు కాలువలోని చలమలు నీటిని ఏ విధంగా గతంలో ఏర్పాటు చేసుకున్నది ముఖ్య అతిథులు పరిశీలించారు. చలమ నీటిని వృధా కాకుండా జలదార ప్రోగ్రాం ద్వారా నీటిని గ్రామాల్లోని ప్రజలకు వివిధ రకాలైన పంటలు ఏర్పాటు చేసుకునే విధంగా జలదార ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామీణ నీటిపారు దల శాఖ సూపరిండెంట్ ఇంజనీర్ మిథిన్, ఈఈలు నాగేశ్వరరావు, గిరి, శివాజీ, డిఈ సుబ్బారావు, గ్రేస్ రాజ్, తాసిల్దార్ అమ్మాజీ, ఎంపీ డీవో చంద్రశేఖర్, ఏవో కుమారి, ఏఈలు నారాయణ రావు, ఎస్.శ్రీనివాస్, సీతారాం నాయక్, సురేష్ బాబు,డాక్టర్ నితిన్‌రెడ్డి పాల్గొన్నారు.

# భగ్గుమన్న వాణిజ్య సిలిండర్

>> ఎయిర్‌లైన్స్‌కు విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలను కూడా కేంద్రం యథాతథంగా ఉంచింది. అంతర్జాతీయ విమానసర్వీసుల సంస్థలకు మాత్రం ఐదుశాతం ధరలను పెంచారు. నెలవారీ పెరుగుదలల్లో రెండోసారి పెంచినట్లయింది. కిలోలీటరుకు 76.55 డాలర్లు పెంచారు. ప్రస్తుతం ఢిల్లీలో కిలో లీటరుకు 1511.86 డాలర్లుగా నమోదయింది. ఇదిలా ఉంటే పెట్రోలు డీజిల్‌పై లీటరుకు రూ.4-5 వరకూ పెంచే అవకాశం ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. అలాగే గృహావసరాల సిలిండర్లపైనా కూడా రూ.40నుంచి 50 వరకూ పెంచుతారన్న వార్తలు వెలవడుతుండటంతో వంటగ్యాస్ కూడా ఇకపై మరింత ప్రియం కానున్నది.

# గంజాయి మత్తుకు క్షణాల్లో చెక్!

>> ఇందుకు తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యవర్గాలు అందుబాటులో ఉంటారు. శుక్రవారం ఉదయం తిరుపతి పోలీస్ జిల్లాలో ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పోలీస్ అధికారులతో కలసి వివరించారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా విద్యాలయాలు, కళాశాలతో బాటు అన్ని గ్రామాలలో గంజాయి సేవనం వల్ల కలిగే అనర్థాలు, మత్తుపదార్థాలకు బానిసలు గాకుండా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. పదే పదే గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న 16 మంది గుర్తించి వారిపై పిడిచట్టంక్రింద కేసులు నమోదు చేయగా, వారిలో 12 మందికి ఆమోదం లభించడంతో వారిని జైలుకు పంపడమైనది, మిగతా నలుగురు పరిశీలనలో ఉన్నారు. నూతన ఒరవడితో గంజాయి సేవించే వారిని నిర్ధారించడానికి ప్రత్యేకంగా తయారు చేయబడిన మెడికల్ కిట్‌ల ద్వారా టెస్టింగుకి శ్రీకారం చుట్టామన్నారు. ఈ పరీక్ష కిట్ లను జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్‌లకు అందజేశారు. టెస్టులలో పాజిటివ్‌గా వచ్చిన వారి ద్వారా గంజాయి లభ్యతకి సంబంధించిన సమాచారం సేకరించడంతో పాటు గంజాయి సేవించే వారిలో పరివర్తన తీసుకుని రావడానికి ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. గంజాయిపై సమాచారాన్ని 1972, 112కి తెలిపితే వివరాలు గోప్యం గా ఉంచబడుతుందన్నారు. తిరుపతి జిల్లాలో గంజాయి రహిత సమాజం నిర్మాణం కోసం పోలీస్ శాఖ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. పదే పదే టెస్టుల్లో పాజిటివ్‌గా వస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు ,రవి మనోహరచారి, ఐ.రామకృష్ణ, శ్రీనివాస్, ఎస్‌బి డిఎస్ పి.గీతాకుమారి, సిఐ విక్రమ్, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, శ్రీలత పాల్గొన్నారు.

# మండుతున్న పిడుగురాళ్ల

>> రాత్రి పడిన వర్షం కాస్త ఉపశమనాన్ని కలిగించింది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో అరగంట పాటు భారీ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అయితే ప్రజలకు ఎక్కడ ఇబ్బంది కలగలేదు. వర్షం నీరు ఒక్కసారిగా పెద్ద ఎత్తున రావటంతో కాలువల్లో చెత్తాచెదారం మురుగు రోడ్డు పైకి చేరింది. విద్యుత్ సమస్య ఏర్పడిన ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు మరమ్మత్తులు చేపడుతున్నారు. శ్రీకాకుళం జిల్లా అంతటా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. జిల్లాలో తెల్లవారుజాము నుంచే పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, సారవకోట, మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లో వాన కురిసింది. అలాగే ఆమదాలవలస, సరుబుజ్జిలి, పొందూరు, టెక్కలి, జలుమూరు ,కోటబొమ్మాలి, సారవకోట, నందిగాం, ఎల్.ఎన్ పేట, హిరమండలంతో పాటు మరికొన్ని మండలాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురియడంతో ప్రయాణికులు ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ సాయంత్రం ఒక్కసారి మేఘావృతంలో వాతావరణం మారి ఈదురుగాలతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లపై ఉన్న చిన్న చిన్న దుకాణాలు, తోపుడి బళ్లు గొడుగులు గాలికి ఎగిరిపోయాయి. భారీ వర్షానికి చెట్లు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్తు అంతరాయం ఏర్పడింది.: కడప జిల్లా లింగాల మండల పరిధిలోని గుణకనపల్లి, రామట్లపల్లి, చిన్నకుడాల, మురారిచింతలతో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన వాన గాలులకు వందల ఎకరాల్లో అరటి పంట నేలమట్టమైంది. కాపు దశలో ఉన్న పంట నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందే విధంగా అధికారులు కృషి చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. విశాఖలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. తగరపువలస, ఆనందపురం ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. ఒడిశా నుంచి తెలంగాణ, ఏపీ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఆవర్తనం ప్రభావంతో కోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉంది అధికారులు తెలిపారు.ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ నగర పరిధిలోను, పలు గ్రామాల్లో కొద్ది సేపు ఈదురుగాలులు వీచాయి.కొద్దిపాటి వాన చినుకులు పడ్డాయి.గుంటూరు, కృష్ణా.ఉమ్మడి గోదావరి జిల్లాల్లోను పరిస్థితి నెలకుంది.

ఇక రానున్న రెండు రోజులు రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 64 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా పల్నాడులో 19, పార్వతీపురం మన్యంలో 10, ప్రకాశంలో 10 మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లోని 9 మండలాల్లో తీవ్ర వడగాల్పులు నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.

## కార్మిక సంక్షేమమే లక్ష్యం

>> శాతం పూర్తయ్యాయని డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి చేసి కృష్ణా జిల్లా అభివృద్ధిని నెక్స్‌లెవెల్‌కు తీసుకెళ్తామని వెల్లడించారు. భారత్ మాలా ప్రాజెక్టులో భాగంగా మచిలీపట్నం బైపాస్ 6 లైన్లుగా అభివృద్ధి చెందనుందని తెలిపారు. హైదరాబాద్ మచిలీపట్నం హైవే ఎక్స్ ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయ పడ్డారు. రాష్ట్రాన్ని పునర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఆంధ్రప్రదేశ్‌కు పునర్వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చాం.

**ప్రజల సంతోషాన్ని చూసి కష్టాన్ని మర్చిపోతున్నా:** ప్రజా ప్రభుత్వం పాలనలో ప్రజల సంతోషాన్ని చూసి కష్టాన్ని మర్చిపోతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. పెన్షన్ల పంపిణీని భారంగా చూడటం లేదని బాధ్యతగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 62.47 లక్షల మందికి ప్రతీ నెలా అందిస్తున్నామని గడచిన 22 నెలల్లో రూ.63వేల కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. ప్రతీ నెలా రూ.2,721 కోట్ల చొప్పున ఏడాదికి రూ.33 వేల కోట్లు మేర వ్యయం చేస్తున్నామని దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్దమొత్తంలో సంక్షేమం కోసం ఖర్చు చేయటం లేదన్నారు

**శరవేంగా పోలవరం పనులు:** సీఎం చంద్రబాబు సభలో తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నారు. 13 ఏళ్లక్రితం నిర్మించిన పట్టిసీమ ఎత్తిపోతలతో కృష్ణా డెల్టాకు నీటి ఎద్దడి లేకుండా పంటలు వస్తున్నాయి 2019 తర్వాత కూడా టీడీపీ ప్రభుత్వమే వచ్చి ఉంటే పోలవరం పూర్తయ్యేది. గత పాలకుల నిరక్ష్యంతో డయాఫ్రాంవాల్ కొట్టుకుపోయింది. మళ్లీ పనులు వేగంగా చేస్తున్నాం పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేస్తాం.బందరు పోర్టుకు 2014లో భూసేకరణ చేశాం. 2019లో టెండర్లు రద్దు చేసి గందరగోళం చేశారు.బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్, ఆఫ్ షోర్ పనులు శరవేగంగా జరగుతున్నాయి. డిసెంబర్ కు బందరు పోర్టు పూర్తి చేయాలని లక్ష్యం విధించుకున్నామన్నారు. మచిలీపట్నం బై పాస్ రోడ్డు 2 లేన్ల నుంచి 6 లేన్లు చేస్తున్నారు. బీచ్ రోడ్డును విస్తరిస్తున్నారు.విజయవాడ నుంచి మచిలీపట్నంకు 6 లేన్ల రోడ్డుగా విస్తరణ జరుగుతోంది. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు ఎక్స్ ప్రెస్ హైవే వస్తోంది. అభివృద్ధి జరగాలంటే భూములు ఉండాలి. అమరావతి రైతులు ఒక్క రూపాయి తీసుకోకుండా 29 వేల మంది 33 వేల ఎకరాలు అందించారు. రాజధాని రావడంతో వారి దశాదిశ మారింది.

**దేశంలోనే అతిపెద్ద పెట్టుబడి" గూగుల్ ది ":** దేశంలోనే అతిపెద్ద పెట్టుబడిగూగుల్ ది రూ.1.35 లక్షల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో పేర్కొంటూ రియలన్స్ కూడా 17 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 15 చోట్ల లేబర్ అడ్డాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేను రైతు కుటుంబం నుంచి వచ్చిన వాణ్నే..నాకూ కష్టాలు తెలుసు. ఆధునీకరణలో ముందుకెళ్తున్నాం. కార్మికుడు కొడుకు ఎందుకు ఒక పరిశ్రమ స్థాపించకూడద అన్న ఆలోచనా విధానంతో మార్పు తెచ్చుకుని నైపుణ్యం ఇచ్చి పనిముట్లు అందించే రెట్టింపుగా పని చేయవచ్చు. లేబర్ అడ్డా స్కిల్ డెవలెప్మెంట్ కేంద్రంగా మారుతుంది.



శుక్రవారం ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం దృశ్యం

# అటు ఉడుకు.. ఇటు వణుకు

>> వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూడా నేల కొరిగాయి. విద్యుత్ వైర్లు తెగి ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. దీంతో విద్యుత్ శాఖకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో విద్యుత్ సరఫరా ఎప్పుడు వస్తుందోనని ప్రజలు ఎదురు చూడవలసిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా గ్రామాలలో భారీ వర్షానికి వర్షపు నీటితో కాలువల్లో ఉన్న చెత్తాచెదారం రోడ్డుపైకి వచ్చి అపారశుద్ధం కారణంగా అంటురోగాలకు ఆహ్వానిస్తున్నాయి. పలుచోట్ల భారీ వృక్షాలు కూడా నేలకొరిగి ట్రాఫిక్ కు అడ్డంకిగా మారాయి. ఏది ఏమైనా ఈ వర్షం ప్రజలకు కొంతవరకు ఉపశమనం కలిగించినప్పటికీ, నష్టం మాత్రం ఆపారంగా లేకపోలేదు. మరో ఐదు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగవచ్చుని, అనంతరం వాతావరణం స్థిరపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అనంతరం వాతావరణం స్థిరపడే అవకాశం ఉందని చెబుతుంది. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, పిడుగులు పడే అవకాశం కూడా ఉన్నందున చెట్లు కింద నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా పమిడిముక్కలలో శుక్రవారం పర్యటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పమిడిముక్కలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముగించుకుని వేరే కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో గ్రామంలో అంగన్‌దీడీ సెంటర్ కన్పించడంతో ముఖ్యమంత్రి అక్కడ ఆగారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో కాసేపు ముచ్చటించారు. అక్కడ చిన్నారులు పాడిన రైమ్స్ విన్నారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారంపై టీచర్లు, ఆయాలను అడిగి తెలుసుకున్నారు. వారికి మంచి శిక్షణతో పాటు పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు.

## ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు రూ.501 కోట్లు చెల్లింపు

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు కూటమి ప్రభుత్వం బకాయిల్లో ఇప్పటివరకు రూ.501 కోట్లు వరకు చెల్లించింది. పెండింగులో ఉన్న మొత్తంలో ట్రై పార్టీ బిల్ డిస్కౌంటింగ్ అగ్రిమెంట్ విధానంలో రూ.1000 కోట్లు చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎన్టీఆర్ వైద్యా సేవా ట్రస్టు, ఆసుపత్రుల యాజమాన్యాల మధ్య కుదిరిన ఒప్పందాలు అనుసరించి గత సోమవారం నుంచి చెల్లింపులు జరుగుతున్నాయి. మొత్తం 278 ఆసుపత్రుల యాజమాన్యాలకు కలిపి రూ.501 కోట్ల వరకు చెల్లింపులు జరిగినట్లు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఇంఛార్జి సీఈఓ, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు నేడొక ప్రకటనలో తెలిపారు. బిల్ డిస్కౌంటింగ్ విధానంలో బకాయిలు పొందేందుకు 873 కు గాను 531 ఆసుపత్రుల యాజమాన్యాల దరఖాస్తు చేశాయి. వీటిలో 336 దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. బకాయిలపై ఆసుపత్రుల యాజమాన్యాలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చెల్లింపులు జరుగుతున్నాయి.

## కడప మాజీ మేయర్ పెద దస్తగిరి కేసులో విచారణ వాయిదా వేసిన ఏపీ హైకోర్టు

**విజయవాడ, మే 1, ప్రభాతవార్త ప్రతినిధి:**

పెద్ద దస్తగిరి హత్యఘటనలో పోలీసులు తన పై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కడప మాజీ డిప్యూటి మేయర్ నిత్యానందరెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటీషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది.తదుపరి విచారణ వేసవి సెలవుల తరువాతకి వాయిదా వేసింది. ఈ కేసుదర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, చార్జ్ షీట్ దాఖలు చేయకపోవడంతో కేసును క్వాష్‌చేసే ప్రశ్నే ఉత్పన్నం కాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. బండి నిత్యానందరెడ్డి కీలక పాత్ర అని ప్రభుత్వ తరపు న్యాయవాది పీపీ మెండా లక్ష్మీ నారాయణ వాదించారు. హత్య తరువాత నిందితులు పిటి షనర్‌నే ఆశ్రయించారన్నారు. నిందితులు పారి పోయేందుకు నిత్యానందరెడ్డి డబ్బు ఏర్పాటు చేశారని కోర్టుకు తెలిపారు. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని నిత్యానందరెడ్డికి హైకోర్టు ఆదేశించింది. బీఎన్‌ఎస్‌ఎస్‌లోని చట్టనిబంధన లను అనుసరించాలని దర్యాప్తు అధికారికి ఉత్తర్వు లిచ్చింది.పిటిషనర్‌పై హత్య కేసు నమోదు అయిందని హైకోర్టు గుర్తుచేసింది. అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంటే ముందస్తు బెయిల్ వేసుకోవా లని న్యాయస్థానం సూచించింది.ఏడేళ్లకు పైబడి శిక్షకు వీలున్న సెక్షన్లు అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది.

## అక్రమ ఇసుకపై లోకాయుక్త కొరడా

>>కృత ప్రభావంతో నిలిపివేయగా, ప్రత్యేక అమలు విభాగం పోలీసు ఇన్స్పెక్టర్ బొమ్మిశెట్టి లతకు రెండు సంవత్సరాల పాటు వార్షిక వేతన వృద్ధి వాయిదా వేయబడింది. అలాగే ఉప పోలీసు ఇన్‌స్పెక్టర్ షేక్ రజియా సుల్తానా బేగమ్‌కు కూడా రెండు సంవత్సరాల పాటు వార్షిక వేతన వృద్ధి వాయిదా విధించారు. అక్రమ ఇసుక త్రవ్వకాల నేపథ్యంలో హైకోర్టు వ్యాజ్య పిటిషన్ నెం.35899/2015 ఆదేశాల ప్రకారం బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ నుంచి ఇప్పటికే రూ.3 కోట్లు వసూలు చేయబడినట్లు వెల్లడైంది. అధికారులపై చర్యలు, జరిమానా వసూళ్లు ప్రారంభమైన నేపథ్యంలో ఈ అంశంపై మరింత జోక్యం అవసరం లేదని ఉపలోకాయుక్త అభిప్రాయపడి రెండు ఫిర్యాదులను మూసివేశారు. అయితే హైకోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తూ కేసును పునః పరిశీలించి చట్టప్రకారం సంబంధిత సంస్థపై తగిన జరిమానా పూర్తిస్థాయిలో విధించాలని ఉపలోకాయుక్త ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు.

## నేత్ర వైద్యం అందుబాటులోకి

>> అందుతుందని సీఎం అన్నారు. ఈ ఐ కేర్ సెంటర్‌కు ఏడాదికి 50 వేలమంది అవుట్ పేషెంట్లను పరీక్షించే అవకాశం ఉందని 5 వేల వరకూ శస్త్రచికిత్సలు నిర్వహించే సామర్థంతో ఏర్పాటు చేయటం సంతోషదాయకమని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీ తెలంగాణా, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో సేవలంది స్తున్న ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ లాభాపేక్ష లేకుండా సేవలంది స్తోందని సీఎం కొనియాడారు. కంటి చికిత్సల విషయంలో శ్రద్ధ తీసుకుంటూ ఈ ఏడాది 4 లక్షల కేటరాక్ట్ సర్జరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పాఠశాల విద్యార్థులకు కూడా ఐ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని సీఎం వివరించారు. ప్రభుత్వం చేపట్టిన సంజీవని ప్రాజెక్ట ద్వారా ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులతో మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలియ చేశారు. అంతకుముందు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు ఐకేర్ సెంటర్‌లోని వివిధ విభాగాలను ముఖ్యమంత్రికి వివ రించారు. ఆస్పత్రిలోని ఆధునాతన కంటి పరీక్షా యంత్రం వద్ద సీఎం కంటిని వైద్యులు పరీక్షించారు.

## వారం - వర్జ్యం

02-05-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
పాడ్యమి రా.12.51
విశాఖ పూర్తి
వర్జ్యం : ఉ.10.47-మ.12.33
దు.తె.5.42-ఉ.7.21
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** విదేశాలలోని మీ వారి నుండి ఆర్థిక సహాయాన్ని అందుకోగలుగుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**వృషభం :** ఆధ్యాత్మిక విషయాలకు, ప్రయాణములకు ఇది అనుకూల సమయము. కనుమరుగైన వస్తువులు దొరుకుతాయి.

**మిథునం:** మీరు తెలుసుకున్న సమాచారములో పొరపాటు జరిగి, అవతలవారిని అపార్థం చేసుకునే అవకాశాలు ఉన్నాయి.

**కర్కాటకం:** తొందరపడవద్దు. ఎంతో కాలముగా వాయిదా వడుతున్న విషయములు పరిష్కారమవుతాయి.

**సింహం:** దైవదర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా కాలం గడుపుతారు.వ్యాపారాలు లాభిస్తాయి.

**కన్య :** సంతాన విద్యా విషయములలో ప్రోత్సాహాన్ని చూపుతారు. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

**తుల :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. నూతన వస్తువులు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:** పైరవీలు, రాజకీయాలు, సినీ రంగంలో సరికొత్త అవకాశాలు మీకు మేలు చేకూరుస్తాయి. స్థిర చరాస్తులు కొనుగోలు.

**ధనుస్సు:** చిన్న చిన్న సినిమాలు తీయాలనుకునే ఔత్సాహికులకు సరికొత్త అవకాశాలు ముందుకు వస్తాయి.వస్తులాభం.

**మకరం:** సంతానం విద్యాపరంగా మంచి పురోభివృద్ధిని సాధిస్తారు. పలుకుబడి నామమాత్రంగా పెరుగుతుంది.

**కుంభం:** ఋణాలు చేయవలసి రావచ్చు. కొత్త వ్యాపార ప్రయత్నాలు వాయిదా వేయండి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త.

**మీనం :** స్థిరమైన నిర్ణయాలు సరిగ్గా తీసుకోలేరు. కుటుంబ సలహాలు మీ ప్రశాంతతకు భంగం కలిగించే సూచనలు.


- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సింఘాల్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

## అప్పటి ఇఒ అనిల్ కుమారే నిందితుడని స్పష్టం చేసిన దినేష్ ఏకసభ్య కమిషన్

### ప్రభుత్వానికి చేరిన నివేదిక, సింఘాల్, ఆయన సహోద్యోగులపై చర్యకు సిఫారసు

### టిటిడి కల్తీ నెయ్యి కేసు కొత్త మలుపు



**విజయవాడ.మే1,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి తిరుమల దేవస్థానం కల్తీ నెయ్యి వ్యవహారంలో అప్పటి ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌కు ఉచ్చుబిగుస్తుంది.ఈ కేసులో ఆయన ప్రమేయం స్పష్టంగా ఉన్నట్లు మాజీ సీఎస్ దినేస్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పడిన ఏకసభ్య కమిషన్ ధృవీకరించింది.ఆయననే కీలక నిందితునిగా నిర్ధారిస్తూ నివే దికను సిద్ధం చేసి, ప్రభుత్వానికి అప్పగించినట్లు కీలక సమా చారం. అంతేకాకుండా అనిల్ కుమార్ సహా అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ కమిషన్ నివేదిక ఇచ్చింది. నెయ్యి నిబంధనలను సడలించడం ద్వారా కల్తీ నెయ్యి దందాకు వైసీపీ ప్రభుత్వ హయాంలో బీజం పడింది.ఇది బహిరంగ సత్యమైన నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అప్పటి ఈవో సింఘాల్ అడ్డు చెప్పలేదని స్పష్టం చేసింది. అంతేకాకుండా అవకతవకలపై స్పష్టమై అవగాహన ఉన్నా సింఘాల్ స్పందించలేదని దినేశ్‌కుమార్ నివేదిక స్పష్టంచేసింది. సింఘాల్‌పై అభియోగాలు,ఆయనను కుంభకోణంలో కీలకగా దోషిగా పేర్కోడానికి కారణాలను ఏక సభ్యకమిషన్ నివేదిక పకడ్బంది ఆధారాలతో వివరించింది.ఇప్పటికే ఈ నివేదికను ముఖ్య మంత్రి చంద్రబాబును, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్ర సాద్‌ను కలిసి దినేష్‌కుమార్ స్వయంగా అందజేసారు.

నివేదికను పరిశీలించిన తరువాత క్రిమినల్ చర్యలకు ఆదేశించే దిశలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. తిరుమల కల్తీనెయ్యి సరఫరా విష యంలో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ జరిపింది. అధికారుల వైఫల్యాలను ఎత్తిచూపుతూ, వారిపై చర్యలుతీసుకోవాలని ప్రభుత్వానికి నివేది కలు ఇచ్చింది. వీటి ఆధారంగా అసలు కల్తీనెయ్యి కేసులో అధికా రుల పాత్ర ఏంటి? ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వా లంటూ దినేశ్‌కుమార్‌ను ఏకసభ్య కమిషన్‌గా నియమిస్తూ ప్రభు త్వం ఈ ఏడాది ఫిబ్రవరి 20న జీవో 458 జారీ చేసింది. 45 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ వ్యవహారంలో పలు లోతైన అంశాలు ఇమిడి ఉండటంతో అనంతర కాలంలో కమిషన్ విచారణ గడువును పొడిగించారు.

ఈ క్రమంలో అనేక అంశాలపై సమగ్ర పరిశీలన చేసి దినేష్‌కుమార్ నివేదిక రూపొందించారు. నిబంధనల సడలింపు వల్లే కల్తీనెయ్యి సరఫరాకు అవకాశం చిక్కిందని నివేదికలో వివరించారు. అప్పటి టీటీడీ ఈవో, ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్ సింఘాల్ పాత్ర ఇందులో ఉందని విచారణ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిసింది.

వార్త


అభిప్రాయాలు ఎప్పుడూ మార్చుకోని వ్యక్తి నిల్వ నీటితో సమానం. నిల్వ నీటిలో ఎన్నో జీవులు పెరుగుతాయి.

- ఆస్కార్‌వైల్డ్

# మాటలతో ధరలు తగ్గవు!

'పదాల కన్న గొప్పది వాక్‌శక్తి, వాక్ శక్తి కన్న గొప్పది మనస్సు, మనస్సు కన్న గొప్పది సంకల్పం. మన పాలకుల్లో ఈ సంకల్పలోపం కారణంగానే ప్రజలకు ఇక్కట్ల మీద ఇక్కట్లు వచ్చి పడుతున్నాయేమోననిపిస్తున్నది. ఇతర సమస్యల మాటలెలా ఉన్నా రోజురోజుకు పెరిగిపోతూ ప్రజాజీవితాలను నరకప్రాయంగా మారుస్తున్నది. తాజాగా వాణిజ్య సిలిండర్ ధర రూ.993 పెరిగి మూడువేల మూడువందల పదిహేను రూపాయలకు చేరుకుంది. దీని ప్రభావం ఇతర వస్తువులపైన ముఖ్యంగా హోటళ్లల్లో అమ్మే తినుబండారాలపై తీవ్రంగా ఉంటుంది. మరొకపక్క పెట్రోలు, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశాలున్నట్లు చెప్తున్నారు. కేంద్రం ప్రస్తుతానికి లేదని చెప్తున్నా పరిస్థితులు అలా కన్పించడం లేదు. ఇక నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తెచ్చే ఆలోచన కానీ, ప్రయత్నం కానీ త్రికరణ శుద్ధిగా జరగడం లేదు. ధరల నియంత్రణకు, సమీక్షలకు సమావేశాలకు కొరత లేదు. కమిటీల మీద కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. పెరుగుతున్న ధరలపై ఉక్కుపాదం మోపుతాం, అవసరం అయితే ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామంటూ ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కానీ, అటు కేంద్ర ప్రభుత్వం కానీ హెచ్చరికల మీద హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. కానీ ఇవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో దళారులు లేరు. ప్రస్తుత పాలకులే కాదు, ఏపార్టీ అధికారంలో ఉన్నా ధరలు పెరగడం, వాటిని నియంత్రిస్తామని చెప్పడం, అక్రమ నిల్వలు చేసేవారిపై చర్యలు తీసుకొని జైళ్లకు పంపుతామని బెదరించడం ఒక రివాజుగా మారిపోయింది. అయితే ఈ విషయంలో గతంలో ఎప్పుడూ చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు. రకరకాల చట్టాలు తెచ్చారు. బ్లాక్ మార్కెటీర్లను జైళ్లకు పంపారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా గడగడలాడిన సందర్భాలు లేకపోలేదు. కానీ అవి రాను రాను తగ్గిపోతున్నాయి. అధికారులను వారి వారి విధులను స్వేచ్ఛగా చేయనీయడం లేదేమోననిపిస్తున్నది. అన్నింటిలోనూ మితిమీరిన రాజకీయ జోక్యం తమ సిఫారసులకు, రాజకీయ ఒత్తిడిలకు లొంగని సమర్థులైన అధికారులను బదలీ వేటుతోనో, ఇతర కుంటిసాకులతో శంకరగిరి మాన్యాలు పట్టించడం ఏనాటి నుంచో ఆరంభమైనా ఇటీవల పెరిగిపోతున్నది. అందుకే అప్పటి భయభక్తులు ఇప్పుడు లేవు. అధికారుల్లో కూడా అంకితభావం తగ్గిందనే చెప్పొచ్చు. బిల్లు, బెల్లు అనే తీరులోనే వ్యవహరించేవారు ఎక్కువైపోయారు. దీనికితోడు రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్న కొందరు పెద్దలు మరికొందరు అక్రమ వ్యాపారస్తులతో మమేకం అవుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా మారుతున్నది. ఎన్నికలు కూడా అలానే రూపాంతరం చెందుతున్నాయి. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంత ఉందని చెప్పక తప్పదు. కొందరు బడావ్యాపారులు, మరికొందరు రాజకీయ నాయకులతో అవినాభావ సంబంధాలు ఏర్పర్చుకుంటున్నారు. చివరకు ఈ భారమంతా ప్రజలు భరించక తప్పడం లేదు. దీంతో ఎన్ని కేకలు పెట్టినా, మరెన్ని హెచ్చరికలు జారీ చేసినా తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమా అక్రమ వ్యాపారుల్లో అంతకంతకు పెరిగిపోతున్నది. ధరలు పెరగడానికి ముఖ్య కారణాల్లో ఇదొకటి. ద్రవ్యోల్బణంతోపాటుమార్కెట్ మాయాజాలం కూడా ఉందనేది నిర్వివాదం. పప్పుదినుసుల సాగు వివిధ కారణాలతో తగ్గిపోతున్న మాట వాస్తవం. ప్రకృతి సహకరించకపోవడం, అకాల వర్షాలతోపాటు చీడపీడలతో ఈసాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఈ పరిస్థితులను ముందుగానే ఊహించి దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు, దళారులుపావులు కదపడం సహజమే. ఈ విష యంలో పాలకులకు నిర్దిష్టమైన ప్రణాళిక, ముందుచూపు లేకపోవడం దురదృష్టకరం. రైతుల దగ్గర సరుకులున్నప్పుడు ధరలు పాతాళాలోకానికి పడిపోతున్నాయి. వారి దగ్గర నుండి వ్యాపారుల గోదాముల్లోకి చేరిన తర్వాత ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం ఉల్లిగడ్డల ధరలు చూసినా కిలో పది రూపాయలలోపే రైతుల వద్ద కొంటున్నారు. సాగు ఖర్చుల మాట దేవుడెరుగు. కనీసం రవాణా ఖర్చులు కూడా వస్తాయా లేదా అన్నట్లుగాఉంది పరిస్థితి. మొన్న పూల రైతులు చిత్తూరు జిల్లాల్లో రోడ్లపై పోసిపోయారు. రైతుల పరిస్థితి ఇలా ఉంటే వినియోగ దారుడికి మాత్రం ఏనిత్యావసర వస్తువులధరలు చూసినా మండిపోతున్నాయి. ఉత్పత్తులన్నీ ఎక్కడ ఏమోవుతున్నాయి? ఎక్కడెక్కడ గోదా ముల్లో ఉన్నాయి? అవి ఎవరివి? నిబంధనలు అతిక్ర మించి దాచిన అక్రమ నిల్వలు ఎన్ని? తదితర వివరాలు అధికారులకు తెలియకుండాపోయాయి. అవకాశాలు ఏమాత్రం లేవు. వాటిని బయటపెట్టి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురాగలిగితే కొంతమేరకైనా ధరలు తగ్గే అవకాశాలుంటాయి. ఇక రైతులు నేరుగా తమ ఉత్పత్తులను వినియోగదారులకు అమ్ముకునేందుకు ప్రత్యేకంగా రైతు బజార్ల విధానాన్ని ప్రవేశపెట్టారు. కానీ అది కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతున్నాయి. దళారులే పట్టాదారు పాసుపుస్తకాలు సంపాదించి రైతుల అవతారమెత్తి ఈ రైతు బజార్లలో ఏకకాలంలో అన్నిరకాల కూరగాయలు పండించినట్లు రైతు బజార్లలో పెట్టి అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు మనసు పెట్టి ఆలోచించాలి. సమీక్షలు, సమావేశాలతో కాలం గడపకుండాఅక్రమ నిల్వలను బయటకు తేవాలి. నల్లబజారులో అమ్మేవారిపై ఉక్కుపాదం మోపి ధరలను అదుపులోకి తేవాలి. ఇందు లో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదు.

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం ఈ నాలుగు వెనక్కి రావు.



ప్లినీ

సలహా ఇచ్చేటప్పుడు విచక్షణ పాటించాలి. స్వీకరించేటప్పుడు వినమ్రంగా ఉండాలి.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు

### ప్రాణాలు తీస్తున్న పేలుళ్లు

భారతదేశంలోని బాణసంచా తయారీ కేంద్రాలలో తరచుగా జరుగుతున్న పేలుళ్లు సామాన్యుల ప్రాణాలను గాలిలోదీపంగా మారుస్తున్నాయి. గతఐదు సంవత్సరాలలో సుమారు 180 ప్రమాదాలు సంభవించగా, 480 మందికిపైగా ప్రాణాలుకోల్పోవడం అత్యంత విచారకరం. ముఖ్యంగా తమిళనాడులోని విరుదునగర్ జిల్లా ఇటువంటి మరణకాండలకు కేంద్రబిందువుగా మారింది. భద్రతా ప్రమాణాలను విస్మరించడం, నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో కూడా పనులు కొనసాగించడం యాజమాన్యాల లాభాపేక్షకు నిదర్శనం. పరిమితికి మించి కార్మికులనుగుమిగూడించడం, నిషేధిత రసాయనాల వినియోగం, ముడి సరుకుల అక్రమ నిల్వలు ఈ విపత్తులకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. అనుమతి పొందిన సంస్థలు కూడా భద్రతా చర్యలను గాలికి వదిలేయడం వల్లఅమాయక కార్మికులు బలిఅవుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఎగ్జిట్ పోల్స్‌పై నమ్మకం పోతోంది

గతంలో పోలింగ్ పూర్తయిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలయ్యేవి. అవి దాదాపు వాస్తవానికి దగ్గరగా ఖచ్చితంగాఉండేవి. కానీ, నేడుఎగ్జిట్ పోల్స్ నిర్వహించేవారు. ఆయారాజకీయపార్టీలకు అనుకూలంగా సర్వే చేస్తున్నారు. దాంతో అసలు ఫలితాలను ప్రజలకు అందించలేకపోతున్నారు. గతంలో వేర్వేరు సంస్థలు నిర్వహించిన ఫలితాలు వేర్వేరుగా ఉండేవి. ఇప్పుడు అన్నిసంస్థల సర్వేలు ఒకేలా ఉండటంతో, ఎగ్జిట్ పోల్స్ పై ప్రజలలో నమ్మకంపోయింది. అందుకే ఈ ఎగ్జిట్ పోల్స్ వివాదాస్పదం అవుతున్నాయి. ఎగ్జిట్ పోల్స్ పైనిర్వహించే సంస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అంతేకాని రాజకీయ పార్టీలకుకాదనిగ్రహించాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏపిలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో ప్రజల ఫిర్యాదులు వివిధ శాఖలకుసంబంధించి ప్రత్యక్షంగా జిల్లా మేజిస్ట్రేట్ ,కలెక్టర్ వారు స్వీకరణ చేస్తూ వారికి రసీదు ఇవ్వడం ఎంతో తృప్తికరం. వారు సమస్య స్థితిని వ్యక్తంచేయడం కూడా కొంత ఉపశమనం ఉంటుంది. ఐతే ఫిర్యాదుల సంఖ్యశాఖలవారీ ప్రకటనతోపాటు, దీర్ఘకాల సమస్యలకు పరిష్కారానికి హెచ్చు ప్రాధాన్యత ఉంటుంది. వాటి స్థితిని బట్టి వ్యవధి అవసరం.

-బి. మేఘనాదం, విశాఖపట్నం

### ఏడు రోజులు ఏడు సబ్జెక్టులు

విద్యార్థి జీవితంలో పదవ తరగతి పరీక్షలు చాలా కీలకమైనవి. సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ మొదటి సర్టిఫికేట్. కొంత కాలం పూర్వం సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ అని ఉండేది. ఆ సర్టిఫికెట్ ఆధారంగానే విద్యార్థిని విద్యార్థుల పుట్టిన తేదీ ధ్రువపరచడం జరుగుతూ ఉన్నది. ఇంటర్మీడియట్ బోర్డు ఒక దోపిడీ వ్యవస్థగా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఇంటర్మీడియట్ బోర్డును రద్దుచేసి ప్రస్తుతం ఉన్న హై స్కూల్స్, హై స్కూల్ ప్లస్‌గా మార్చాలి. అదేవిధంగా ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు జనరల్ సైన్స్ ను విడదీసి విడివిడిగా భౌతిక శాస్త్రం జీవశాస్త్రం సబ్జెక్టులుగా పెట్టి ఏడు సబ్జెక్టులు పదవ తరగతి వరకు బోధించి బోర్డ్ ఎగ్జామ్స్ పెట్టాలి. ఒక ఎగ్జామినేషన్‌కు ఇంకొక ఎగ్జామినేషన్ మధ్య మధ్యలో సెలవులు ఇవ్వకుండా పరీక్షలను వరుసగా ఆదివారం కూడా మినహాయింపు లేకుండా ఏడు రోజులు ఏడు సబ్జెక్టులు పెట్టాలి.

- వీరగంట రూపవతి, బొబ్బిలి

### ఆవేదన

విదేశాలకు వెళ్లిన పిల్లలు తమ భవిష్యత్తు కోసం కష్టపడుతుంటారు, కానీ ఇక్కడ వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులు ఒంటరితనంతో జీవిస్తున్నారు. డబ్బులు పంపించడం బాధ్యతలో ఒకభాగమే గానీ, అదిప్రేమను, తోడును భర్తీ చేయదు. ఫోన్‌కాల్స్ మాత్రమేకాదు, వీడియో కాల్స్ లో చూసినంత మాత్రాన కూడా ఆ ప్రేమను అనుభవించలేరు. పిల్లల నవ్వుల్లో జీవించిన తల్లిదండ్రులు, ఇప్పుడు స్క్రీన్‌లో కనిపించే ముఖాలకే పరిమితమవ్వడం బాధాకరం. పెంచితే ఇలానా?" అన్న ప్రశ్నవారి మనసులో నిశ్శబ్దంగా మార్మోగుతుంది. వాళ్ల ఆశించేది డబ్బు కాదు, తమ పిల్లల సమీపం, స్నేహం, మమత. వృద్ధాప్యంలో ఒక దగ్గరగా ఉండటం, ఒక ఆప్యాయమైన మాట. ఇవే వారికి నిజమైన ఆనందం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### సాంకేతిక లోపం

మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ఓపెన్ కావడం లేదు. తరుచూ సాంకేతిక లోపాలు ఎదురవుతున్నాయి. ఈ ట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన పూజా వివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఈలోపం కారణంగా అనేకమంది భక్తులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.

- పి. రాజశేఖర్, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అటవీ సంస్కృతిని అణచలేమా?

*ఈ రాక్షస క్రీడ ఇంత వికృతరూపం దాలుస్తున్నా నిందితులను సాక్ష్యాలతో న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షలు వేయించలేకపోతున్నారంటే ఏమనుకోవాలి. అక్కడక్కడ కేసులు నమోదు చేసినా కొద్దిపాటి శిక్షలతో బయటపడుతున్నారు. ప్రాణ సమానంగా పెంచుకున్న తమ బిడ్డలు తమ కళ్లముందే చదువు, సంస్కారం ఉందనుకున్న వింత పశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయాలకు అతీతంగా, నిర్దిష్టమైన చర్యలు తీసుకోగలిగితే ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించే వారికి ఒక తిరుగులేని హెచ్చరికను అందించగలుగుతాం. దేశం నుంచి ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతారు. చట్టాన్ని అమలు చేసే చిత్త శుద్ధిలేనప్పుడు, త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయలేనప్పుడు ఈ చట్టాలు, శిక్షలు, హెచ్చరికలు అన్నీ నిష్ప్రయోజనమే.*

దామెర్ల సాయిబాబ

ఎన్ని చట్టాలు చేసినా, కఠిన చర్యలు తప్పవని ఎందరు నేతలు ఎన్నిసార్లు హెచ్చరించినా ర్యాగింగ్ భూతం వదిలిపెట్టడం లేదు. ఈ ర్యాగింగ్‌కు ఎందరో అమాయక విద్యార్థులు బలైపోతున్నారు. వీటిలో కొన్ని మాత్రమే వెలుగు చూస్తున్నాయి. తమకు జరిగిన అవమానాలు భరించలేక, బయటకు చెప్పుకోలేక, వారిలో వారు కుమిలిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలు చేసుకోవడానికి కూడా వెనుకాడడం లేదు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఈ ఆటవిక సంస్కృతి కొనసాగుతూనే ఉంది. చాలా సందర్భాల్లో ఈ దురదృష్టకర సంఘటనలు వెలుగు చూడడం లేదు. అయితే వైద్య కళాశాలల్లో ర్యాగింగ్‌ను నిరోధించేందుకు జాతీయ వైద్య మండలి (ఎన్ఎమ్‌సి) ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పోర్టల్ బాధిత విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతున్నది. ఇందుకు తాజాగా వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో(కెఎమ్‌సి) జరిగిన ర్యాగింగ్‌ను ఉదహరించవచ్చు. కేవలం యాప్ ద్వారానే ఈ ర్యాగింగ్ వెలుగు చూసింది. సీనియర్లు, జూనియర్ల మధ్య గొడవ జరిగింది. అయితే ఆ ఘర్షణకు సంబంధించి రెండువర్గాలు రాజీ కుదుర్చుకున్నాయి. కానీ ఆ పక్క రోజు జూనియర్స్ తమ వాట్సాప్ గ్రూపులో సీనియర్లపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు. ఈ విషయం సీనియర్లకు తెలియడంతో వసతి గృహంలోని భవనంపైకి జూనియర్లను పిలిపించి వాట్సాప్ పోస్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమేకాక మోకాళ్లపై కూర్చోబెట్టి తప్పయిందని, మరొకసారి ఇలా చేయమని క్షమాపణలు చెప్పించుకున్నారు. ఈ దృశ్యాలను కూడా జూనియర్లు సెల్‌ఫోన్‌లో రహస్యంగా రికార్డు చేశారు. దాన్ని జాతీయ వైద్య మండలి ఫిర్యాదుల పోర్టల్‌కు పంపించారు. దీంతో ఎన్ఎమ్‌సి అధికారులు వెంటనే రంగంలోకి దిగి డిఎంఇకి లేఖరాశారు. దీంతో డిఎమ్ఇ సంబంధిత ప్రిన్సిపల్‌కు సమాచారం ఇచ్చి విచారణకు ఆదేశించారు. అప్పటివరకు కెఎమ్‌సి అధికారులకు ర్యాగింగ్ విషయం తెలియలేదంటే ఏమనుకోవాలి?. దీంతో ఆఘమేఘాలపై రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి ర్యాగింగ్ జరిగిందని నిర్ధారించారు. ఏడుగురు సీనియర్లను ఆరు నెలలపాటు సస్పెండ్ చేస్తూ ప్రిన్సిపల్ ఆదేశాలు ఇచ్చారు. అలాగే కోర్సు పూర్తయ్యేవరకు వసతి గృహంలో ఉండడానికి వీల్లేదని నిర్ధేశించారు. ఇక హైదరాబాద్‌లోనిఉస్మానియా వైద్యకళాశాలలో పిజి ప్రథమ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థి ఆత్మహత్యకు సీనియర్ల ర్యాగింగే కారణమంటూ కుటుంబ సభ్యులు గత నెల పదిహేనో తేదీన ఉస్మానియ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాడని, కళాశాలలో కొందరు ర్యాగింగ్ చేస్తున్నారని ఇటీవల తమకు ఫోన్‌లో చెప్పినట్లు వారంటున్నారు. అయితే అక్కడికి వచ్చి మాట్లాడుతామని చెబితే ఫిర్యాదులు చేస్తే వేధింపులు మరింత ఎక్కువ అవుతాయని, రావొద్దని చెప్పినట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. పిజిలో తను అనుకున్న విభాగంలో సీటు రాకపోవడం వల్ల ఒత్తిడితో బాధపడుతూ ఒక మానసిక వైద్యుడి సూచనతో మాత్రలు కూడా వాడుతున్నాడని, గదిలో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు, మత్తు ఇంజక్షన్ తీసుకొని ప్రాణాలు తీసుకున్నాడనేది మరొక వాదన. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతయేడాది గుజరాత్‌లోని పాఠక్ జిల్లాలోని వైద్యకళాశాలలో సీనియర్లు ఒక జూనియర్ విద్యార్థిని మూడుగంటలపాటు నిలబెట్టి పైశాచిక ఆనందం పొందారు. దాంతో ఆ విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లి ఆతర్వాత అటునుండి అటే పరలోకానికిపయనం కట్టాడు. తెలంగాణలో ఖమ్మం జిల్లాలో కొత్తగా చేరిన ఒక విద్యార్థి హెయిర్‌స్టయిల్ బాగాలేదంటూ సీనియర్లు ర్యాగింగ్ చేశారు. ఈ విషయం ఆ కాలేజీ ర్యాగింగ్ నిరోధక కమిటీ ఇన్‌ఛార్జ్ దృష్టికి పోవడంతో జూనియర్‌పై ఆగ్రహం చేసిన సీనియర్లు తమ మీదనే ఫిర్యాదు చేస్తారా అంటూ ఆ విద్యార్థికి గుండుకొట్టించారు. ఇలా దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్ కాలేజీల్లోనే కాదు ఇప్పుడు డిగ్రీకాలేజీలు, చివరకు ఇంటర్మీడియేట్ స్థాయికి కూడా ఈర్యాగింగ్ భూతం విస్తరిస్తున్నది. దీనిని నిరోధించేందుకు చట్టాలు చేస్తున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యుజిసి) కఠిన మార్గదర్శకాలను రూపొందించింది. అయినా ఫలితం లేకుండాపోతున్నది. యేడాది యేడాదికి పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. కాలేజీల్లో జూనియర్లకు రక్షణ కవచంగా ఉండాల్సిన కొందరు అధ్యాపకులు ర్యాగింగ్ చేసేవారికి కాపలాదారు లుగా మారిపోవడం దురదృష్టకరం. 'నేను చదువుతున్న కాలేజీలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. ఫ్యాకల్టీకి చెప్పొచ్చు కదా అని మీరు అనొచ్చు. కానీ వారే నీచంగా ప్రవర్తిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలి? నాలాగే ఇక్కడ చాలామంది అమ్మాయిలు బాధపడుతున్నారు, మాలో ఎవరో ఒకరు చనిపోతేనే ఈ విషయం బయటి ప్రపంచానికి తెలుస్తుంది. అందుకే నేను ఈ పనిచేస్తున్నా' అంటూ గత యేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఒక విద్యార్థిని ప్రాణం తీసుకుంది. ఇలాంటి సంఘటనలు బయటపడినప్పుడు ప్రభుత్వాలు, భద్రతా వ్యవస్థలు, ర్యాగింగ్ నిరోధక కమిటీలు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. ర్యాగింగ్ నిరోధక నిబంధనలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ యుజిసి కళాశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తూనేఉంది. అయినా ఎలాంటి మార్పులు రావడం లేదు. కొందరు విద్యార్థులు ఈ ర్యాగింగ్ పేరుతో సాగిస్తున్న కార్య క్రమాలు వినడానికి జుగుప్సాకరంగా ఉంటున్నాయి. ఈ వికృత చేష్టలను వీడియో టేప్‌చేసి దాంతోజూనియర్లను బ్లాక్‌మెయిల్ చేసి మళ్లీ మళ్లీ ఉపయోగించుకునే తలంపు సభ్యసమాజాన్ని తలవంచుకునేలా చేస్తున్నది. కొన్నిసార్లు పోలీసులు రంగప్రవేశం చేసి, నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు చేసిన తర్వాత కూడా యాజమాన్యాలు స్పందించడం లేదు. అసలు ర్యాగింగ్ అనేది ముందుగా కేవలం ఇంజినీరింగ్, మెడికల్‌లాంటి ప్రొఫెషనల్ కాలేజీల్లో 19వశతాబ్దం ఆరంభంలో మొదలైందని చెప్తారు. ఇది రానురాను కాలేజీలన్నింటికి విస్తరించింది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఇంటర్మీడియేట్ విద్యను పూర్తిచేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకుంటూ కాలేజీలోనికి అడుగుపెట్టిన విద్యార్థులకు బెరకు, భయం పోగొట్టి నలుగురు కలిసిమెలిసి ఉండేలా చేసేందుకు చేపట్టిన పరిచయ వినోద కార్యక్రమం ఇది. ప్రారంభంలో అంతవరకే పరిమితమైంది. కానీ రాను రాను శృతిమించడంతో కొందరు విద్యార్థులకు ప్రాణాంతక, వికృత కేళిగా మారిపోయింది. పాశ్చాత్య సంస్కృతి విష వలయంలో చిక్కుకొని ఆలోచనారహితంగా చేస్తున్న ఈ ర్యాగింగ్‌ను లేత మనసులు తట్టుకోలేకపోతున్నాయి. దీనికి అశ్లీల సాహిత్యం, నీలిచిత్రాలు, మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు తోడు కావడంతో పరాకాష్టకు చేరిందని చెప్పొచ్చు. ఇప్పటికే దేశంలో ఎంతోమంది మెరికల్లాంటి విద్యార్థులు దీనికి బలైపోయారు. అకారణంగా మెరికల్లాంటి పిల్లలను కోల్పోయిన ఆ కుటుంబాల గర్భశోకాన్ని ఏమిచ్చి తీర్చగలరు? ఈ రాక్షస క్రీడ ఇంత వికృతరూపం దాలుస్తున్నా నిందితులను సాక్ష్యాలతో న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షలు వేయించలేకపోతున్నారు. అక్కడక్కడ కేసులు నమోదు చేసినా కొద్దిపాటి శిక్షలతో బయటపడుతున్నారు. ప్రాణసమానంగాపెంచుకున్న తమ బిడ్డలు తమ కళ్లముందే చదువు, సంస్కారం ఉందనుకున్న వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయాలకు అతీతంగా, నిర్దిష్టమైన చర్యలు తీసుకోగలిగితే ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించేవారికి ఒక తిరుగులేని హెచ్చరికను అందించగలుగుతాం. దేశం నుంచి ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతారు. చట్టాన్ని అమలు చేసేందుకు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయలేనప్పుడు ఈ చట్టాలు, హెచ్చరికలు అన్నీ నిష్ప్రయోజనమే. •

## ఒక్క మాట

# యుద్ధాలతో ప్రపంచం అతలాకుతలం

కనుమ ఎల్లారెడ్డి

నేడు విశ్వం యుద్ధాలతో చాలా భయానక వాతావరణం తలపిస్తోంది. రష్యా, ఉక్రెన్ యుద్ధం ఒక ప్రక్క సాగుతుండగా, మరోప్రక్క ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై దాడులతో భయకంపితుల్ని చేస్తోంది. ఇరాన్‌లో అంతా మరుభూమిని తలపిస్తోంది. అమెరికాకుతోడుగా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తోడుగా నిలిచాయి. ఇరాన్ ప్రక్క హెజ్‌బొల్లా, ఇరాకీ మిలిషియా అండగా నిలిచాయి. ఇవి లెబనాన్‌లోని తీవ్రవాద సంస్థలు. ఇందులో హెజ్‌బొల్లా భయంకరమైన సంస్థ. ఆకస్మాతుగా ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఈ దాడులను ఇజ్రాయెల్ తిప్పి కొటితే భారీ నష్టమే జరిగిపోయింది. ఇలా దాడులు, ప్రతిదాడులతో విశ్వం అతలాకుతలమవుతోంది. ఆయా దేశాలలోని పౌరులు ఏ క్షణనా ఏమి జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పుడు రష్యా, ఉక్రెన్ యుద్ధం కంటే ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల గురించే ఎక్కువగా చర్చించుకుంటున్నారు. అటు ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. ఈ పరస్పర దాడులతో మధ్యలో కువైట్, సౌది, ఖతర్ తీవ్రంగా నష్టపోతున్నాయి. ఫలితంగానే సౌదిలోని ఆరామ్ కొ చమురు కేంద్రంపై ఇరాన్ దాడి చేసి తీవ్ర నష్టం కలిగించింది. ఇలా పరస్పర దాడులతో ఏం సాధిస్తాయో అర్థం కావడం లేదు. అసలు తప్పంతా అమెరికా, ఇజ్రాయెల్ దాడులతోనే వచ్చింది. ముందు నుంచి ఇరాన్‌ను మెత్తగా మచ్చిక చేసుకుని అణుస్థావరాలు వాటిలోని నిల్వలను ధ్వంసం చేసివుంటే ఏ తగాదా ఉండేది కాదు. దీనికితోడు ఇరాన్ భద్రతా మండలి సెక్రటరీ అలీ లరీ జని మేము చర్చలకోసం ప్రయత్నం చేయడం లేదు అనడం గమనార్హం. ఒక విధంగా చుస్తే ఖమేని లక్ష్యంగా ఇది కొనసాగింది. ఇజ్రాయెల్ అత్యంత సాంకేతికతతో 'మోసద్' అనే క్షిపణితో ఇరాన్ అధినేతను మట్టు పెట్టింది. రంగంలోకి హెజ్బుల్లా రాకపోయి ఉంటే బాగుండేది. ఎందుకంటే ఏడాదిక్రితమే ఇజ్రాయెల్, హెజ్బుల్లా మధ్య కాల్పుల ఒప్పందం జరిగింది. ఇదే విషయం లెబనాన్ చెప్పినా కూడా హెజ్బుల్లా వెనక్కి తగ్గలేదు. కాని ఖమేని మృతితో ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇప్పుడు యుద్ధం భీకర రూపం దాల్చుతోంది. ఇరాన్ దాడిలో ఇజ్రాయెల్, అమెరికాకు కూడా నష్టం వాటిల్లుతోంది. అయితే ఇవి ఆ దేశాలు లెక్క చేయవు. మొత్తం ఇరాన్ పూర్తిగా మరు భూమిగా మారాలని అమెరికా, ఇరాన్ పై అత్యాధునిక ఆయుధాలు వినియోగిస్తోంది. ఇది ఇలా ఉండగా ఇజ్రాయెల్ ప్రకటన మా దాడిలో ఇరాన్ పగ్గాలు చేపట్టిన ఆయా తుల్లా ఆలీ రెజా కూడా మరణించారన్న వార్త హల్‌చల్ చేసింది. అయితే ఇరాన్ దీన్ని ధ్రువీకరించలేదు. ఇలా దేశ నాయకులను చంపుకుంటూపోతే ప్రగతి ఏ దేశమైన ఏమి సాధించలేదు. ఇలా మధ్య ప్రాచ్యం అట్టుడికిపోతోంది. ఈ యుద్ధాలతోనే వేగలేకపోతుంటే పాక్, ఆఫ్ఘానిస్థాన్ యుద్ధం మరో కోణంలో జరుగుతోంది. పాక్‌లోని బెలూచిస్థాన్ కూడా పాక్ పై గుర్రుగా ఉంది. ఇప్పుడు దేశాల మధ్య శాంతి కావాలి, అంతర్జాతీయ చట్టాలను అన్ని దేశాలు పాటించాలి. శాంతి సంస్థ ఐక్యరాజ్య సమితి మధ్యవర్తిత్వంతో దేశాలు యుద్ధం ముగించి శాంతి పరిమళాలు కురిపించాలి. ఇది ఏ స్థాయికి పోతుందో చెప్పలేం. యుద్ధం ఆపడమా, చర్చలు చేపట్టడ మా అనేది నాయకులే తేల్చుకోవాలి. చర్చలకు సిద్ధం అని ఇరాన్ చెబుతున్నప్పుడు అమెరికా అంగీకరించాలి. చర్చలుతోనే పశ్చిమ ఆసియాలో శాంతి నెలకొంటుంది అనే అభిప్రాయం వ్యక్తమావుతోంది. లేకపోతే అమాయక, ఏమి తెలియని పౌరులు మరణిస్తారు. ఇది ఎంత మాత్రం సహింపరానిది. విశ్వం యుద్ధాల మయం అయితే అభివృద్ధి కుంటు పడుతుంది. ఇప్పటికైనా నాయకులు కళ్లు తెరవాలి. హింసతో ఏదీ సాధ్యం కాదు. కనుక చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలి. •

# ప్రైవేటు ప్రయాణం నుంచి ప్రభుత్వ సారథ్యం వైపు..

రామ కిష్టయ్య సంగన భట్ల

హైదరాబాద్ మహానగర చరిత్రలో మెట్రో రైలు కేవలం ఒక రవాణా సౌకర్యం మాత్రమే కాదు, అది ఒక సామాజిక, ఆర్థిక విప్లవం. భాగ్యనగర జీవన రేఖగామారిన ఈ ప్రాజెక్టు, ఇప్పుడు ఒక కీలకమైన పరివర్తన దశలోఉంది. దశాబ్ద కాలంపాటు ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచిన ఈ ప్రయాణం, ఇప్పుడు ప్రభుత్వ సారథ్యం వైపు మళ్లుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఎల్అండ్‌టి మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్‌లో ఈక్విటీ వాటాను కొనుగోలు చేయాలని భావించడం వెనుక కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే లేదు, దాని వెనుక నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకున్న ఒక వ్యూహాత్మక దార్శనికత ఉంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు బీజాలు 2008లోనే పడ్డాయి. అప్పట్లో ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి) మెట్రో ప్రాజెక్టుగా ఇది ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మొదట మేటాస్ సంస్థకు అప్పగించినా, ఆ తర్వాత తలెత్తిన సంక్షోభాలవల్ల 2010లో ఎల్అండ్‌టి సంస్థ ఈ బృహత్తర బాధ్యతను స్వీకరించింది. సుమారు 22 వేల కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మితమైన ఈ వ్యవస్థ, మూడు ప్రధాన కారిడార్ల ద్వారా 69 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 2017 నవంబర్ 28న అప్పటి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా మియాపూర్ నుండి నాగోల్ వరకు ప్రారంభమైన ఈ ప్రయాణం, అనతి కాలంలోనే నగర వాసుల దైనందిన జీవితంలో అంతర్భాగమైంది. ప్రస్తుత గణాంకాల ప్రకారం, నిత్యం ఐదు లక్షల నుండి ఆరు లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు. ఐటీ హబ్‌లకు ప్రయాణించే ఉద్యోగులు, వాణిజ్య ప్రాంతాలకు వెళ్లే వ్యాపారులు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరికీ మెట్రో ఒక సురక్షితమైన, వేగవంతమైన మార్గంగా నిలిచింది. అయితే, ఈ వెలుగుల వెనుక ఆర్థికపరమైన సవాళ్లు కూడా ఉన్నాయి. మెట్రో ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని సమకూర్చుకోలేకపోయింది. ముఖ్యంగా కోవిడ్19 మహమ్మారి విధించిన లాక్‌డౌన్ సమయం ఈ సంస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రయాణికుల సంఖ్య తగ్గడం, నిర్వహణ ఖర్చులు పెరగడం, బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించాల్సి రావడం వంటి కారణాలతో ఎల్ అండ్ టి సంస్థ ఆర్థిక ఒత్తిడికి గురైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ ప్రాజెక్టులో భాగస్వామి కావాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ప్రభుత్వం ఈక్విటీని కొనుగోలు చేయడం వల్ల మెట్రో కేవలం ఒక వ్యాపార వస్తువుగా కాకుండా, ప్రజా సేవా దృక్పథంతో నడిచే అవకాశం ఉంటుంది. దీనివల్ల చార్జీల నియంత్రణ, భద్రత, విస్తరణ నిర్ణయాల్లో ప్రభుత్వానికి పూర్తిస్వేచ్ఛ లభిస్తుంది. మరోవైపు, హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న కొద్దీ పాత మెట్రో మార్గాలు సరిపోవడం లేదు. నగరంలోని నలు మూలలను అనుసంధానం చేయడానికి 'మెట్రో ఫేజ్2' విస్తరణ అనివార్యమైంది. ప్రభుత్వం సుమారు 76 కిలోమీటర్ల మేర కొత్త మార్గాలను ప్రతిపాదించింది. ఇందులో అత్యంత కీలకమైనది రాయదుర్గం నుండి శంషాబాద్ విమానాశ్రయం



వరకు సాగే 31కిలోమీటర్ల ఎయిర్‌పోర్టు కారిడార్. సుమారు 6,000 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఈ మార్గంవల్ల అంతర్జాతీయ ప్రయాణికులకు ట్రాఫిక్ చిక్కులు తప్పుతాయి. అలాగే నాగోల్ నుండి ఎల్బీనగర్ వరకు అనుసంధానం చేయడం, మియాపూర్ నుండి పటాన్‌చెరు వరకు పొడిగించడం వంటి ప్రణాళికలు నగర పరిధిని మరింతగా పెంచుతాయి. వీటన్నిటికంటే ముఖ్యంగా, దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న పాతబస్తీ మెట్రో అంశం ఇప్పుడు ఒకకొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఎంజీబీఎస్ నుండి చాంద్రాయణ గుట్ట వరకు పాతబస్తీ గుండా మెట్రోను నిర్మించడం సామాజికంగా, రాజకీయంగా సవాలుతో కూడుకున్నది. భూసేకరణ సమస్యలు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, ఇరుకైన రహదారులు అడ్డంకులుగా నిలిచినప్పటికీ, పాతనగర ప్రజలకు కూడా ఆధునిక రవాణాఫలాలను అందించాలని ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది. ఇది నగరంలోని రెండు విభాగాల మధ్య ఉన్న రవాణా అంతరాన్ని తొలగించి, సమగ్ర నగర అభివృద్ధికి బాటలు వేస్తుంది. మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం వల్ల లభించే మరోగొప్ప ప్రయోజనం 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్'. అంటే మెట్రో రైలును టీజీఎస్‌ఆర్‌టీసీ బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు త్వరలో రానున్న రీజినల్ రింగ్ రోడ్‌తో అనుసంధానించడం. దీనివల్ల ప్రయాణికులు ఒకే టికెట్ లేదా కార్డ్ ద్వారా వివిధ రకాల రవాణా మార్గాల్లో ప్రయాణించవచ్చు. ఇది నగరంలో వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించి, కాలుష్య నివారణకు తోడ్పడుతుంది. అలాగే 'ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్' పద్ధతిలో మెట్రో స్టేషన్ల చుట్టూ వాణిజ్య సముదాయాలను నిర్మించడం ద్వారా ప్రభుత్వం అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. కానీ ఈ ప్రస్థానంలో ఆర్థిక సవాళ్లు ప్రధానమైనవి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వివిధ సంక్షేమ పథకాలు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. ఈ క్రమంలో మెట్రో ఈక్విటీని కొనుగోలు చేయడం, కొత్త ఫేజ్ నిర్మాణానికి వేలకోట్ల రూపాయలను సమీకరించడం ప్రభుత్వానికి ఒక కత్తిమీద సాము వంటిదే. కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన వాటా, రుణాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుండి సహాయం పొందే విషయంలో రాజకీయ చతురత అవసరం. ప్రభుత్వం నియంత్రణలోకి వెళ్ళినప్పుడు ప్రైవేటు రంగంలోని చురుకుదనం, నాణ్యత తగ్గకుండా చూసుకోవడం కూడా ఒక పెద్ద బాధ్యత. బ్యూరోక్రసీ వల్ల నిర్ణయాల్లో జాప్యం జరగకుండా ఒక స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మాత్రమే ఈ లక్ష్యాలను సాధించవచ్చు. హైదరాబాద్‌ను కేవలం ఒక ప్రాంతీయ నగరంగా కాకుండా, గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆలోచనలో మెట్రో విస్తరణ ఒక ముఖ్యమైన పిల్లర్. ఐటీ, ఫార్మా రంగాలు ఇప్పటికే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఈరంగాల్లో పెట్టుబడులు పెరగాలంటే మౌలిక సదుపాయాలు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి. ఒక సమర్థవంతమైన మెట్రోవ్యవస్థ కార్బన్ ఫుట్‌ప్రింట్‌ను తగ్గించి, నగరాన్ని పర్యావరణహితంగా మారుస్తుంది. అభివృద్ధి చెందుతున్న నగరాల్లో సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థే ఆ నగర ఆర్థిక శక్తిని నిర్ణయిస్తుంది. హైదరాబాద్ మెట్రో పరిణామ క్రమం ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ నుండి ప్రభుత్వ భాగస్వామ్యం వైపు సాగుతున్న ఈప్రయాణం కేవలం యాజమాన్యమార్పు మాత్రమే కాదు, అది నగరప్రణాళికలో ఒక నూతన విప్లవం. •

# కోల్‌కతాలో తగ్గని ఉద్రిక్తత

- స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత లేదంటూ రోడ్డెక్కిన టిఎంసి
- ఇవిఎంలు ట్యాంపరింగ్ చేస్తే సహించబోమన్న సిఎం మమత
- కోలకతాలోని ఇండోర్ స్టేడియం వద్ద భారీ ధర్నా



**కోల్‌కతా, మే 1:** ఓటింగ్ ప్రక్రియ ముగిసి మే 4న ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో కొత్త వివాదం ఏర్పడింది. ఎన్నికల సంఘంపై అధికార టీఎంసీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కయ్యాయని పేర్కొంది. కొందరు వ్యక్తులు ఏ పార్టీ నేతలు అక్కడ లేకుండా స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపర్చిన ఈవీఎంలను తెరుస్తున్న వీడియో ఫుటేజ్‌ను టీఎంసీ ఎక్స్‌లో విడుదల చేస్తూ బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కుతో భారీ ఎన్నికల మోసం జరిగిందని ఆరోపించింది. పేర్ల తొలగింపు, ఓటర్లను బెదిరించడం నుంచి ఈవీఎంలను తారుమారు చేయడం వరకు ఎన్నికలను ప్రభావితం చేసే ప్రయత్నాలు పెచ్చుమీరాయని, ఇది ఒక నిస్సహాయక చర్య అని టీఎంసీ విమర్శించింది. టీఎంసీ ఆరోపణతో పార్టీ వర్గాలు ఎన్నికల సంఘం చర్యపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. టీఎంసీ నేతలు శశిపంజా, కునాల్ ఘోష్‌లు బ్యాలెట్‌బాక్స్‌లు భద్రపర్చిన కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియం బయట ధర్నా ప్రారంభించారు. బెనర్జీ భవానీపూర్, దక్షిణ కోల్‌కతాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల బ్యాలెట్ బాక్స్‌లు భద్రపర్చిన షెకావత్ మెమోరియల్ గర్ల్స్ హైస్కూల్‌కు చేరుకున్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలకు తెగించి పోరాడతామని ఆమె స్పష్టం చేశారు. ఈవీఎంల భద్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె స్వయంగా కోల్‌కతాలోని ఓ స్ట్రాంగ్‌రూమ్ వద్ద మూడు గంటలకుపైగా ఉన్నారు. దక్షిణ కోల్‌కతాలోని సాఖావత్ మెమోరియల్ స్కూల్‌లో భవానీపూర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్‌రూమ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, బ్యాలెట్ బాక్సులను తెరుస్తున్నారని టీఎంసీ ఆరోపించింది. దీనికి సంబంధించిన వీడియోలు టీవీలో చూసిన తర్వాత మమతా బెనర్జీ గురువారం రాత్రి నేరుగా అక్కడికి చేరుకున్నారు. భవానీపూర్ అభ్యర్థిగా తనకున్న హక్కుతో స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎం యంత్రాన్ని దొంగిలించడానికి లేదా కౌంటింగ్‌ను తారుమారు చేయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే మేం ప్రాణాలకు తెగించి పోరాడతామని హెచ్చరించారు. తనను మొదట సెంట్రల్ ఫోర్సెస్ సిబ్బంది అడ్డుకున్నారని, కానీ ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థిగా తనకు ఉన్న హక్కును వినియోగించుకుని లోపలికి వెళ్లానని తెలిపారు. తాజా ఆరోపణలతో పశ్చిమ బెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రూల్స్‌కు వ్యతిరేకంగా ఏం చేసినా సహించేది లేదన్నారు. కౌంటింగ్ జరిగే మే 4వ తేదీ వరకు పార్టీ వర్గాలు నిరంతరం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద గస్తీ నిర్వహించాలని పార్టీ వర్గాలకు మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో విజయం పట్ల మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో 226 సీట్లలో విజయంసాధిస్తామని ఆమె ప్రకటించారు. ఈ క్రమంలో నాయకులు, పార్టీ వర్గాలు బ్యాలెట్ బాక్స్‌లు ఉంచిన ప్రాంతంపై నిఘా ఉంచి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కౌంటింగ్‌కు ముందే స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చిన బ్యాలెట్ బాక్స్‌లను బీజేపీ తెరుస్తున్నదంటూ టీఎంసీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం గురువారం ఖండించింది. స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపర్చిన ఈవీఎంలన్నీ సురక్షితంగా, భద్రంగా ఉన్నాయని స్పష్టం చేసింది. టీఎంసీ వీడియోలో చూపింది పోస్టల్ బ్యాలెట్ల కోసం ఉద్దేశించిన మరో స్ట్రాంగ్ రూమని వివరణ ఇచ్చింది. స్ట్రాంగ్‌రూమ్‌లో కూర్చుకున్న మమతా బెనర్జీ వీడియోపై బీజేపీ నేత సువేందు అధికారి స్పందించారు. స్ట్రాంగ్‌రూమ్‌లో దీదీ ఉన్నంత వరకు తమ ఎలక్షన్ ఏజెంట్ అడ్వకేట్ సుర్యానిల్ దాస్ ఉంటారన్నారు. ఎటువంటి తప్పుడు విధానాలను ఆమె అవలంబించబోదన్న ఆశిస్తున్నట్లు తెలిపారు.

# భారత్‌గడ్డపై పాకిస్థాన్ మరోసారి ఉగ్రదాడికి కుట్ర

## నిఘా వర్గాలు హెచ్చరిక



ఆసిమ్ మునీర్

**ఇస్లామాబాద్, మే 1 :** భారత గడ్డపై మరో భారీ ఉగ్రదాడికి పాకిస్థాన్ కుట్ర పన్నుతోందని, ఈసారి జమ్మూకశ్మీర్‌ను లక్ష్యంగాచేసుకుని విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతోందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భారత్‌ను ప్రతీకార దాడులకు పురిగొల్పి, ఆ తర్వాత అమెరికా వంటి దేశాల జోక్యాన్ని కోరడం ద్వారా కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లాలనేది పాక్ పన్నాగంగా కనిపిస్తోంది. ఈ మొత్తం వ్యూహం వెనుక పాక్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ వ్యక్తిగత, రాజకీయ ఆకాంక్షలు ఉన్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. దేశీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న అసిమ్ మునీర్, తన ప్రతిష్ఠను పెంచుకోవడానికి భారత్‌పై ఒక పెద్ద దాడిని ఉపయోగించుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికా ఇరాన్ మధ్య శాంతి చర్చల్లో మధ్యవర్తిగా నిలిచి అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలన్న ఆయన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆయన దృష్టి మళ్లీ భారత్‌పైకి మళ్లింది. కశ్మీర్ అంశాన్ని రగిలించడం ద్వారా పాకిస్థాన్‌లో తన ఇమేజ్‌ను పెంచుకుని, భవిష్యత్తులో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాలనేది ఆయన దీర్ఘకాలిక ప్రణాళిక అని ఓ అధికారి తెలిపారు. ఇందుకోసం మునీర్ రెండంచెల వ్యూహంతో ముందుకెళుతున్నారు. మొదటి దశలో, కశ్మీర్‌లోని స్థానిక యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించి, చిన్నచిన్న దాడులు చేయించడం ద్వారా లోయలో అశాంతిని సృష్టించడం. దీని వల్ల పర్యాటక రంగం దెబ్బతినడంతో పాటు సరిహద్దుల్లో మోహరించిన భారత భద్రతా బలగాల దృష్టిని అంతర్గత భద్రత వైపు మళ్లించవచ్చు. రెండో దశలో, ఈ అదను చూసి సరిహద్దుల్లోని లాంచ్‌ప్యాడ్‌లలో సిద్ధంగా ఉన్న పెద్ద సంఖ్యలోని పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించి, ఒక భారీ దాడికిపాల్పడటం వారి వ్యూహంలో భాగం. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్‌చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అది తమ అంతర్గత వ్యవహారమని భారత్ గట్టిగా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భారత్ చేత సైనిక చర్యకు ఆస్కారం కల్పించి, దానిని సాకుగా చూపి అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకునేలా చేయాలన్నదే మునీర్ అసలు లక్ష్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేసినా ఫర్వాలేదన్న తెగింపుతో మునీర్ ఉన్నారని, కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడమే ముఖ్యమని మునీర్ సన్నిహితుల చెబుతున్నారు.



రోదిస్తున్న బంధువులు

# ఒడిలో నాలుగేళ్ల కుమారుడితో తల్లి మృతి

### జబల్‌పూర్‌పడవప్రమాదంలో కన్నీరు పెట్టిస్తున్న దృశ్యం

### 9కి పెరిగిన మృతులు

**జబల్‌పూర్, మే 1:** మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లోజరిగిన పడవ ప్రమాదంలో హృదయ విదారక దృశ్యం ఆవిష్కృతమైంది. గురువారం జరిగిన ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 9కి చేరగా, శుక్రవారం సహాయక బృందాలు వెలికితీసిన ఒక తల్లి, ఆమె నాలుగేళ్ల కుమారుడి మృతదేహాలు అందరినీ కంటతడి పెట్టించాయి. తుదిశ్వాస విడిచే సమయంలోనూ ఆ తల్లిబిడ్డలు ఒకరినొకరు గట్టిగా కౌగిలించుకునే ఉన్నారు. వారిద్దరికీ కలిపి ఒకే లైఫ్ జాకెట్ ఉండటాన్ని బృందాలు గుర్తించాయి. నాలుగేళ్ల తన కొడుకుని తల్లి హత్తుకుని మరణించింది. ఆ చిన్నారి తల్లిని పట్టుకుని ప్రాణాలు కోల్పోయాడు. మరణంలోనూ తల్లీకొడుకు ఒకరినొకరు విడిచిపెట్టకుండా, చివరి క్షణం వరకు హత్తుకుని ఉండిపోయారు. ఒకరినొకరు పట్టుకుని ఉండిపోయిన తల్లీకొడుకు మృతదేహాలు నీటిలో తేలడం చూసిన సహాయక బృంద సభ్యులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రతి ఒక్కరినీ ఈ దృశ్యం కదిలిస్తోంది. గుండె బరువెక్కేలా చేస్తోంది. ఈ ఇద్దరితోపాటు వీరి కుటుంబానికి చెందిన మరో ఇద్దరు ఢిల్లీ నుంచి ఇక్కడికి విహారయాత్రకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరి మృతదేహాల్ని రెస్క్యూ బృందాలు ఒడ్డుకు చేర్చాయి. జబల్‌పూర్‌లోని బార్గీ డ్యామ్ రిజర్వాయర్‌లో ముందురోజు సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. సుమారు 30 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఒక క్రూయిజ్ బోటు ఆకస్మికంగా చెలరేగిన తుపాను కారణంగా నీటిలో బోల్తా పడింది. ఇప్పటివరకు 22 మందిని సురక్షితంగా కాపాడగా, పలువురు గల్లంతయ్యారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం, స్థానిక పోలీసులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న రాష్ట్ర మంత్రి రాకేశ్ సింగ్ తల్లి, బిడ్డ మృతదేహాలను చూసి తీవ్రంగా చలించిపోయి, కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. బలమైన గాలులు వీస్తున్నప్పుడు ఒడ్డుకు తిరిగి వెళ్దామని సిబ్బందిని కోరినా వారు వినలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అందరు ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు ఇవ్వలేదని ప్రమాదం నుంచి బయటపడిన ఒకరు ఆరోపించారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ హామీ ఇచ్చారు. సహాయక చర్యలు పూర్తయిన తర్వాత ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పర్యాటక శాఖ మంత్రి ధర్మేంద్ర భవ్ సింగ్ లోధి స్పష్టం చేశారు.

## ఆస్తికోసం తల్లి, సోదరుడి హత్య

**తిరువనంతపురం, మే 1:** కేరళలో ఆస్తి కోసం కన్నతల్లిని, సోదరుడిని ఓ వ్యక్తి అత్యంత కిరాతకంగా హత్య చేసి, వారి మృతదేహాలను ఇంట్లోనే పూడ్చిపెట్టాడు. నెలరోజుల క్రితం ఇడుక్కి జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. పొన్నూట్టిల్ కుటుంబానికి చెందిన సజీ (45) తమ్ముడు రెజీ (40), తల్లి మేరీకుట్టి(65)తో కలిసి నివసిస్తున్నాడు. ఆ కుటుంబానికి చెందిన సుమారు ఎకరం భూమిని పంచుకోవడంపై సోదరుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో నెలరోజుల క్రితం ఓ రాత్రి రెజీ మద్యం సేవించి ఇంటికి వచ్చిన క్రమంలో అన్నదమ్ములు ఇద్దరికీ గొడవ జరిగింది. మాటా మాటా పెరగడంతో రెజీ ముఖంపై సజీ తీవ్రంగా దాడి చేశాడు. అతను స్పృహ కోల్పోయిన తర్వాత టవల్‌తో గొంతు నులిమి హత్య చేశాడు. ఈ హత్యను చూసిన తల్లి మేరీకుట్టిని కూడా ముఖంపై కొట్టి, ఊపిరాడకుండా చేసి చంపేశాడు. రెండు రోజుల పాటు మృతదేహాలను ఇంట్లోనే దాచిపెట్టి, ఆ తర్వాత ఇంటి ఆవరణలోనే గొయ్యి తీసి పూడ్చిపెట్టాడు. ఈ హత్యలు చేయడంలో తనకు ఎవరూ సహాయం చేయలేదని, ఒక్కడినే ఈ ఘాతుకానికి పాల్పడ్డానని సాజీ పోలీసుల ఎదుట అంగీకరించాడు. నెలరోజుల నుంచి మేరీకుట్టి, రెజీ కనిపించకపోవడంతో సజీని ఆరాతీశారు. సజీ వారికి పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దాంతో అనుమానించి ఇరుగుపొరుగు అనక్కరలో ఉండే వారి సోదరి సనీకి సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సజీ ఇంటికి వెళ్లాడు. పోలీసులను చూడగానే సజీ పారిపోయాడు. దాంతో అనుమానించిన పోలీసులు ఇంటి ఆవరణను పరిశీలించారు. తవ్వి పూడ్చిన ఆనవాళ్లు కనిపించడంతో తిరగతోడించగా రెజీ, మేరీకుట్టి మృతదేహాలు బయటపడ్డాయి. నిందితుడి కోసం తీవ్రంగా గాలించి గత నెల 28న అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కాగా 2018లో సజీ తండ్రి మాథ్యూ కూడా అదృశ్యమయ్యాడు. దాంతో ఆ ఘటనతో ఈ హత్యలకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు పట్టుకునన దృశ్యం


# మరణానికి ముందు ఎప్‌స్టీన్ ఆత్మహత్యలేఖ!



జెఫ్రీ ఎప్‌స్టీన్

**వాషింగ్టన్, మే 1:** అమెరికాలో సంచలనం సృష్టించిన లైంగిక నేరగాడు, వివాదాస్పద ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ జైలులో ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసినట్లుగా భావిస్తున్న ఒక సూసైడ్ నోట్‌ను గత ఏడేళ్లుగా అత్యంత రహస్యంగా ఉంచారన్న సమాచారం బయటకు పొక్కింది. ఈ నోట్‌ను బహిర్గతం చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో ఈ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఎప్‌స్టీన్ మృతిపై దర్యాప్తులో ఈ లేఖ కీలకం కానుందని నిపుణులు భావిస్తున్నారు. ఎప్‌స్టీన్ 2019 ఆగస్టులో మాన్‌హాటన్ కరెక్షనల్ సెంటర్‌లోని తన గదిలో మరణించిన విషయం తెలిసిందే. ఆ ఘటనకు కొన్ని వారాల ముందు జులై నెలలో అతను మొదటిసారి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ సమయంలో అతని సెల్‌మేట్, పలు హత్య కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న మాజీ పోలీస్ అధికారి నికోలస్ టార్టాగ్లియోన్‌కు ఈ నోట్ దొరికింది. వారిద్దరి గదిలోని ఒక పుస్తకంలో, పసుపు రంగు కాగితంపై ఇక వీడ్కోలు చెప్పే సమయం వచ్చిందని రాసి ఉన్నట్లు టార్టాగ్లియోన్ గుర్తించాడు. తనపై దాడి చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడని ఎప్‌స్టీన్ ఆరోపిస్తాడేమోనన్న భయంతో, టార్టాగ్లియోన్ ఆ నోట్‌ను జైలు అధికారులకు కాకుండా నేరుగా తన న్యాయవాదులకు అప్పగించాడు. వారు దాని ప్రామాణికతను నిర్ధారించుకున్నారని చెబుతున్నప్పటికీ, ఆ తర్వాత టార్టాగ్లియోన్ కేసును విచారిస్తున్న ఫెడరల్ జడ్జి ఆ నోట్‌ను సీల్‌చేసి, గోప్యంగా ఉంచాలని ఆదేశించారు. అయితే ఇప్పటివరకు ఎప్‌స్టీన్ మృతిపై దర్యాప్తు చేస్తున్న అధికారులు గానీ, న్యాయ శాఖ గానీ ఈ నోట్‌ను పరిశీలించలేదు. ఈ నోట్‌కు టార్టాగ్లియోన్ కేసుతో సంబంధం లేదని, ఎప్‌స్టీన్ చివరి రోజుల్లోని మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవడానికి, అతని మృతిపై దర్యాప్తులో ఇది కీలకమైన ఆధారమని అమెరికా మీడియావాదిస్తోంది. అందుకే దానిని బహిర్గతం చేయాలని కోర్టులో ఒక పత్రిక పిటిషన్ దాఖలు చేసింది. ప్రపంచంలోని అత్యంత శక్తిమంతులతో ఎప్‌స్టీన్ నెరిపిన లైంగిక నేరాల నెట్‌వర్క్‌కు సంబంధించిన వేలాది పత్రాలు ఇటీవల బయటకు వస్తున్న నేపథ్యంలో ఈ సూసైడ్ నోట్ ఉదంతం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఫెడరల్ సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలపై విచారణ ఖైదీగా ఉండగానే ఎప్‌స్టీన్ మరణించడం అప్పట్లో జైలు భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది.

# ట్రంప్‌పై హత్యాయత్నం వీడియో విడుదల



హిల్టన్ ఫైర్ వీడియో

**వాషింగ్టన్, మే 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనకు సంబంధించిన వీడియోను యూఎస్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు విడుదల చేశారు. గతనెల 25న వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ కార్యక్రమంలో ఈ దాడి జరిగిన విషయం తెలిసిందే. నిందితుడు కోల్ థామస్ అలెన్ సెన్సార్ గేట్ల గుండా వేగంగా పరిగెత్తుకెళ్తూ ఒక పోలీస్ అధికారిపై కాల్పులు జరిపిన దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. ఈ ఘటనలో ఒక సీక్రెట్ సర్వీస్ అధికారికి తూటా తగలగా, అది ఎవరి కాల్పుల వల్ల జరిగిందనే దానిపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వాషింగ్టన్ యూఎస్ అటార్నీ జీనైన్ పిర్రో ఈ వీడియోను విడుదల చేశారు. అధ్యక్షుడిపై హత్యాయత్నం చేసే క్రమంలో కోల్ అలెన్ సీక్రెట్ సర్వీస్ అధికారిపై కాల్పులు జరిపినట్లు వీడియోలో స్పష్టంగా ఉంది. ఇది ఫ్రెండ్లీ ఫైర్ అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని ఆమె స్పష్టం చేశారు. కాలిఫోర్నియాకు చెందిన 31 ఏళ్ల కోల్ అలెన్, ఒక పార్ట్‌టైమ్ ట్యూటర్‌గా పనిచేస్తున్నాడు. విచారణ పూర్తయ్యే వరకు జైల్లోనే ఉండేందుకు అతడు అంగీకరించాడు. అతడిపై అధ్యక్షుడిపై హత్యాయత్నంతో పాటు ఆయుధాల చట్టం కింద కేసులు నమోదు చేశారు. నేరం రుజువైతే జీవిత ఖైదు పడే అవకాశం ఉంది. దాడికి ముందు తనను తాను ఫ్రెండ్లీ ఫెడరల్ అసాసిన్ అని చెప్పుకున్న అలెన్ ట్రంప్ పరిపాలనపై తనకున్న వ్యతిరేకతను పరోక్షంగా వెల్లడించాడు. ఈ ఘటనపై స్పందించిన సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ సీన్ కరన్ భద్రతా ఏర్పాట్లను సమర్థించారు. దాడిని కేవలం కొన్ని సెకన్లలోనే భద్రతా వలయం బయటి పరిధిలోనే అడ్డుకున్నామని తెలిపారు. దాడి జరిగిన ప్రదేశానికి, ట్రంప్ ఉన్న వేదికకు మధ్య 355 అడుగుల దూరం ఉందని, మధ్యలో అనేక సాయుధ అధికారులు, పటిష్ఠమైన భద్రత ఉందని ఆయన వివరించారు.



మాట్లాడుతున్న సోఫియా ఖురేషి

# మరోసారి మీడియా ముందుకు వ్యోమికా, సోఫియాలు..!

**న్యూఢిల్లీ, మే 1:** కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మరోసారి మీడియా ముందుకు వస్తున్నారనిప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గత సంవత్సరం పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో, భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ వివరాలను వెల్లడించేందుకు ఈ ఇద్దరు అధికారిణులు మీడియా ముందుకు వచ్చారు. వీరిద్దరు మరోసారి మీడియా ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వీరితో పాటు నేవీ కమాండర్ ప్రేరణా దేవస్థలి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ పాల్గొనను న్నట్లు తెలుస్తోంది. ఈ బ్రీఫింగ్‌లో వారు ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలు, ప్రాముఖ్యత, దాని వెనుక జరిగిన ప్రణాళిక వంటి విషయాల గురించి మాట్లాడే అవకాశముంది. సోఫియా ఖురేషీ గుజరాత్‌కు చెందినవారు. బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1990లలో సైన్యంలో చేరారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా పని చేశారు. 2019లో ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదాను పొందారు. మే 7తో ఆపరేషన్ నిర్వహించి ఏడాది పూర్తవుతుండడంతో వీరు మీడియా ముందుకు వస్తున్నట్టు తెలుస్తోంది.

## హార్బజన్ సింగ్‌కు భద్రత కల్పించండి

### - పంజాబ్ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, మే 1:** రాజ్యసభ సభ్యుడు హార్బజన్ సింగ్ వ్యక్తిగత భద్రతను పునః సమీక్షించాలంటూ పంజాబ్ ప్రభుత్వానికి పంజాబ్–హర్యానా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అతడికి ఎలాంటి హానీ జరగకుండా చూడాలని ఆదేశించింది. హార్బజన్‌సింగ్ ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామాచేసి, బిజెపిలో చేరారు. దీంతో పంజాబ్ ప్రభుత్వం హార్బజన్ సింగ్‌కు వ్యక్తిగత భద్రతను ఉపసంహరించింది. ఈ ఉపసంహారణ అనంతరం, ఆప్ కార్యకర్తలు ఆయన నివాసం వెలుపల నిరసన చేపట్టారు. ప్రహరీ గోడలపై "గద్దర్"(ద్రోహి) అని స్ప్రే పెయింట్‌తో రాశారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ రాజ్యసభ ఎంపీ హార్బజన్ సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పిటిషన్‌లో, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సెక్యూరిటీ) ఎటువంటి కొత్త ముప్పు అంచనా లేదా ముందస్తు నోటీసు లేకుండా, ఏకపక్షంగా మరియు కక్షపూరితంగా తన భద్రతను ఉపసంహరించుకున్నారని హార్బజన్ సింగ్ వాదించారు. భద్రతను ఉపసంహరించుకున్న వెంటనే, ఏప్రిల్ 25 మరియు 26 తేదీలలో ఒక గుంపు తన నివాసంపై దాడి చేసిందని, అయితే స్థానిక పోలీసులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ, భద్రతను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపి, హార్బజన్ సింగ్‌కు ఎలాంటి శారీరక హాని జరగకుండా చూడాలని ఆప్ నేతృత్వంలోని పంజాబ్ ప్రభుత్వానికి పంజాబ్, హర్యానా హైకోర్టు నోటీసు జారీ చేసింది.

# బర్త్‌డేకేక్ మృతుల కేసు నిందితుడి ఎన్‌కౌంటర్

**బులంద్‌షహర్, మే 1:** ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో సంచలనం సృష్టించిన ట్రిపుల్ మర్డర్ కేసులో ప్రధాన నిందితుడు జీతూ సైనీ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అతడిపై రూ.50వేల రివార్డు ఉంది. కొన్ని రోజులుగా పరారీలో ఉన్న అతడిని గురువారం తెల్లవారు జామున పోలీసులు కాల్చి చంపారు. ధరౌ పోలీస్ అవుట్‌పోస్ట్ సమీపంలో స్కూటర్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆపమని కోరారు. వారు ఆగకుండా పోలీసులపై కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని ఝూజర్ రోడ్డులో చుట్టుముట్టగా, నిందితులు కాల్పులు కొనసాగించారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఒక నిందితుడు గాయపడగా, మరొకరు చీకటిని ఆసరాగా చేసుకుని తప్పించుకున్నాడు. గాయపడిన జీతూ సైనీని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీసు సిబ్బంది కూడా గాయపడ్డారు. ఘటనా స్థలం నుంచి ఒక పిస్టల్, బుల్లెట్లు, నంబర్ ప్లేట్ లేని స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 25న ఖుర్జాలో జరిగిన పుట్టినరోజు వేడుకలో అమర్‌దీప్ (30), మనీశ్(28), ఆకాశ్(18) అనే ముగ్గురు కుటుంబ సభ్యులను కాల్చి చంపిన కేసులో జీతూ సైనీ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. పుట్టినరోజు జరుపుకుంటున్న జీతూసైనీ ముఖానికి మృతులు సరదాగా కేక్ పూయడమే ఈ ఘర్షణకు కారణమైంది. ఈ చిన్న విషయంపై మాటామాటా పెరిగి, నిందితులు ఆయుధాలతో తిరిగి వచ్చి కాల్పులకు తెగబడ్డారు. పోలీసుల చర్యపై మృతుల కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. నిందితుల ఆస్తులను కూల్చివేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా సైనీ నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

# ఇంధన సంక్షోభంలో పాకిస్థాన్



పాకిస్థాన్‌లో పెట్రోలు కోసం బారులుతీరిన వాహనదారులు

**కరాచి, మే 1:** తీవ్ర ఇంధన సంక్షోభంతో పాకిస్థాన్ అల్లాడుతోంది. సహజ వాయువు (సీఎన్‌జీ) కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ప్రభుత్వం మరో భారం పడింది. తాజాగా పెట్రోల్, హైస్పీడ్ డీజిల్ (హెచ్‌ఎస్‌డీ) ధరలను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇరాన్ అమెరికా ఉద్రిక్తతల నేపథ్యంలో హార్మూజ్ జల సంధిలో రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో ఈ పెంపు తప్పలేదని ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త ధరలు వారం రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలిపింది. పాకిస్థాన్ పెట్రోలియం డివిజన్ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం హైస్పీడ్ డీజిల్ ధర లీటర్‌కు 19.39 పాకిస్థానీ రూపాయలు పెరిగి, 380.19 నుంచి 399.58కి చేరింది. పెట్రోల్ ధర లీటర్‌కు 6.51 పెరగడంతో, పాత ధర 393.35 నుంచి 399.86కి ఎగబాకింది. పాకిస్థాన్‌లో హైస్పీడ్ డీజిల్‌ను ప్రధానంగా రవాణా, వ్యవసాయ రంగాల్లో ఉపయోగిస్తారు. ప్రస్తుతం దేశంలో పంటల సాగు సీజన్ నడుస్తున్నందున, ఈ ధరల పెంపు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రవాణా ఖర్చులు పెరగడంతో ఇప్పటికే ఎరువుల ధరలు పెరిగాయని సర్కారు చెపుతోంది. తాజా ధరల పెంపునకు ముందే పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ప్రజలు తీవ్ర గ్యాస్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రావిన్స్ వ్యాప్తంగా సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్లు మూతపడటంతో చాలా ప్రాంతాల్లో గృహ, వాణిజ్య వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో కోతలు విధించారు. సీఎన్‌జీ అందుబాటులో లేకపోవడంతో స్కూల్ వ్యాన్లు, బస్సుల ఆపరేటర్లు చాలావరకు తమ సర్వీసులను నిలిపివేశారు. ఇది విద్యార్థుల చదువులు, దినచర్యపై ప్రభావం చూపుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక ప్రజా రవాణా వాహనాలు పెట్రోల్‌తో నడపాల్సి రావడంతో నిర్వాహకులు ఛార్జీలను విపరీతంగా పెంచారు. ఒకవైపు సీఎన్‌జీ కొరత, మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం రెట్టింపు అయింది. సీఎన్‌జీ సరఫరాను పునరుద్ధరించకపోతే సర్వీసులను పూర్తిగా నిలిపివేస్తామని రవాణా నిర్వాహకులు హెచ్చరిస్తున్నారు

# రాహుల్‌గాంధీకి ఊరట

### -ఇండియన్ స్టేట్ వ్యాఖ్యలపై ఎఫ్‌ఐఆర్ నమోదుకు నిరాకరణ

### - పిటిషన్ కొట్టివేసిన అలహాబాద్ హైకోర్టు

**న్యూఢిల్లీ, మే 1:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వివాదాస్పద "భారత రాజ్యంతో పోరాటం" వ్యాఖ్యపై ఆయనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించడానికి నిరాకరిస్తూ సంభాల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు శుక్రవారం, మే 1న కొట్టివేసింది. హిందూ శక్తి దళ్‌కు చెందిన సిమ్రాన్ గుప్తా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్ డి. చౌహాన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం దీనిని తిరస్కరించింది. గత ఏడాది జనవరిలో కాంగ్రెస్ నాయకుడు చేసిన ఈ ప్రకటన దేశవ్యాప్తంగా ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని, ఇది "రాజద్రోహ, దేశ వ్యతిరేక" ప్రకటనకు సమానమని గుప్తా తన పిటిషన్‌లో వాదించినట్లు ఐఏఎన్‌ఎస్ నివేదించింది. జనవరి 2025లో న్యూఢిల్లీలో నిర్వహించిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో గాంధీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. "తాము ఇప్పుడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, భారత రాజ్యంతోనే పోరాడుతున్నాము," అని ఆయన అన్నారు. ఆయన వ్యాఖ్యలు కేవలం రాజకీయ విమర్శలు మాత్రమే కాదని, దేశాన్ని అస్థిరపరిచే ఉద్దేశపూర్వక ప్రయత్నమని, అవి భారత రాజ్యాన్ని ఒక శత్రుశక్తిగా చిత్రీకరించాయని గుప్తా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనికి ముందు, రాహుల్ గాంధీపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ పిటిషనర్ దాఖలు చేసిన దరఖాస్తును సంభాల్‌లోని స్థానిక కోర్టు కొట్టివేసింది. ఆ తర్వాత, ఈ విషయం అలహాబాద్ హైకోర్టుకు చేరింది. అంతేకాకుండా, ఆ తర్వాత దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో, పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తాజాగా హైకోర్టు తీర్పునిస్తూ, రాహుల్‌గాంధీపై ఎఫ్‌ఐఆర్ నమోదుకు నిరాకరిస్తూ, పిటిషన్‌ను కొట్టివేసింది.

# తిరుమల సమాచారం



## వెంకన్న దర్శనానికి 20గంటలు

**● అఖిలాండం వద్ద కొబ్బరికాయలుకొట్టి**

**వెనుదిరుగుతున్న సామాన్యభక్తులు**

**తిరుమల, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్తంగా వేసవి సెలవులు మొదలవడం, వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో కలియుగ వైకుంఠం తిరుమల భక్తజనసంద్రంగా మారింది. శుక్రవారం వేకువజామునకే తిరుమలలో వైకుంఠమ్ 1,2, క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లన్నీ భక్తులతో నిండిపోయి బాటగంగమ్మ ఆలయం వరకు నాలుగుకిలోమీటర్లు ఆలయం వెలుపలకు చేరాయి. దీంతో సాధారణ సర్వదర్శనానికి 20గంటలు సమయంపైగానే భక్తులు దర్శనానికి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీగా పెరిగిన భక్తులతో కొండంతా గందరగోళంగా మారింది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు క్యూలైన్లలో నిలబడే ఓపికలేక ఆలయం ముందు అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని వెనుదిరుగుతున్నారు. లడ్డూ వితరణశాలలో భక్తులు బారులుతీరి నిలబడినా ఒక్కో భక్తునికి 4లడ్డూలు విక్రయిస్తున్నారు. వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు 18గంటలు దర్శనానికి పడుతుండగా వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులు కంపార్టుమెంట్లకు చేరుకునేందుకు మరో 10గంటలు సమయంపైగానే పట్టే సూచనలున్నాయి. భక్తులు క్యూలైన్లలో గోవిందా... గోవింద నామస్మరణ చేస్తున్నారు. రద్దీని ఊహించిన టిటిడి అధికారులు భక్తులకు నిరంతరాయంగా శ్రీవారి సేవకులతో పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, కాఫీ,మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. భక్తులు కూడా సంయమనం పాటించాలని, తమ దర్శన సమయం వచ్చేవరకు ఓపికతో క్యూలైన్లలో సకల సౌకర్యాలు అందుకోవాలని టిటిడి అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, పర్యవేక్షిస్తున్నారు.



## పత్ర పుష్పాలతో శివార్చన

**● పౌర్ణమివేళ భక్తులకు దివ్యానుభూతి**

**తిరుమల, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని వైష్ణవాలయలం కపిలేశ్వరాలయంలో శుక్రవారం పత్రపుష్ప యాగం వైభవంగా జరిగింది. ఉదయం 7గంటల నుండి 9 గంటల వరకు కపిలేశ్వర స్వామి, కామక్షి అమ్మవారి ఉత్సవర్లకు నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పంచామృతాభిషేకం, చెరుకు రసం, కొబ్బరినీళ్ళు, విబూది, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఉదయం 10గం.ల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పత్ర పుష్పయాగ మహోత్సవం జరిగింది. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి, కనకాంబరంలతో పాటు బిల్వ పత్రం, తులసి, పన్నీరు ఆకులతో స్వామి, అమ్మవార్లకు పత్ర పుష్ప యాగం నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుండి దాతలు 3 టన్నులు పుష్పాలు, పత్రాలు విరాళంగా అందించారు. ఇందులో 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలు ఉన్నాయి. ఆలయంలో అర్చక పరిచారకుల వల్ల, అధికార అనధికారుల వల్ల, భక్తుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్ర పుష్పయాగం నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు. ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, గార్డెన్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.



## తిరుపతిలో ఘంటసాలకు అభిషేకాలు

**తిరుపతి, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తమ అభిమాన గాయకున్ని స్మరించుకుంటూ ఆయన అభిమానులు ప్రతినెల ఒకటవ తారీఖున తిరుపతిలో ఆయన విగ్రహానికి మంచినీటితో శుద్ధి చేసి పుష్పాంజలతో నివాళి అర్పిస్తున్నారు. తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘంటసాల అభిమానులు ఆయన స్మరించుకుంటూ శుక్రవారం ఉదయం వివి మహల్ రోడ్‌లోని ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఘంటసాల అభిమాని సురేందర్‌ని ఘనంగా సత్కరించారు. తన గానామృతంతో తెలుగు ప్రజలను ఉర్రూతలూగించిన ఘంటసాలను స్మరించుకోవడం ప్రతి తెలుగువారి బాధ్యత అని గుర్తు చేశారు. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఘంటసాల అభిమానులు కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానందం, పోలే జనార్దన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, టీచర్ తిరుమలయ్య, గోవిందు, ప్రముఖ గాయకుడు ఆదిగురుస్వామి, పురోహితుడు సురేష్ స్వామి ఆది గురుస్వామి ఎల్ కృష్ణయ్య, తులసిరామ్ నాయుడు, కన్నప్ప గారి కేశవరెడ్డి, రామకృష్ణ మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.




## ఆద్యంతం భక్తిభావంతో దత్తాత్రేయ హోమం

**తిరుపతి, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** అవధూత మొగలిచెర్ల దత్తాత్రేయ ఆలయంలో శుక్రవారం చిత్రాపూర్ణిమ సందర్భంగా హోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, కన్వీనర్ పవని విష్ణుకౌశిక్‌ల సమక్షంలో ఆలయ అర్చకులు హోమగుండాలు వెలిగించి వేదోక్తంగా మంత్రోచ్చరణ జరిపించారు. 15 గృహస్థ కుటుంబాలు పాల్గొన్నాయి. హోమము అనంతరం భక్తులకు దత్తాత్రేయ స్వామి బృందావనం దర్శనం చేసుకొని మందిరము వద్దనే ఏర్పాటు చేసిన అన్నదానం స్వీకరించారు. పూజా వివరాలకు 99089 73699, 91828 82632, 72880 14563 నంబర్లకు సంప్రదించాలని కన్వీనర్ తెలిపారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అడుగులేస్తున్నాం!

**● తలసీమియా బాధితుడు చాగంటిపాటి వివేక్ రూ.10 వేల పింఛను అందించిన సిఎం చంద్రబాబు**



**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా తమ ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని ఎపి సిఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. అతి చిన్న వయస్సులో జన్యుపరమైన లోపాలు, ఇతర కారణాలతో ప్రాణాంతక వ్యాధులు వస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. అటువంటి చిన్నారుల వైద్యానికి ఎంత ఖర్చయిన ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. తలసీమియా, క్యాన్సర్ తదితర వ్యాధులను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం, పమిడిముక్కలలో పర్యటించారు. "పేదల సేవలో" కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ కాలనీలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు. తలసీమియాతో బాధపడుతున్న చాగంటిపాటి వివేక్ అనే 13 ఏళ్ల బాలుడుకి రూ.10 వేల పింఛను సొమ్మును అందించారు. అతని ఆరోగ్య పరిస్థితులను గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తలసీమియా వ్యాధి కారణంగా నెలకు మూడు నాలుగు సార్లు రక్త మార్పిడి చేయాల్సి వస్తోందని, ఇందుకు రూ.10,000 నుంచి రూ.15,000 వరకూ ఖర్చవుతోందని వివేక్ కుటుంబ సభ్యులు సిఎంకు దృష్టికి తీసుకొచ్చారు. చదువులోనూ వివేక్ చురుగ్గా ఉంటారని, వ్యాధి నుంచి బయటపడేందుకు సాయం అందించాలని సిఎంను కోరారు. వారి విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వివేక్ వైద్యం, చదువు విషయాలను ప్రభుత్వమే చూసుకుంటుందని తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్యం తర్వాత మరో స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదని తెలిపారు. ఒకటో తారీఖు అంటే ప్రభుత్వానికి గుర్తొచ్చేది పేదల సేవే, వారి రుణం తీర్చుకునేందుకే కష్టపడుతున్నామని స్పష్టం చేశారు. కార్మికులు, కర్షకులు, పేదల సంక్షేమం కోసమే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీలో చక్రం, నాగలి, గుడిసె పెట్టారన్నారు. ప్రభుత్వం వద్ద డబ్బు ఉన్నా లేకున్నా ప్రతీ నెలా మొదటి తారీఖు కోసం ఫించన్ నిధులు సిద్ధం చేసి ఉంచుతున్నామన్నారు. అన్న క్యాంటీన్లైనా, ఎన్టీఆర్ భరోసా ఫించన్లైనా ఇలా ఏ పథకమైనా పేదల సేవ కోసమే చేపడుతున్నామని చంద్రబాబు అన్నారు.




## అవును అమ్మ పాసయ్యింది!

**● పదోతరగతిలో తల్లీ తనయుల విజయ కేతనం**

**● ట్విట్టర్ వేదికగా మంత్రి లోకేష్ అభినందనలు**

**ఏలూరు, మే 1 పశ్చిమ గోదావరి జిల్లా ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో పదవతరగతి ఫలితాలు విడుదలయ్యాయి. హాల్ టికెట్ చేతిలో పట్టుకుని లాప్టాప్ ముందు వేసుకుని ఓ యువకుడు ఫలితం కోసం వెతుకుతున్నాడు. నంబర్ కనిపించగానే ఎగిరి గంతేశాడు విషయం అతని ఉత్తీర్ణత కాదు, ఆ విద్యార్థిని చక్కబెట్టి రోజూ బడికి పంపిన తన తల్లిది. అవును అమ్మ పాసయ్యింది. వెంటనే మరో నంబర్ తనది ఫస్ట్ క్లాస్‌లో కుమారుడు కూడా పాసయ్యాడు. వారి ఆనందానికి అవధుల్లేవు. కుటుంబమంతా కాసేపు ఆనందంతో నృత్యం చేశారు.. ఆనంద భాష్పాలు రాల్చారు. ఇది జరిగింది పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో. వివరాల్లోకి వెళితే విద్యకు వివాహం పిల్లలు వయసు అడ్డురావని నిరూపించింది ఓ గృహిణి. తన కొడుకుతో కలిసి పదవ తరగతి పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని మరోసారి రుజువు చేసింది. పాలకొల్లు మండలం పూలపల్లికి చెందిన బండారు లక్ష్మి లహరి అలియాస్ అశ్విని నిరుపేద కుటుంబం కావడంతో ఆరవ తరగతితో విద్యను ఆపేసింది. వివిధ చిన్నచిన్న వ్యాపార సముదాయాలలో పని చేసేవారు. అనంతరం పెళ్లి అవ్వడంతో సంసార జీవితంలో పడిపోయింది. కానీ తాను చదువుకోవాలన్న కోరిక అలానే ఉండిపోయింది. చదువుకోవాలని అనుకున్నప్పటికీ పరిస్థితులు అనుకూలించక చదువు మానేయడంతో తన కుమారుడు పదవ తరగతి చదువుతుండటంతో తన కుమారుని ప్రోత్సాహంతో ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో తన పెద్ద కుమారుడు విజయ్‌తో పాటు తాను ప్రైవేటుగా పదవ తరగతి పరీక్షకు కట్టి పాస్ అయింది.

**డిగ్రీ చదవాలనే లక్ష్యం:** రెగ్యులర్‌గా పరీక్షకు హాజరైన విజయ్‌కు 600 గాను 562 మార్కులు రాగా.. ప్రైవేటుగా పరీక్ష రాసిన తల్లి అశ్వినికి 500 గాను 360 మార్కులు సాధించారు. తల్లి కొడుకు ఒకేసారి పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడంతో పలువురు ఇరువురిని అభినందిస్తున్నారు. అంతేకాక కొడుకే మాస్టర్‌గా మారి తల్లికి విద్యను నేర్పడం హర్షించదగ్గ విషయం. డిగ్రీ సాధించి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే తన లక్ష్యం అని అశ్వినీ తెలియచేశారు. అశ్వినీ పట్టుదలతో పదవ తరగతి పాస్ అవ్వడంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందిస్తూ ఎక్స్ లో ట్వీట్ చేశారు.

**మంత్రి లోకేష్ ట్వీట్:** టెన్త్ క్లాస్ ఫస్ట్ క్లాసులో ఒకేసారి పాసైన తల్లీకొడుకు ఆనందానుభూతిని పంచుకుంటూ.. "పరస్పరం అభినందించుకున్న దృశ్యం ఒక అద్భుతం. మాటలలో వర్ణించలేనిది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన బండారు లక్ష్మీ లహరి గృహిణిగా ఉంటూనే చదవాలనే లక్ష్యంతో ఓపెన్ స్కూలులో చేరి టెన్త్ పరీక్షలు రాశారు. కొడుకు విజయ్ కూడా టెన్త్ ఎగ్జామ్స్ రాశాడు. ఇద్దరూ ఫలితాల కోసం ఎదురుచూసిన ఉద్విగ్న క్షణాలు..తల్లి 360 మార్కులతో, తనయుడు 562 మార్కులతో ఫస్ట్ క్లాసులో పాసయ్యారని తెలిసిన క్షణాన వారిద్దరి సంబరాలు చూసి ఎంతో ఆనందించాను. అభినందనలు తల్లీ.. ఆశీస్సులు విజయ్.. చిన్న చిన్న కారణాలతో చదువు ఆపేసిన వారు లక్ష్మీ లహరి గారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరుతున్నా" అని మంత్రి లోకేష్ రాసుకొచ్చారు.



## గోవిందరాజస్వామికి పొన్నకాల్వ ఉత్సవం

**తిరుమల, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** చిత్రాపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోవిందరాజస్వామి పొన్నకాల్వ ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా వేకుజామున 3 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామి, శ్రీకృష్ణస్వామి, ఆండాళ్ అమ్మవారు, సేనాధిపతి వారు వేర్వేరు తిరుచ్చిలపై ఊరేగింపుగా బయలుదేరి తిరుపతి రూరల్ తనపల్లి రోడ్డులోని పొన్నకాల్వ మండపానికి చేరుకున్నారు. అక్కడ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఆ తరువాత అలంకరణ, సేవాకాలం, సాత్తుమొర చేపట్టారు. సాయంత్రం 4.30 నుండి 5.30 గంటల వరకు పొన్నకాల్వ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు అక్కడినుండి బయలుదేరి తిరుచానూరు సన్నిధి వీధిగుండా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం ముందుకు చేరుకునే సమయంలో అక్కడ మహాద్వారం యొక్క ఒక తలుపును మూస్తారు (పద్మావతి అమ్మవారు తన బావఅయిన గోవిందరాజస్వామివారిని మూసిన తలుపుచాటు నుంచి చూస్తుంది అని ఐతిహ్యం). తరువాత తిరుచానూరు నుంచి ఊరేగింపుగా గోవిందరాజ స్వామి ఆలయానికి చేరుకోవడంతో పొన్నకాల్వ ఉత్సవం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ వి.ఆర్.శాంతి, ఎఇఒ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు చిరంజీవి, శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



వేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవాలు

## ధ్వజారోహణంతో ఆరంభం

**తిరుమల, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లాలోని నాగలాపురం వేదవల్లీ సమేత వేదనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ధ్వజారోహణ మహోత్సవంతో వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి పారవశ్యంతో ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నినాదాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఈ పవిత్ర కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 4.30 నుండి 5.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ఒకమారు పర్యవేక్షిస్తారని ఆధ్యాత్మిక విశ్వాసం.అనంతరం ఉదయం 5.30 నుండి 6.30 గంటల మధ్య మేషలగ్నంలో ధ్వజారోహణ ఘట్టం వైఖానస ఆగమ విధానంలో ఘనంగా నిర్వహించారు. గరుత్మంతుణ్ణి కొత్త వస్త్రంపై ఆవిష్కరించి, పూజలు చేసి ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. దీని ద్వారా 18 గణాలు, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్లు భావిస్తారు. తదుపరి ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం నిర్వహించి భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తారు. సాయంత్రం 5.30 నుండి 6.30 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7.30 నుండి 9 గంటల వరకు పెద్దశేష వాహనసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, చంగల్ రాయులు, అర్చకులు పాల్గొన్నారు.

## స్వర్ణరథంపై సిరులతల్లి పద్మావతి

**- వసంతోత్సవాల్లో వేడుకగా దివ్య దర్శనానందం**



**తిరుమల, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి తిరుమల ఆలయం తరహాలో తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయంలోనూ నిత్యకైంకర్యాలు, పూజలు పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహిస్తున్నారు. వేసవికాలంలో వేడిమి నుండి ఉపశమనం కల్పిస్తూ పద్మావతి అమ్మవారి ఉత్సవమూర్తికి జరిపిస్తున్న వసంతోత్సవాల్లో శుక్రవారం ఉదయం స్వర్ణరథోత్సవం భక్తి వైభవంతో అద్భుతంగా జరిగింది. సిరుల తల్లి పద్మావతి అమ్మ స్వర్ణరథంపై ఆశీనురాలై భక్తులకు దివ్య కటాక్షం ప్రసాదించారు. ఆలయంలో వైదిక కార్యక్రమాల అనంతరం అర్చకులు అమ్మవారి ఉత్సవమూర్తిని శాస్త్రోక్తంగా స్వర్ణరథంపై ప్రతిష్ఠించారు. అనంతరం నాలుగు మాడ వీధుల్లో స్వర్ణరథం ఊరేగుతుండగా భక్తులు పద్మావతిదేవియై నమః, గోవింద నామస్మరణలతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ప్రత్యేకంగా మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అపార భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగడం విశేష ఆకర్షణగా నిలిచింది. కర్పూర హారతులు సమర్పిస్తూ అమ్మవారి దివ్య దర్శనంతో భక్తులు ఆధ్యాత్మికానందంలో మునిగిపోయారు.

ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, ఎస్ఇ నరసింహమూర్తి, ఆలయ ఎఇఒ దేవరాజులు, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ చెంగల్ రాయులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చలపతి, భక్తులు పాల్గొన్నారు.

## తుళ్లూరులో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి

**నిర్మాణ పనులు ప్రారంభించిన నందమూరి బాలకృష్ణ**



**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి రాజధాని ప్రాంతంలోని తుళ్లూరులో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్ నూతన భవన నిర్మాణ పనులు నేడు ప్రారంభమయ్యాయి. హాస్పిటల్ ఛైర్మన్, హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సంప్రదాయంగా పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పూజలు నిర్వహించిన అనంతరం నందమూరి బాలకృష్ణ స్వయంగా ప్రొక్లైన్ ను నడిపి మట్టిని తవ్వి టిప్పర్‌లోకి ఎత్తి పోయడం అందరినీ ఆకట్టుకొంది. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ తన తల్లి నందమూరి బసవతారకం పేరుతో నిర్మాణమవుతున్న ఈ నూతన హాస్పిటల్‌ను రెండు దశలలో నిర్మిస్తామని తెలిపారు. మొదటి దశలో సుమారు రూ.700 కోట్ల వ్యయంతో 500 పడకల హాస్పిటల్ నిర్మించి రోగులకు అందుబాటులోనికి తీసుకువస్తామని వివరించారు. ఈ నూతన హాస్పిటల్‌లో క్యాన్సర్ చికిత్సకు అవసరమైన అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో పాటూ నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మొత్తం 21 ఎకరములలో నిర్మాణవుతున్న హాస్పిటల్ మొదటి దశను 2028 నాటికి పూర్తి చేసి రోగులకు సేవలు అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాదులో హాస్పిటల్ స్థాపించి 25 సంవత్సరములు పూర్తయిన నేపథ్యంలో హైదరాబాదులో భారీ కార్యక్రమం నిర్వహించబోతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెయస్ఆర్ ప్రసాద్, రావి శ్రీనివాసరావు, బాల సుబ్రహ్మణ్యేశ్వరరావు., బొర్రా రాధాకృష్ణ (గాంధీ), విజయవాడతో పాటు తుళ్లూరుకు చెందిన పలువురు స్థానిక నాయకులు, మహిళలు హాజరయ్యారు.

## పోలవరం పనులపై జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు సమీక్ష

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రం నుంచి సిఎస్ సాయి ప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు. పోలవరం పునరావాస కార్యక్రమాలు పూర్తి చేయడంపైనా ఆయన సమీక్షించారు. ఎగువ రాష్ట్రాల అభ్యంతరాలు, వాటితో సమన్వయం వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. రెండో దశ భూసేకరణ, పునరావాస ప్యాకేజీ అమలుపైనా చర్చించినట్లు తెలిసింది. ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో 194.6 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించే అంశంపై సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది.. భద్రాచలం ముంపుపై వస్తున్న అభ్యంతరాలపైనా సమావేశంలో కీలకంగా చర్చించారు. ఈ సమావేశ వివరాలు పూర్తి స్థాయిలో వెల్లడి కావాల్సి ఉంది.

## నలుగురు ఫుడ్ సేఫ్టీ ఉద్యోగుల సస్పెన్షన్

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** విధుల నిర్వహణలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన నలుగురు ఉద్యోగులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సస్పెండ్ చేసింది. మంగళగిరిలోని ఆహార భద్రత శాఖ ప్రధాన కార్యాలయంలో పనిచేసే సూపరింటెండెంట్ డి.శిరీష, సీనియర్ అసిస్టెంట్స్ జి.అఖిల్, సంగీతరావు, జె.సుజాత సస్పెండ్‌కు గురైన వారిలో ఉన్నారు. అనధికారికంగా సెలవుపై వెళ్లడం, విశ్రాంత ఉద్యోగికి ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల విషయంలో తగిన విధంగా స్పందించకపోవడం వంటి కారణాలతో సుజాతను, విధుల నిర్వహణలో ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకపోవడం, ఇతర కారణాలతో మిగిలిన వారిని సస్పెండ్ చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఫిర్యాదులపై విచారణ జరిపిన అనంతరం నలుగురిని సస్పెండ్ చేస్తూ ఇనిస్టూట్ ఆఫ్ ప్రీవెంటివ్ మెడిసిన్ ఇంచార్జి డైరెక్టర్, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఆదేశాలు జారీచేశారు. విధుల నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టంచేశారు.

## ఎస్వీ శిల్పకళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**● మే 4 నుండి జూన్ 20 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**తిరుమల, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడి ఆధ్వర్యంలో ఏకైక సంప్రదాయ శిల్ప శిక్షణ సంస్థ సాంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పకళను సంరక్షిస్తూ, భవిష్యత్ తరాలకు అందించడంలో టిటిడి విశిష్ట సేవలందిస్తోంది. ఈ క్రమంలో, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర సాంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పకళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. నాలుగు సంవత్సరాల డిప్లొమా కోర్సు, రెండు సంవత్సరాల సర్టిఫికేట్ కోర్సులకు మే 4వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులను జారీ చేసి, స్వీకరించనున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు దరఖాస్తులను కళాశాలలో నేరుగా పొందవచ్చు లేదా టిటిడి వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 20వ తేదీ సాయంత్రం లోపు అందజేయాలి. ప్రవేశం పొందిన విద్యార్థుల పేరిట టిటిడి ఒక లక్ష రూపాయలను జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేసి, కోర్సు పూర్తి చేసిన తరువాత నిబంధనల ప్రకారం వడ్డీతో సహా అందజేస్తుంది. మరిన్ని వివరాలకు వేంకటేశ్వర సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పశిక్షణ సంస్థ, తిరుమల తిరుపతి దేవస్థానములు, అలిపిరి రోడ్, తిరుపతి- 517507, వెబ్‌సైట్: డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తిరుమల.ఒఆర్‌జి.కి ఫోన్: 0877-2264637 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## విజయవాడలో అమానుషం

**● రెండేళ్ళ చిన్నారిని గోడకేసి చంపేశాడు**

**విజయవాడ. మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో అమానుష ఘటన చోటు చేసుకుంది. చెంచుల కాలనీకి చెందిన ఒక మహిళకు, వంశీ అనే వ్యక్తితో ఏర్పడిన వివాహేతర సంబంధం ఉంది. ఈ బంధమే. రెండేళ్ల చిన్నారి దారుణ హత్యకు కారణమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విజయవాడలోని సత్యనారాయణ పురంలో వంశీతో కలిసి ఓ మహిళ సహజీవనం చేస్తోంది. తన భర్తను, కుటుంబాన్ని వదిలేసి, గత రెండు నెలలుగా తన ఇద్దరు పిల్లలతో (ఐదేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె) కూడా అక్కడే ఉంటున్నారు. ఇటీవల వంశీకి, ఆ మహిళకు మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. ఆ వాగ్వాదంలో ఆగ్రహానికి లోనైన వంశీ.. రెండేళ్ల చిన్నారిని విచక్షణారహితంగా గోడకేసి కొట్టాడు. ఆ దెబ్బలకు తాళలేక పాప ప్రాణాలు విడిచింది. చిన్నారి చనిపోయిన తర్వాత, విషయం బయటకు రాకుండా ఉండేందుకు అనారోగ్యంతో చనిపోయిందని ఆమె తన భర్తకు సమాచారం ఇచ్చింది. పాప తల్లి, ఆమె ప్రియుడు పన్నిన కుట్రను భర్త పసిగట్టగలిగారు. ఈ మొత్తం దారుణాన్ని ఆమె ఐదేళ్ల కుమారుడు కళ్లారా చూశాడు. తండ్రి అడిగినప్పుడు, వంశీనే తన చెల్లిని కొట్టి చంపినట్లు ఆ బాలుడు వివరించాడు. కొడుకు చెప్పిన మాటలు, పాప మృతిపై ఉన్న అనుమానాలతో తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టగా.. పోస్టుమార్టం నివేదిక, బాలుడి వాంగ్మూలం ఆధారంగా వంశీనే హత్య చేసినట్లు నిర్ధారించారు. నిందితుడు వంశీని అదుపులోకి తీసుకున్నారు. మహిళ పాత్రపై కూడా పోలీసుల విచారణ కొనసాగుతోంది.



## సిపిఎస్ రద్దుచేసే వరకు పోరాటం ఆగదు

### ● రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్

**తిరుమల, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** మే డే సందర్భంగా కడపలో జరిగిన "సిపిఎస్ రద్దు మహాసంకల్ప గర్జన" కార్యక్రమం విజయాన్ని సాధించిందని ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుండి భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని తమ ఐక్యతను, అచంచలమైన పోరాట సంకల్పాన్ని ఘనంగా వ్యక్తం చేశారు. "ఉద్యోగుల ఐక్యతే సిపిఎస్ రద్దుకు ప్రధాన బలం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సిపిఎస్ విధానం ఉద్యోగుల భవిష్యత్తును పూర్తిగా అనిశ్చితిలోకి నెట్టేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల జీవితాన్ని, వారి రిటైర్మెంట్ భద్రతను స్టాక్ మార్కెట్‌పై ఆధారపడే విధంగా మార్చిన సిపిఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను గౌరవిస్తూ, పాత పెన్షన్ విధానం వెంటనే అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. "ఇది కేవలం పెన్షన్ కోసం చేసే పోరాటం కాదని, ఇది ఉద్యోగుల గౌరవం, భద్రత, కుటుంబాల భవిష్యత్తు కోసం చేసే సమగ్ర పోరాటం అని, సిపిఎస్‌రద్దు అయ్యే వరకు, ఓపిఎస్ అమలు అయ్యే వరకు మా పోరాటం ఆగదు, తగ్గదు, ముగియదు" అని చీర్ల కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్. సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వర్ రావు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు వంకీపురం పవన్, మహిళా అధ్యక్షురాలు గుంటూరు రేఖ, సభ్యులు మణికంత, రామాంజినేయులు, మురళి, రాంభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ ఉత్తీర్ణులకు డి.సిఎం శుభాకాంక్షలు

### ● విద్యాశాఖ మంత్రిగా లోకేష్ ప్రణాళికలపై ప్రశంసలు

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో చేపడుతున్న సంస్కరణల వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన అన్నారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం సుమారు 4శాతం మేర మెరుగుపడిందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ అమలు చేస్తున్న ప్రణాళికలు ప్రశంసనీయమని కొనియాడారు. మెగా పేరెంట్‌టీచర్స్ మీట్, పరీక్షలకు ముందు ప్రవేశపెట్టిన 100 రోజుల ప్రణాళిక వంటి కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇచ్చాయని వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని పవన్ పేర్కొన్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరగడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. ఈ విజయం వెనుక అవిశ్రాంతంగా కృషి చేసిన ఉపాధ్యాయులకు, విద్యాశాఖ అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## డి.సిఎం పవన్‌పై పివి సింధు ప్రశంసలు

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ప్రముఖ భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుపశంసలు కురిపించింది. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన ప్రకటనపై ఆమె స్పందించింది. కార్మికుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధిపై ఏపీ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతను సింధు అభినందించింది. ఈ సందర్భంగా పీవీ సింధు "ఎక్స్" వేదికగా స్పందిస్తూ, "కార్మికుల సంక్షేమం, గౌరవం, సామాజిక భద్రత పట్ల ప్రభుత్వ నిబద్ధతను చూడటం చాలా సంతోషంగా ఉంది. దీనితో పాటు గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌ను బలోపేతం చేయడంపై దృష్టి సారించడం అభినందనీయం. మేడే రోజున ఇది ఎంతో అర్థవంతమైన సందేశం. మన ప్రియమైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి నా హృదయ పూర్వక శుభాకాంక్షలు" అని పేర్కొంది.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

### ● టిడిపి లోక్‌సభాపక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు



**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆన్‌లైన్ వేదికగా జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ ఎంపీ, లోక్‌సభా పక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. సెకండ్ హ్యాండ్ వస్తువుల పేరుతో సైబర్ నేరగాళ్లు అమాయకులను ఎలా దోచుకుంటున్నారో వివరిస్తూ ఆయన ఒక కీలకమైన పోస్ట్ చేశారు. వైజాగ్ సిటీ పోలీసులు రూపొందించిన అవగాహన వీడియోను షేర్ చేస్తూ, ఆన్‌లైన్ బేరాల వెనుక ఉన్న ప్రమాదాలను ఆయన ఎత్తిచూపారు. "ఉచితంగా ఏదీ రాదు, తక్కువ ధరకు అంతకన్నా రాదు" అని గుర్తుంచుకోవాలని శ్రీకృష్ణదేవరాయలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఓఎల్ఎక్స్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో కొందరు కేటుగాళ్లు తాము ఆర్మీ లేదా పోలీస్ అధికారులమని చెప్పి, నకిలీ ఐడీ కార్డులు చూపిస్తూ నమ్మబలుకు తున్నారని తెలిపారు. తక్కువ ధరకే వస్తువులు అమ్ముతామని చెప్పి, డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నారని వివరించారు. ఇలాంటి మోసాల బారిన పడి కష్టార్జితాన్ని కోల్పోవద్దని ఆయన హెచ్చరించారు. ఒకవేళ పొరపాటున సైబర్ మోసగాళ్ల చేతిలో డబ్బులు కోల్పోతే ఏమాత్రం ఆలస్యం చేయవద్దని ఆయన సూచించారు. మోసపోయినట్టు గ్రహించిన మొదటి గంట అత్యంత కీలకమ ని, వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. ఈ సమాచారాన్ని అందరికీ షేర్ చేసి, ఇతరులను కూడా కాపాడాలని ఆయన కోరారు.

## నేడు మొబైల్ ఫోన్లకు
## పెద్ద బీప్ సౌండ్‌తో కూడిన ఈ సందేశం

### ● ఆందోళన చెందవద్దన్న ఎపిఎస్‌డిఎంఎ అధికారులు

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలోని మొబైల్ వినియోగదారులకు ఈ నెల 2 శనివారంన ఒక ప్రత్యేక హెచ్చరిక సందేశం రానుంది. పెద్ద బీప్ సౌండ్‌తో కూడిన ఈ సందేశం చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది కేవలం ప్రయోగాత్మకంగా పరీక్షించడంలో భాగమేనని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా అత్యవసర హెచ్చరికల వ్యవస్థను బలోపేతం చేసేందుకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వెల్లడించింది. శనివారం ఉదయం 11:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల మధ్యలో ఏపీ రాజధాని ప్రాంతాల్లోని అన్ని మొబైల్ ఫోన్లకు సెల్ బ్రాడ్‌కాస్ట్ టెక్నాలజీ ద్వారా ఒక టెస్ట్ మెసేజ్ పంపనున్నారు. విపత్తుల సమయంలో ప్రజలను తక్షణమే అప్రమత్తం చేసేందుకు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశారు. "అప్రమత్తమైన పౌరులు, సురక్షితమైన దేశం" అనే నినాదంతో ఈ వ్యవస్థ పనిచేస్తుంది. "ఇది భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ విభాగం ద్వారా పంపబడిన నమూనా పరీక్ష సందేశం. దయచేసి ఈ సందేశాన్ని విస్మరించండి. మీ వైపు నుంచి ఎటువంటి చర్య అవసరం లేదు" అనే సమాచారంతో ఈ ఫ్లాష్ మెసేజ్ మొబైల్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ పరీక్ష ద్వారా నెట్‌వర్క్ సామర్థ్యాన్ని, హెచ్చరికలు చేరే వేగాన్ని అధికారులు అంచనా వేస్తారు. భవిష్యత్తులో తుపానులు, భూకంపాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు తక్షణ సమాచారం అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడనుంది.

# ఇంటి ముంగిటికే పెన్షన్లు

### ● అవ్వా, తాతలు ఆనందం ● పింఛన్ల పంపిణీలో ఆదర్శం ● మంత్రి నారాయణ వెల్లడి



**నెల్లూరు, మే 1, ప్రభాతవార్త-వైద్యం:** మంత్రి స్వయంగా ఇంటికొచ్చి పెన్షన్ అందించటంతో ఆనందం వెలిబుచ్చిన అవ్వా,తాతలు. క్రమం తప్పకుండా ప్రతీ నెలా ఒకటో తేదీ పెన్షన్ అందుతుండటంతో హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు మన్సూర్ నగర్‌లో వ్యాపారస్తులను పలకరిస్తూ ముందుకు సాగిన మంత్రి. మంత్రి నారాయణ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచే రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ పండుగలా జరుగుతోంది. తొలిరోజే 99 శాతం పెన్షన్‌లను ప్రతినెలా లబ్ధిదారుల ఇంటి ముంగిటికే చేస్తున్నాము. పెన్షన్ లు అందుకొన్న అవ్వా తాతలు, అక్క చెల్లెమ్మలు, దివ్యాంగుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. 2024 ఎన్నికల్లో పెన్షన్ మొత్తాన్ని 4 వేలు చేస్తానని, మూడునెలల బ్యాలెన్స్ కూడా కలిపి ఇస్తానని చంద్రబాబు మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వికలాంగుల పెన్షన్లను రూ.6,000కు, పూర్తి వికలాంగుల పెన్షన్లను రూ.15,000 కు, కిడ్నీ, కాలేయ, గుండె మార్పిడి, బోదకాలు, మూత్రపిండ వంటి దీర్ఘకాలిక వ్యాధుల పెన్షన్లను రూ.10,000కు పెంచి, జూలై 1, 2024 నుండి అమలు చేస్తున్నారు. మనపొరుగు రాష్ట్రాలు తెలంగాణాలో 2016 రూపాయలు, తమిళనాడులో 1000 రూపాయలు, కర్ణాటకలో 600 రూపాయలు మాత్రమే సామాజిక పెన్షన్ కింద అందిస్తున్నారు. వెస్ట్ బెంగాల్, మహారాష్ట్ర, జార్ఖండ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో సైతం పెన్షన్ కింద వెయ్యి రూపాయాలే చెల్లిస్తున్నారు. కేంద్రపాలిత ప్రాంతాలైన ఢిల్లీ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్, అరుణాచల్ ప్రదేశ్, చండీఘర్ లక్షద్వీప్, జమ్మూ కాశ్మీర్, డయ్యు డామన్ లలో సైతం వెయ్యి నుంచి రెండువేల ఐదువందల లోపే పెన్షన్‌లకు ఇస్తున్నారు. నాగాలాండ్, మణిపూర్, అస్సాం, మిజోరాం, ఛత్తీస్ ఘడ్, బీహార్ రాష్ట్రాల్లో 500 రూపాయల లోపే పెన్షన్ అందిస్తున్నారు. బాలారిష్టాలను అధికమిస్తూ ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పెన్షన్‌లను క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్న ప్రభుత్వం మాది. ఇదంతా డబ్బులుండి చేయటం లేదు. జగన్ ప్రభుత్వం రాష్ట్రం పై మోపివెళ్లిన పదిలక్షల కోట్ల భారం మోస్తూ సీఎం అపార అనుభవంతో మాట నిలబెట్టుకొంటున్నారు. వైఎస్సార్సీపీ అస్తవ్యస్థ పాలనతో దారితప్పిన వ్యవస్థలను పట్టాలెక్కిస్తూ గాడిలో పెడుతున్నారు. పరిశ్రమలు వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమోతుంది సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ పెట్టుబడులు రాబట్టేందుకు కృషి చేస్తున్నారు దేశంలోనే అత్యధికంగా 25 శాతం పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారు యువతకు ఉపాధి అవకాశాలు పెరగబోతున్నాయి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడుతోంది నియోజకవర్గ వాసులకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాను అన్ని పనులను పూర్తి చేస్తాను ప్రతీ వీధిలో చెట్లు నాటి నెల్లూరుని గ్రీన్ సిటీ గా మారుస్తాను చెప్పిన దానికంటే ఎక్కువ చేసి చూపిస్తాను వీఆర్సీ ఫ్లై విమర్శలకు ప్రజలే సమాధానం చెబుతారు. పేదపిల్లల భవిష్యత్తుకు బాటలు వేయటాన్ని కూడా కొంతమంది జీర్ణించుకోలేక పోతున్నారు.

జిల్లాలో తొలిసారి మహానాడు జరగబోతోంది. బహిరంగసభకు ఐదు లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాము. అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తాము. సమిష్టికృషితో మహానాడును విజయవంతం చేస్తాము. ఈ కార్యక్రమంలో కమిషనర్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, నందన్, మేయర్ సుజాతా అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, కార్పొరేటర్ కరీముల్లా, డివిజన్ ప్రెసిడెంట్ ఖలీల్, క్లస్టర్ ఇంచార్జి మొయినుద్దీన్, టీడీపీ పార్లమెంటరీ మైనారిటీ సెక్రటరీ కాలేషా, టీడీపీ మహిళా విభాగం నేతలు రేవతి, రాజేశ్వరి పాల్గొన్నారు.



## గరుడునిపై వేంకటాద్రివాసుడు అభయం

**తిరుమల, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** 108 వైష్ణవదివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంది. గరుడవాహనంద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజేశారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవదధిష్టితుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజేశాడు. పవిత్రమైన చైత్రపౌర్ణమివేళ సాయంత్రం విశేషాభరణాల అలంకృతుడైన మలయప్పస్వామి తనకెంతో ప్రీతిపాత్రమైన గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో ఊరేగారు. జగన్నాటక సూత్రధారి మలయప్పస్వామి భక్తజనానికి దర్శనమిచ్చాడు. భక్తుల గోవిందనామ్మరణల మధ్య మెల్లగా మలయప్పస్వామి భక్తకోటిని కరుణిస్తూ సకలం నేనున్నా నంటూ అభయమిచ్చాడు. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, టిటిడి అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## నేటి నుండి అన్నమయ్య జయంతి ఉత్సవాలు



**తిరుమల, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** సంకీర్తనలతో శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 618వ జయంతి ఉత్సవాలు నేటి నుండి మే 8వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు టిటిడి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరంలలో జయంతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తాళ్లపాకలోని ధ్యానమందిరంలో నేటి ఉదయం 9 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మొదటగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు, స్థానిక కళాకారులతో సప్తగిరి సంకీర్తన గోష్ఠిగానం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీవారి కల్యాణం కన్నుల పండుగగా జరుగనుంది. 8వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు గాత్ర సంగీతం, హరికథ, నృత్య, నాటక ప్రదర్శన కార్యక్రమాలు జరుగనున్నాయి. రాజంపేటలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద నేటి సాయంత్రం 6.30 గంటలకు ఊంజల్ సేవ జరుగనుంది. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలోనేటి ఉదయం 9 గంటలకు సప్తగిరి సంకీర్తన గోష్ఠిగానంతో జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 10 నుండి 11.30 గంటల వరకు సంగీత సభ, ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హరికథ గానం జరుగనుంది. మే 3 నుండి 7వ తేదీ వరకు ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాహిత్య సదస్సులు జరుగనున్నాయి.

# కోనలో వైభవంగా నృసింహుని తిరుకల్యాణ మహోత్సవం



**రాపూరు (నెల్లూరు), మే 1 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారికి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో బాగంగా శుక్రవారం స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి, శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారికి, శ్రీ అంజనేయ స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉదయం 9 గంటలకు స్వామి ఆరి ఆస్థానమండపంలో పల్లకిలో స్వామి, అమ్మవార్లను వుంచి ఉభయకర్తలు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి,వారిని ఉభయ దేవేరులతో పల్లకీలో తీసుకోని వచ్చి స్వామి వారి కళ్యాణ మండపంలో వుంచారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి వారికి కళ్యాణ తలంబ్రాలను ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ, ఆలయ సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డిలు ఆందజేశారు. అనంతరం స్వామి వారి కళ్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వామలు వేదమంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ విశిష్టతను, స్వామి, అమ్మ వారి గోత్రాలను, గుంటూరుకు చెందిన పుల్లాభట్ల వెంకటేశ్వర్లు చక్కగా భక్తులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతం స్వామి అమ్మవార్లకు తలంబ్రాలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ, సింధు దంపతులు, సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్‌రెడ్డి, అనిత దంపతులు, ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, రాపూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెన్ను అశోక్‌రెడ్డి, ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ,సేవా కమిటీ సభ్యులు పీర్ల సోమయ్య, తదితరులు వున్నారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామిల ఆధ్వర్యంలో తిరుమల వేదపాఠశాల పంచరాత్ర ఆగమ పండితులు రామానుజాచార్యులు పర్యవేక్షణలో అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి,మోక్షజ్ఞ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు. కళ్యాణ మహోత్సవ ఉభయకర్తలుగారామకూరు గ్రామానికి చెందిన పల్లంరెడ్డి కోటేశ్వర రెడ్డి, పల్లరెడ్డి పర్వతమ్మ, పెనుబర్తి గ్రామానికి చెందిన బండి రాఘవ రెడ్డి, జయలక్ష్మీ, బండి పెంచలనరసా రెడ్డి, అనంతలక్ష్మీ, బండి తిరిపాల్‌రెడ్డి, తేజా దంపతులు వ్యవహరించారు. స్వామి వారి కళ్యాణోత్సవం వద్ద తోపులాటలు జరగకుండా ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో రాపూరు సిఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్ఐ యం.వెంకట రాజేష్ భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# అంగరంగ వైభవం... ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ



గిరి ప్రదక్షణలో అనుగ్రహిస్తున్న శ్రీ స్వామి అమ్మవార్లు

**ఇంద్రకీలాద్రి, మే 1 ప్రభాతవార్త:** బెజవాడ దుర్గమ్మ వెలసిన ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా జరిగిన గిరి ప్రదక్షిణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీస్వామి అమ్మవార్లను సేవించుకున్నారు. ఇఒ వికె శీనానాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. దేవస్థానం ముఖ్య అర్చకులు ఆర్.శ్రీనివాస శాస్త్రి తదితరులు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ తప్పెట్లు, కోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం వంటి కళా బృందాల ప్రదర్శనలు, మంగళ వాయిద్యములు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ ఘాట్ రోడ్ శ్రీ అమ్మవారి గుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాలప్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరిప్రదక్షిణ కొనసాగి తిరిగి దుర్గమ్మ ఆలయానికి చేరుకుంది. శ్రీ దుర్గా మల్లేశ్వరులు కొలువైన వాహనం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లో స్థానిక మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు, కొబ్బరికాయలు సమర్పించి, జయ జయద్వానాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

**ఇంద్రకీలాద్రిపై భక్తులరద్దీ:** వైశాఖ పౌర్ణమి, శుక్రవారం, మే డే పబ్లిక్ హాలిడే, వరుస సెలవులు, వివాహాల సీజన్,



వేసవి రద్దీతో ఇంద్రకీలాద్రి క్షేత్రం భక్తులతో నిండిపోయింది. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో తెల్లవారు జాము నుండే అన్ని దర్శనం క్యూ లైన్లు కిక్కిరిసాయి. పౌర్ణమి సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారు స్వర్ణ కవచంతో భక్తులకు దర్శనమిస్తుండగా దేవీ ఖడ్గమాలార్చన, శ్రీ చక్రనవావరణార్చన, చండీ హోమం, లక్ష కుంకుమార్చన, శాంతి కళ్యాణం వంటి ఆర్జిత సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేగంగా అమ్మవారి దర్శనం అయ్యేలా భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ చేశారు. ప్రధాన ఆలయం వెనుక భాగంలోని టికెట్ స్కానింగ్ పాయింట్ వద్ద చంటి బిడ్డల తల్లులు, వృద్ధులు, వికలాంగులకు టిక్కెట్‌తో సంబంధం లేకుండా ప్రత్యేక దర్శనలైన్ ద్వారా దర్శనం ఏర్పాటు చేశారు. పెరిగిన వేసవి ఎండలకు తగ్గట్టుగా భక్తులకు ఉపశమనం కలిగేలా దేవస్థానం ఆధ్వర్యంలో సేవకుల ద్వారా మంచి నీరు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు విరివిగా పంపిణీ చేశారు. చలువ పందిళ్ళు, చలివేంద్రాలు అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. విఐపి దర్శనాల కోసం వచ్చినవారు మధ్యాహ్నం 3 తర్వాత ఇంద్రకీలాద్రికి రావాలని, సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇచ్చి పంపడమే ప్రస్తుత కర్తవ్యమని ఈవో రిఫరెన్స్ భక్తులకు నచ్చజెప్పారు. వేసవి ఎండ తీవ్రత వలన కొంతమంది భక్తులు ఇబ్బంది పడుతుండగా దేవస్థానం ప్రథమ చికిత్స కేంద్రంలో ఉపశమన చర్యలు తీసుకొని వైద్యం అందజేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన కోటకం వెంకట శ్రీనివాసరావు శివ పార్వతి వార్లు రూ.1,00,000/ విరాళాన్ని శుక్రవారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

**భక్తులను మంత్రముగ్ధులను చేసిన భరతనాట్య ప్రదర్శన:** శ్రీ



కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో సాంస్కృతిక సేవలు వెల్లివిరిశాయి. బెంగళూరుకు చెందిన ప్రముఖ నృత్య సంస్థ వైష్ణవి నాట్యశాల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనృత్యం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఈ నృత్య ప్రదర్శన కనువిందు చేసింది. ప్రముఖ నృత్య గురువు డి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నాట్యశాల విద్యార్థులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం నాట్య గురువు విజయ్ కుమార్, బృంద సభ్యులను దేవస్థాన మర్యాదలతో గౌరవించారు.


### టెన్త్‌లో ఫస్ట్ క్లాస్ రాలేదని ఒకరు, ఫెయిల్ అయ్యానని

# మరొకరు ఆత్మహత్యాయత్నం

**యర్రగొండపాలెం, మే 1 ప్రభాతవార్త:** పదో తరగతి పరీక్షల్లో పాస్‌అయ్యాడు కాని ఫస్ట్ క్లాస్ రాలేదని ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరో విద్యార్థి పరీక్షల్లో తప్పి పోవడంతో ఎలుకల మందును సేవించాడు. ఇద్దరు యర్రగొండ పాలెంలోని రవీంద్ర ఉదయ్ హాస్పిటల్‌లో మృత్యువుతో పోరాడుతున్నారు. యర్రగొండపాలెం మండలం అమానుగుడిపాడు గ్రామంకు చెందిన నంబురి చంద్రశేఖర్(16) గుంటూరు జిల్లా నరసరావుపేటలోని గీతాంజలి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది జరిగిన పరీక్షలకు హాజరయ్యాడు. అయితే పరీక్షలు అయిపోయినప్పటి నుంచి ఫస్ట్ క్లాసులో పాసు అవుతానని మనసులో దృఢంగా నాటుకొని ఉండడంతో ఆ తరువాత చదువును గుంటూరు, విజయవాడలో చదవాలని పట్టుదలతో ఉన్నాడు. దీంతో పరీక్షల అనంతరం అదే ఆలోచనలతో ఉండేవాడని, తల్లిదండ్రులతో కూడా అదే మాటను పదే పదే చెబుతుండేవాడని, ఇది గమనించి తల్లి తండ్రి కూడా నీ ఇష్టం వచ్చిన చోట చదువుకోమని చెప్పారని, అయితే తీరా ఫలితాలు వెలువడడంతో పలితాలలో 349 పాస్ మార్కులు మాత్రమే రావడంతో కలత చెందిన విద్యార్థి ఈ క్రమంలోనే శనివారం కుటుంబ సభ్యులతు ఎవరు ఇంట్లో లేని సమయంలో తాడుతో ఉరేసుకున్నాడు, ఇది గమనించిన బంధువులు హుటాహుటీన యర్రగొండపాలెం మన్నెం రవీంద్ర ఉదయ్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమ ంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. అదే విధంగా నూజెండ్ల మండలం జడ్డవానిపల్లెకు చెందిన మరో విద్యార్థి పల్లె శశాంత్ తాను రాసిన 10వ తరగతి పరీక్షలలో 51 మార్కులు రావడంతో అవమానం తట్టుకోలేక ఊరి బయట ఆ గ్రామం పొలిమేరలో ఎలుకల పేస్టు తినడంతో అతని పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో ఇక్కడి ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఇక్కడి వైద్యులు మాత్రం ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పరిస్థితిని ఇప్పుడే చెప్పలేమని అంటున్నారు. ఈ ఘటన మరోసారి పరీక్షల ఒత్తిడి విద్యార్థులపై ఎంతటి ప్రభావం చూపుతుందో చెప్పకనే చెబుతోంది.

మార్కులే జీవితం కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు మానసిక ధైర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చంద్రశేఖర్, పల్లెశశాంత్ తల్లిదండ్రులు రోధిస్తున్నారు. వారిద్దరు త్వరగా కోలుకోవాలని గ్రామస్తులు బంధువులు ఆకాంక్షిస్తున్నారు.

## కాకినాడ-మైసూర్ రైలు సర్వీస్ ప్రారంభం



**కాకినాడ, మే 1 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** రైల్వే శాఖ నూతనం గా ఏర్పాటు చేసిన కాకినాడ మైసూర్ రెగ్యులర్ ట్రైన్ ను శుక్రవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, కాకినాడ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన మైసూర్‌కు నేరుగా రైలు సౌకర్యం అందుబాటులోకి రావడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. ఈ నూతన రైలు సర్వీస్‌తో వ్యాపారస్తులు, ఉద్యోగులు, విద్యార్థులు, యాత్రికులకు పెద్దఎత్తున ప్రయోజనం కలుగుతుందన్నారు. ముఖ్యంగా వ్యాపార, విద్య, పర్యాటక రంగాల అభివృద్ధికి ఈ రైలు దోహదం చేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు ప్రత్యేక సర్వీస్‌గా నడుస్తున్న ఈ రైలును, ప్రయాణికుల పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రెగ్యులర్ సర్వీస్‌గా మార్చాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ని పలు మార్లు కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించి, కాకినాడ- మైసూర్ మధ్య రెగ్యులర్ రైలు సర్వీస్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. భవిష్యత్తులో కాకినాడ నుండి మరిన్ని రైలు సర్వీసులు, అభివృద్ధి పనులు తీసుకురావడానికి కృషి చేస్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. రైల్వే అధికారులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

**విశాఖపట్నం, మే 1 ప్రభాతవార్త:** వాతావరణంలో మార్పులు కారణంగా అర్ధాంతరంగా కురిసిన వర్షంతో ఉరుములు కూడిన మెరుపులు పిడుగులు కూడా పడడంతో పద్మనాభం మండలం మద్ది గ్రామంలో శుక్రవారం ఇటుక బట్టీల సమీపంలో పిడుగు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరా ల్లోకి వెళ్తే,రాజు భాయ్ (35) అనే యువకుడు పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు అదే ఘటన లో సురేంద్ర (18), వివేక్ (35)లకు స్వల్ప గాయాలయ్యాయి సమాచారం అందుకున్న వెంటనే పద్మనాభం 108 అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స అందించారు తదుపరి చికిత్స నిమిత్తం వారిని విజయనగరం మహారాజా గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు.

పోలీసులు ఘటనపై సమాచారం సేకరిస్తూ దర్యాప్తు ప్రారంభించారు వాతావరణ మార్పుల నేపథ్యంలో ఇటువంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు.



కలెక్టర్‌కు ఇంటిపన్ను చెల్లిస్తున్న లబ్దిదారుడు

## నెలాఖరులోగా ఇంటిపన్ను చెల్లిస్తే 5% రాయితీ

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త:** ఎన్‌టిఆర్ జిల్లాలోని గ్రామపంచాయతీలలో 2026-27 ఆర్ధిక సంవత్సరానికి ఇంటిపన్ను ఈనెలాఖరులోగా చెల్లించిన వారికి ఇంటి పన్నులో 5శాతం రాయితీ ఇస్తున్నట్లు జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. ఈమేరకు శుక్రవారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు లబ్దిదారులు 5శాతం రాయితీ పోనూ మిగిలిన మొత్తాన్ని చెక్కులు రూపంలో కలెక్టర్‌కు అందచేసారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంటిపన్ను చెల్లించిన వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో డిపిఓ లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

**వచ్చే నెలాఖరులోగా టిడ్కో ఇళ్ళనిర్మాణం పూర్తిచేయాలి:** జిల్లావ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జూన్‌నెలాఖరుకి ఇళ్ళనిర్మాణం పూర్తిచేయాలని ఎన్‌టిఆర్ జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో టిడ్కో గృహనిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 11,520 టిడ్కో ఇళ్ళనిర్మాణం పూర్తిచేయాల్సి ఉందన్నారు. జక్ కంపూడిలో 6,576ఇళ్లకు గానూ 2,256 ఇళ్ళను లబ్దిదారులకు పంపిణీ చేసామని మిగిలిన ఇళ్ళ నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. జగ్గయ్యపేటలో 2వేలు, తిరువూరులో 672 గృహాలను జూన్‌నాటికి లబ్దిదారులకు అందించాల్సి ఉందన్నారు. గృహాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హెచ్‌యం. ధ్యాన చంద్ర, టిడ్కో డైరెక్టర్ చిన్నోడు, ఎల్‌డియం ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

**పింఛన్‌లు పంపిణీ చేసిన కలెక్టర్:** ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పింఛన్‌లను స్వయంగా లబ్దిదారులకు అందించారు. శుక్రవారం ఉదయం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి, ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామాల్లో పింఛన్ పంపణీ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్బంగా లబ్దిదారుల ఇళ్ళకు వెళ్ళి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ పింఛన్‌లను అందచేసారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొత్తం 2,26,396మందికి రూ.98.52కోట్లు ప్రతినెలా పింఛన్‌ల రూపంలో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇంటివద్దకే వెళ్ళి పింఛన్‌లు అందించటం వల్ల లబ్దిదారులకు సౌకర్యవంతంగా ఉందన్నారు.



పదవీవిరమణ చేసిన ప్రసాద్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

## వివి ప్రసాద్ సేవలు అనిర్వచనీయం

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త:** సమాచార పౌరసంబంధాలశాఖలో వివి ప్రసాద్ సేవలు మరువలేనివని, ఆయన సేవలు మరికొంతకాలం అవసరమని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా కొనియాడారు. ఎన్‌టిఆర్‌జిల్లా పౌరసంబంధాల శాఖ జిల్లాకార్యాలయం సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వేమూరి వెంకటప్రసాద్ శుక్రవారం పదవీవిరమణ చేసారు. పదవీవిరమణ చేసిన ప్రసాద్‌ను మీడియా ప్రతినిధులు శుక్రవారం సాయంత్రం విజయాడ హనుమాన్‌పేటలోని ఒప్రయివేటు ఫంక్షన్‌హాలులో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన కలెక్టర్ ప్రసాద్‌ను శాలువాతో సత్కరించి మొమెంటో అందచేసారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రసాద్ ఎటువంటి సమస్యలు ఎదురవకుండా మీడియాను సమన్వయం చేసారని ప్రశంసించారు. తన 13ఏళ్ళ సర్వీసులో ప్రసాద్ వంటి ఉత్తమ కోఆర్డినేటర్‌ను చూడలేదని, చక్కని పనితీరు కనపరుస్తున్న ప్రసాద్ పదవీవిరమణ చేయటం సరికాదని భావించి ఆయనను మరికొంతకాలంపాటు కొనసాగించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు చెప్పారు. సమాచారశాఖ జేడి పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 1995లో సమాచారశాఖ ఏలూరు కార్యాలయంలో సినీ ఆపరేటర్‌గా ఉద్యోగప్రస్థానం ప్రారంభించచిన ప్రసాద్ 1997లో బదలీపై విజయవాడ కార్యలయంలో బాద్యతలు చేపట్టినట్లు గుర్తుచేసారు. 30ఏళ్ళకు పైగా విజయవాడ కార్యాలయంలో పనిచేస్తూ అందరికి ఆప్తుడుగా మారారని ప్రసాద్‌పై పొగడ్తల వర్ష ం కురిపించారు. అంతకు ముందు సమాచారశాఖ కార్యాలయంలో ప్రసాద్‌ను సహచర ఉద్యోగులు సన్మానించారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుడిమెట్ల వద్ద బయటపడిన పంచలోహ శ్రీరామ విగ్రహం శిల్పం



**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా నదిలో స్థానికులకు కనిపించిన పంచలోహ శ్రీరామ విగ్రహం సంచలనం సృష్టించింది. గుడిమెట్ల వద్ద బయటపడిన ఈ శిల్పం శతాబ్దాల నాటి ఆలయానికి చెందినదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు దీన్ని దైవ సంకేతంగా భావిస్తుండగా, అధికారులు విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని పురావస్తు శాఖతో దాని చరిత్రను వెలికితీసే ప్రయత్నాలు ప్రారంభించారు. కృష్ణా నది ఎన్నో నాగరికతలకు, ఎన్నో గాథలకు సాక్షిగా నిలిచిన పవిత్ర ప్రవాహం. అలాంటి నదిలో ఒక అద్భుతం వెలుగుచూసింది .సాధారణంగా కనిపించే ఇసుక తిన్నెల మధ్య.. కాలం దాచిన ఒక చారిత్రక శిల్పం బయటపడింది. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం గుడిమెట్ల కృష్ణా నదిలో కొందరు స్థానికులు స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో నీళ్లలో ఏదో మెరుస్తూ కనిపించింది. ఏంటా అని పైకి తీసి చూడాగా అది ఒక పంచలోహ విగ్రహం.. అది కూడా ఆ రామయ్య తండ్రిది. సుమారు ఒకటిన్నర అడుగుల ఎత్తులో ఉన్న ఈ విగ్రహం అద్భుతమైన శిల్పకళతో తీర్చిదిద్దబడి ఉంది. విల్లు, బాణాలతో నిలబడి ఉన్న శ్రీరాముడి రూపం.. ఎంతో స్పష్టంగా కమనీయంగా ఉంది. పంచలోహంతో తయారైన ఈ విగ్రహం మీద కాల ప్రవాహానికి నిదర్శనంగా స్వల్ప ధ్వంసం కనిపిస్తున్నప్పటికీ దాని అందం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఈ వార్త చుట్టుపక్కల గ్రామాలకు తెలియడంతో.. భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలి వచ్చారు. ఇది దైవ సంకేతం అంటూ కొందరు భావిస్తుంటే.. మరికొందరు ఇది శతాబ్దాల నాటి ఆలయానికి చెందిన విగ్రహం కావచ్చని అంచనా వేస్తున్నారు.

స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. అధికారులు అక్కడికి చేరుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పురావస్తు శాఖకు సమాచారం అందించి.. దాని అసలు చరిత్ర, వయస్సు తెలుసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. కృష్ణా నది ఒడిలో దాగి ఉన్న ఈ పంచలోహ శ్రీరామ విగ్రహం.. గతం చెప్పే మౌన సాక్షిగా నిలిచింది. ఇది కేవలం ఒక విగ్రహం మాత్రమే కాదు.. మన సంస్కృతి, విశ్వాసాలకు ప్రతీక. ఈ విగ్రహం ఎక్కడి నుంచి వచ్చింది.. ఎంత కాలంగా నదిలో దాగి ఉంది అన్న ప్రశ్న ఇప్పుడు పెద్ద చర్చనీయాంశమైంది. భక్తులు మాత్రం ఇదో అద్భుత ఘటన అని చెబుతూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# పేపర్‌లెస్ న్యాయవ్యవస్థగా సిక్కిం రికార్డు

**సాంకేతికత, న్యాయ విద్యపై జాతీయ సదస్సులో సుప్రీం సిజె వెల్లడి**

**న్యాయ విద్య పాఠ్యప్రణాళికలను అభివృద్ధి చేయాలి**

**న్యాయ అకాడమీలకు సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పిలుపు**



సాంకేతికత న్యాయ విద్యపై సదస్సులో పాల్గొన్న సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

**గ్యాంగ్‌టక్, మే 1:** దేశంలోనే మొట్టమొదటి కాగిత రహిత (పేపర్‌లెస్) న్యాయవ్యవస్థగా సిక్కిం చరిత్ర సృష్టించింది. పూర్తిగా కాగితరహిత న్యాయవ్యవస్థ అంటే, భౌతిక కాగితాల ద్వారా కాకుండా, డిజిటల్ ఫైల్స్, ఈఫైలింగ్, ఆన్‌లైన్ విచారణలు, డిజిటల్ కేసు ట్రాకింగ్ వంటి పద్ధతులను ఉపయోగించి అన్ని న్యాయ ప్రక్రియలను ఎలక్ట్రానిక్‌గా నిర్వహించే ఒక వ్యవస్థ. శుక్రవారం గ్యాంగ్‌టక్‌లో నిర్వహించిన 'సాంకేతికత మరియు న్యాయ విద్యపై సదస్సు' ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, సిక్కింను దేశంలోనే మొట్టమొదటి కాగితరహిత రాష్ట్ర న్యాయవ్యవస్థగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ. ముహమ్మద్ ముస్తాఖ్ కూడా హాజరయ్యారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని న్యాయ విద్య పరిణామం చెంది, మెరుగుపడాలని పేర్కొన్నారు. ఇది ప్రాథమిక డిజిటల్ అక్షరాస్యతను దాటి, అల్గారిథమిక్ వ్యవస్థలను, సహజ న్యాయం వంటి సూత్రాలతో వాటి పరస్పర చర్యను అర్థం చేసుకునేలా న్యాయమూర్తులను సన్నద్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 'సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం అనేది కేవలం అమలు పరచడం గురించే కాదు, న్యాయ విద్యలో అవసరమైన మార్పుకు కూడా సంబంధించినది. గతకాలపు శాసనాలపై మంచి పట్టు ఉంటే సరిపోదు. ఆధునిక న్యాయమూర్తి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల వెనుక ఉన్న తర్కాన్ని కూడా అర్థం చేసుకోవాల్సి' అని సిజెఐ సూచించారు. ప్రాథమిక డిజిటల్ పరిచయానికి మించి, అల్గారిథమిక్ వ్యవస్థలను విమర్శనాత్మకంగా పరిశీలించేలా న్యాయమూర్తులను శక్తివంతం చేసే పాఠ్యప్రణాళికలను అభివృద్ధి చేయాలని ఆయన న్యాయ అకాడమీలకు పిలుపునిచ్చారు. తీర్పు ప్రక్రియ సమగ్రతను కాపాడటానికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోని పక్షపాతాన్ని గుర్తించగల సామర్థ్యం న్యాయ మూర్తులకు ఉండాలని కూడా ఆయన సూచించారు. 'న్యాయానికి సాంకేతికత ఒక సహాయకంగా మాత్రమే ఉండేలా చూడటానికి, అంతేగానీ నిర్ణయాలు తీసుకోవడంలో మానవ ప్రమేయాన్ని భర్తీ చేయకుండా ఉండేందుకు, విద్యారంగంలో ఈ మార్పు అత్యవసరం' అని సిజెఐ పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటూనే, సాంకేతిక సాధనాలను ఉపయోగించగలిగే న్యాయమూర్తులను తయారు చేయడమే దీని లక్ష్యమని ఆయన అన్నారు. సిక్కింను కాగితరహిత న్యాయ వ్యవస్థగా ప్రకటించడం అనేది, ముఖ్యంగా భౌగోళికంగా కష్టతరమైన ప్రాంతాలలో న్యాయం పొందే అవకాశాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో, భౌతిక కోర్టు ప్రక్రియల నుండి డిజిటల్ వ్యవస్థకు మారడాన్ని ప్రతిబింబిస్తుందని కూడా సిజెఐ నొక్కి చెప్పారు. గతంలో, సిక్కింలోని భౌగోళిక పరిస్థితుల కారణంగా వ్యాజ్యదారులు కోర్టులకు వెళ్లడానికి సుదీర్ఘమైన, అనిశ్చితమైన ప్రయాణాన్ని ఎదుర్కొనేవారని, అయితే ఇప్పుడు డిజిటల్ మౌలిక సదుపాయాలు భౌతిక కదలిక లేకుండానే పిటిషన్లు, విచారణలు నిర్వహించడానికి వీలు కల్పిస్తూ ఈ వాస్తవాన్ని మారుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. చట్టబద్ధమైన పాలనను నిలబెట్టడానికి డిజిటల్ సంస్కరణలు అత్యవసరం అని సిజెఐ అభిప్రాయపడ్డారు.

ఈసేవా కేంద్రాలను విస్తరించి, బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం హైకోర్టులలో 48, జిల్లా కోర్టులలో 2,283 ఈసేవా కేంద్రాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ అంతరం న్యాయానికి అడ్డంకిగా మారకుండా నిరోధించడానికి వాటి సాంకేతిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడం అవసరమని ఆయన ఉద్ఘాటించారు. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వినియోగంపై మాట్లాడుతూ, విచారణ న్యాయస్థానాల స్థాయిలో దానిని 'జాగ్రత్తగా ప్రవేశపెట్టడానికి' అవకాశం ఉందని సిజెఐ అన్నారు. రికవరీ కేసులను ఆయన ఉదాహరణగా ఇచ్చారు. ఈ కేసులలో, ప్రారంభ దశలో ఆస్తులను ధ్రువీకరించడానికి, వాటిపై ఉన్న భారాలను గుర్తించడానికి ఏఐ సాధనాలను ఉపయోగించవచ్చని ఆయన తెలిపారు.

ఇటువంటి వ్యవస్థలు ఆస్తి ఉనికిని నిర్ధారించగలవని, పరస్పర విరుద్ధమైన వాదనలను గుర్తించగలవని, తద్వారా అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించి, న్యాయస్థానాలు ప్రధాన వివాదాలపై దృష్టి పెట్టడానికి వీలు కల్పిస్తాయని సిజెఐ అన్నారు.

## కీలక ఖనిజాల మిషన్‌కు రూ.1,500 కోట్లు

**రీసైక్లింగ్ పథకానికి 58 కంపెనీలకు అర్హత**

**స్వచ్ఛ ఇంధన, అధునాతన తయారీ రంగాలకు మద్దతు**



**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** భారతదేశపు కీలక ఖనిజ భద్రతను బలోపేతం చేయడంతో పా టు, ఆర్థిక వ్యవస్థను ప్రోత్స హించడం దిశగా ఒక ప్రధాన ముందడుగు పడింది. కీలక ఖనిజాల రీసైక్లింగ్ ప్రోత్సాహక పథకం కింద కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ అర్హత మదింపును పూర్తి చేసింది. గనుల మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి వెల్లడించిన వివరాలు ప్రకారం ఈ పథకంలో పాల్గొనడానికి 58 కంపెనీలు అర్హమైనవిగా ఆమో దించబడ్డాయి.

జాతీయ కీలక ఖనిజాల మిషన్ కింద మొత్తం రూ.1,500 కోట్ల వ్య యంతో కూడిన ఈ పథకానికి సంబంధించి మార్గ దర్శకాల జారీతో పాటు, గత ఏడాది అక్టోబర్ 2న వివరణాత్మక కార్యాచరణపై నోటిఫై చేసింది. లిథి యం అయా న్ బ్యాటరీలు, ఇ వ్యర్థాలు, పారి శ్రామిక స్క్రాప్ నుండి కీలక ఖని జాల దేశీయ రీసైక్లింగ్ సామ ర్థ్యాన్ని అభివృద్ధి చేయడం ఈ పథకం లక్ష్యం. తద్వారా దిగు మతులపై ఆధారపడటాన్ని తగ్గిం చడం మరియు స్వచ్ఛ ఇంధన, అధునాతన తయారీ రంగాలకు మద్దతు ఇవ్వడం. గత నెల వరకూ తెరిచి ఉన్న దర ఖాస్తుల స్వీకరణకు పరిశ్రమ భాగస్వాముల నుండి బలమైన స్పందన లభించింది. ఈ పథకం మార్గ దర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ, జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్ ద్వారా ప్రతిపాదనలు పరిశీలన చేయబడ్డాయి. దీని ఆధారంగా, కార్యనిర్వాహక కమిటీ 58 సంస్థ లను భాగస్వామ్యానికి అర్హమైనవిగా ఆమో దించింది. వీటిలో 20 సంస్థలకు ఈ ఏడాది మార్చి 30న అనుమతిని సాధించాయి. మరో 38 సంస్థలు గత నెల 29వ తేదీన జరిగిన సమావేశంలో ఆమోదం పొందాయి. ఏడాదికి దాదాపు 850 మిలియన్ టన్నులు వాగ్దానం చేసిన సామర్థ్యంతో పాటు, సుమారు రూ.5 వేల కోట్ల వాగ్దానం చేసిన పెట్టుబడితో నిర్వహిం చబడతాయి.

ఎంపికైన కంపెనీలు ఇప్పటికే బ్యాటరీ రీసైక్లింగ్, ఇ వ్యర్థాల ప్రాసెసింగ్, ఇతర వ్యర్థాల నుండి పునరుద్ధరణ వంటి కీలక విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ పథకంలో తదుపరి దశ ప్రాజెక్ట్ అమలుపై కేంద్రం దృష్టిసారించింది. దీనిలో భాగంగా, అర్హతగల సంస్థల సామర్థ్య అభివృద్ధి, ఉత్పత్తి ప్రారంభాన్ని ఈ పథకం కింద ఆర్థిక సహాయం కోసం పరిగణనలోకి తీసుకుం టారని కేంద్ర ఖనిజాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## ఆంగ్‌శాన్ సుకీ గృహనిర్బంధానికి తరలింపు



**నైపైయిథా, మే 1:** మైన్మార్ మాజీ నేత ఆంగ్ సాన్ సుకీ జైలు నుంచి ఇపుడు గృహ నిర్బంధంలోకి వచ్చారు. బౌద్ధుల శెలవు దినం సందర్భంగా ఖైదీలకు ఇచ్చే క్షమా బిక్షసందర్భంగా ఆమె జైలు శిక్షను గృహనిర్బంధానికి మార్చారు. సాంప్రదాయంగా ఉన్న తెల్లటి జాకెట్.. స్కర్టుతో ఉన్న సూకీ ఒక చెక్క బెంచిపై కూర్చుని ఉన్నట్లు కనిపించారు. ఇద్దరు గుర్తుతెలీని వ్యక్తులు ఆమెకు ఎదురుగా కూర్చుని ఉన్నారు. 2021లో సూకీని అదుపులోకి తీసుకున్న ఆర్మీ ఆమె ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకన్నారు. అప్పటినుంచి ఆమె బయట కని పించిన దాఖలాలులేవు. ఆమె చివరిసారి ప్రజలకు కనిపించింది 2021 మే 24 తేదీ మా త్రమే. బుద్ధజయంతి సందర్భంగా ఇచ్చే సెలవు కావడంతో ఖైదీలకు ఇచ్చే క్షమాబిక్షలోభాగంగానే ఆంగ్‌సాంగ్ సుకీకి కూడా జైలుశిక్షను కుదించి గృహనిర్బంధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 1519 మంది ఖైదీలకు క్షమాబిక్ష ప్రసాదించిన మిన్ ఆంగ్ హ్లాయింగ్ సర్కారు వారి జైలుశిక్షలను గణనీయంగా తగ్గించింది. సూక్యీకి వాస్తవానికి 33 ఏళ్ల జైలుశిక్ష విధించారు. తాజాగా ప్రకటించిన క్షమాబిక్షతో ఆమె జైలుశిక్ష 18 ఏళ్లు తగ్గింది. 13ఏళ్లకుపైగా ఆమె శిక్షను అనుభవించాల్సి ఉందని అంచనా.

## టెట్‌కి లక్ష 36వేల దరఖాస్తులు

**ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి 28,149**

**ట్రాన్స్ జండర్ల నుంచి 5**

**3 వరకు ఎడిట్ సౌకర్యం**

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 1 :** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)-2026 దరఖాస్తు గడువు ముగిసింది. దరఖాస్తు గడువు ముగిసేనాటికి రాష్ట్ర వ్యాప్తంగా 1,36,418 దరఖాస్తులు వచ్చినట్లు టెట్ కన్వీనర్ జి రమేష్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి 28,149 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తుల్లో 5 దరఖాస్తులు ట్రాన్స్ జెండర్ల నుంచి వచ్చినట్లు తెలిపారు. ట్రాన్స్ జెండర్లు ఇన్‌సర్వీస్ నుంచి వారని తెలిపారు. 1,36,418 దరఖాస్తుల్లో పేపర్-1కి 32,779 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 86,305 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. రెండు పేపర్లకు 17,334 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. 28,149 ఇన్ సర్వీస్ టీచర్లలో పేపర్-1కి 7,678 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 20,471 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-2లో మ్యాథ్స్ అండ్ సైన్స్‌కి 11,343 దరఖాస్తులు రాగా, పేపర్-2 సోషల్ స్టడీస్‌కి9,128 దరఖాస్తులు వచ్చాయి. టెట్-2026 మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సరిచేసుకోవడానికి ఈ నెల 3 వరకు ఎడిట్ సౌకర్యం కల్పించినట్లు కన్వీనర్ తెలిపారు.

## గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలి

**సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 1 :** రెండు నెలల్లోనే వాణిజ్య గ్యాస్ ధరను రు.1303 పెంచారని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మండిపడానదరు. కేంద్రం పెంచిన వాణిజ్య గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. వాణిజ్య గ్యాస్ ధరలను అమాంతం పెంచుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, చమురు సంస్థలు తీసుకున్న నిర్ణయం సామాన్య ప్రజలపై యుద్ధం ప్రకటించడమేనన్నారు. కేవలం రెండు నెలల్లోనే సిలిండర్ ధరను రూ.1,303 పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. దేశంలో ఇంధన నిల్వలకు ఎలాంటి కొరత లేదని, అంతా బాగుందని ప్రజలను నమ్మబలుకుతూనే, మరోవైపు దొంగచాటుగా భారీ ఎత్తున భారాలు మోపడం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. కమర్షియల్ సిలిండర్ ధరను 2026 మార్చిలో రూ.115, ఏప్రిల్‌లో రూ.195 పెంచిన కేంద్రం, ఇప్పుడు ఒక్కసారిగా రూ.993లు పెంచిందన్నారు. గత రెండు నెలల్లోనే రూ.1,303 భారాన్ని ప్రజలపై మోపడం అత్యంత దారుణమన్నారు. తాజా పెంపుతో హైదరాబాద్‌లో ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ ధర రూ.3,315కు చేరడం ఆందోళన కలిగిస్తుందన్నారు.

## వాణిజ్య సిలిండర్ ధర 3 నెలల్లోనే 81% పెంచారు

**రాహుల్‌గాంధీ నిశిత విమర్శ**



**న్యూఢిల్లీ, మే 1:** వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కేవలం మూడు నెలల్లోనే వాణిజ్య సిలిండర్ ధరను 81 శాతం పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య సిలిండర్ ధరను ఒక్కరోజులోనే రూ.993 పెంచారని, ఇది కచ్చితంగా ఎన్నికల బిల్లు అని ఎద్దేవా చేశారు. ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయని తాను ముందే హెచ్చరించానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకు నిదర్శనమే నేడు వాణిజ్య సిలిండర్ ధర పెంపు అని తెలిపారు. రూ.993 పెరగడమంటే, ఇది ఒకరోజులో నమోదైన అతిపెద్ద పెరుగుదల అని ఆయన అన్నారు. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు ధర రూ.1,380 పెరిగిందని ఆరోపించారు. అంటే గత మూడు నెలల కాలంలో 81 శాతం పెరుగుదల నమోదైనట్లు చెప్పారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల ఈ ప్రభావం చిన్న చిన్న వ్యాపారులపై తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీ దుకాణాలు, చాయ్‌టిఫిన్ డబ్బాలు, హోటళ్లు, బేకరీలు, మిఠాయి దుకాణాలు తదితర వాటిపై ప్రభావం పడుతుందని అన్నారు. తద్వారా ఇది సామాన్యులకు కూడా భారంగా మారుతుందని అన్నారు.

## జడ్చర్లలో అమానుషం

**చెత్త కుప్పలో శిశువు-పీక్కుతిన్న శునకాలు**

**జడ్చర్ల, మే 1, ప్రభాతవార్త :** అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకుప్పలో పడవేయడంతో ఆడ శిశువు పాదాలను కుక్కలు పీక్కు తిన్న హృదయ విదారక ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీ గుట్ట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన ఆడ శిశువును చెత్తకుప్పలో పడవేసి వెళ్లడంతో కాలనీకి చెందిన కొందరు చిన్నారులు క్రికెట్ ఆడుతూ అక్కడికి వెళ్లి చూడగా శిశువు కనిపించడంతో కాలనీవాసులకు సమాచారం అందించారు. దీంతో కాలనీవాసులు స్థానిక పోలీసులకు సమా చారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు కాగా అప్పటికే శిశువు మృతి చెందినట్లు గుర్తించారు.

## పశ్చిమబెంగాల్ 15 కేంద్రాల్లో నేడు రీపోలింగ్



**కోల్‌కత్తా, మే 1:** పశ్చిమబెంగాల్‌లోజరిగిన పోలింగ్‌లో ఉద్రిక్తతలు నెలకొన్న 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహిస్తోంది. శనివారం జరిగే ఈ పోలింగ్ దక్షిణ 24 పరగణాల జిల్లా లో ఉన్నాయి. ఉదయం ఏడు గం టల నుంచి సాయంత్రం ఆరుగం టల వరకూ పోలింగ్‌జరుగుతుంది. మొత్తం 15 బూత్‌లలో 11 మగ్ర హత్ పశ్చిమ్, నాలుగు డైమండ్ హార్బర్ నియోజకవర్గాల్లో ఉన్నాయి. రెండోవిడతజరిగిన 142 నియో జకవర్గాల పోలింగ్ సందర్భంగానే ఈ ఘర్షణలు చోటుచేసుకోవడంతో రీపోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల పరిశీలకులు ఇచ్చిన నివేదికల ఆధారంగా రీపోలింగ్ జరుగుతోంది. ఎన్నికలసంఘం ప్రత్యేక పరిశీలకుడుగా సుబ్రతా గుప్తాను నియమించింది. పోలింగ్ సందర్భంగా డైమండ్ హార్బర్ లోక్‌సభనియోజకవర్గపరిధిలో జరిగిన ఉద్రిక్తతలపై నివేదిక ఇవ్వాలని కోరింది.

## ముంబయిలో రూ.1745కోట్ల డ్రగ్స్ స్వాధీనం



**ముంబయి, మే 1:** ముంబైలోలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) ఛేదించింది. ఆ ముఠా నుంచి రూ.1,745 కోట్ల విలువైన కొకైన్‌ను ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌పై ఈ విషయాన్ని వెల్లడించారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే ముఠాలను అణచివేయాలని నిర్ణయించు కున్నట్లు అమిత్‌షా తెలిపారు. ఇందులోభాగంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాపై ఉక్కుపాదం మోపిందన్నారు. ముంబైలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఒక చిన్న సరకును గుర్తించి దాని నుంచి ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విజయానికిగాను ఎన్‌సీబీ బృందాన్ని ఆయన అభినందించారు. కాగా అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీమ్ డోలాను ఇటీవల తుర్కియే నుంచి భారత్‌కు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

## డిజిపి నియామకంపై హైకోర్టులో విచారణ

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** రాష్టంలో పూర్తి స్థాయి డిజిపి నియామకంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. యుపిఎస్‌సి సూ చనల మేరకు సి.వి ఆనంద్‌ను రెగ్యులర్ డిజిపిగా నియమించినట్లు ఈ సందర్భంగా రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి హైకోర్టుకు తెలిపా రు. దీంతో పాటు ఆనంద్‌ను డిజిపిగా నియమించినందుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల కాపీని ఆయన అందజేశారు. ఈ జి ఓను పరిగణలోకి తీసుకోవాలని అడ్వకేట్ జనరల్ హైకోర్టును కోరారు. జిఓను పరిశీలించిన హైకోర్టు దీనిపై సానుకూలంగా స్పందించింది. గత డిజిపి శివధర్ రెడ్డి నియామకం చట్టవిరుద్దమని ధన గోపాల్‌రావు అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై తరువాత విచారిస్తామని హైకోర్టు పేర్కొ ంది. శివధర్ రెడ్డి నియామకం చట్టబద్దమా...? కాదా...? అనేది ఆయన తరపు న్యాయవాది వాదనలు విన్న తరువాత నిర్ణయం తీసుకుంటా మని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది.

## కొత్త పోస్టుల్లో చేరిన సీనియర్ ఐపిఎస్‌లు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన బదిలీలలో కొత్త పోస్టింగులు పొందిన పలువురు సీనియర్ ఐపిఎస్ అధికారులు శుక్రవారం నాడు తమ తమ విభాగాల్లో బాధ్యతలు చేబట్టారు. ఇందులో మొదటగా హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజిగా వున్న శిఖా గోయల్ సచివాలయంలో బాధ్యతలు చేబట్టారు. హోం శాఖతో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజిగా కూడా ఆమె వుంటారు. ఫ్యూ చర్ సిటీ కమిషనర్‌గా డాక్టర్ తరుణ్ జోషి రంగారెడ్డి జిల్లా కొంగరకాలన్‌లో గల కమిషనరేట్ కార్యాలయంలో బాధ్యతలు చేబట్టారు. మల్కాజి గిరి పోలీసు కమిషనర్‌గా సుమతి మేడిపల్లిలో గల కమిషపనరేట్‌లో బాధ్యతలు చేబట్టారు. హైదరాబాద్‌తో పాటు శివార్లలోని కమిషనరేట్లలో కమిషనర్‌గా నియమితులైన మొదటి మహిళా అధికారి సుమతి కావడం గమనార్హం. డ్రగ్స్ కంట్రోల్ బోర్డు డైరక్టర్‌గా అవినాష్ మొహంతి ఎస్‌ఆర్‌నగర్‌లో గల ఆ విభాగం కార్యాలయంలో బాధ్యతలు చేబట్టారు. దీంతో పాటు ఆయన ఎసిబి డైరక్టర్‌గా అదనపు బాధ్యతలు చూస్తారు.

## సిపిఐ నేత రామకృష్ణకు మాతృవియోగం

**● మొలగవెల్లిలో నేడు గౌరమ్మ అంత్యక్రియలు**



**అనంతపురం, మే 1 ప్రభాతవార్త బ్యూరో:** సిపిఐ జాతీయ కార్యదర్శి కే. రామకృష్ణ తల్లి గౌరమ్మ (100) శుక్రవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచింది. ఆమె నూరేళ్ల జీవించడం విశేషం. కర్నూలు జిల్లా ఆలూరు మండలంలోని మొలగవెల్లిలో శనివారం గౌరమ్మ మృతదేహానికి అంత్యక్రియలు జరగనున్నాయి. గౌరమ్మ మృతి పట్ల సిపిఐ నాయకులు, కార్యకర్తల్లో విషాదం నెలకొంది. విద్యార్థి ఉద్యమాల నుంచి సిపిఐ జాతీయ నేతగా రామకృష్ణ ఎదిగేందుకు కుటుంబ సభ్యులకు ప్రోత్సాహం ఎంతో ఉందని, అందులో తల్లి గౌరమ్మ పాత్ర ముఖ్యమని పలువురు వామ పక్ష వర్గీయులు అభిప్రాయపడుతున్నారు. గౌరమ్మ మృతి పట్ల పలువురు సిపిఐ, సీపీఎం, ఇతర పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



# వేసవిలో సౌకర్యంగా ..

**ఫ్యాషన్ ఫ్యాషన్**

అసలే ఎండలు పెరుగుతున్నాయి. అందుకు మనం ఎంచుకునేది ఇంట్లో సాధారనంగా నైటీయే అవుతుంది కదా! సాధారణ నైటీలతో వచ్చే చిక్కేంటంటే పైనుంచి కిందకి ఒకేలా ఉండి చూడడానికి కొంచెం ఎబ్బెట్టుగా ఉంటాయి. ఇలాంటి ఇబ్బందులేమీ లేకుండా త్రీ ఫోర్త్, అంతకంటే తక్కువ లెంత్‌లో కూడా చూడడానికి గౌనులా ఉండే నైట్‌వేర్‌లు ప్రస్తుతం మార్కెట్లోకి వచ్చేశాయి. బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఓ లెగ్గింగ్ వేసుకోవచ్చు. క్రేప్, కాటన్, శాటిన్, సిల్క్, రేయాన్. లాంటి ఎన్నో రకాల్లో అందుబాటులో ఉంటుంన్నాయి. తక్కువ బరువుతో,అచ్చం డ్రెస్సుల్లానే ఉండే ఈ నైట్‌వేర్‌లు ఇప్పుడు ట్రెండ్ అవుతున్నాయి.



**చిట్కా:** ✦మురికిగావున్న నీరు కలుషితమయిన బలంకాకుండా వాటర్‌ఫిల్టర్‌లోని నీటిని త్రాగటం ఆరోగ్యకరం. ✦ కొత్తక్యాండిల్ బిగించబోయేముందు ఆ క్యాండిల్స్ నీళ్ళలో మునిగేటట్లుగా ఒకటి రెండురోజులు నీళ్లలో నానపెట్టి ఆ తర్వాతానే ఉపయోగించాలి. కొత్త క్యాండిట్ బిగించిన తర్వాత ఫిల్టరయిన నీళ్లు మట్టివాసన వస్తాయి. ✦ వారానికి రెండు మూడుసార్లు వాటర్‌ఫిల్టర్ క్యాండిల్స్‌ను శుభ్రం చేయాలి. లేకపోతే క్యాండిల్స్ మురికి అవటమే కాకుండా క్యాండిల్స్ అమర్చిన డబ్బాలో అడుగున మట్టిచారలు పేరుకొని ఫిల్టర్ మురికి అవుతుంది. ✦ క్యాండిల్స్‌ను శుభ్రపరచటానికి దానికోసం చేయబడిన ప్రత్యేకమైన బ్రష్‌నే ఉపయోగించడం మంచిది.



# కుండ నీళ్లే శ్రేష్ఠం !

ఎండలు మండుతున్నాయి. ఈ వేడి నుంచి సేద తీరాలి. డీహైడ్రేషన్ బారిన పడకూడదంటే కుండీనళ్లు తాగాలి! ఎందుకంటారా.. కుండ నీళ్లలో సహజసిద్ధంగా పొటాసియం, కాల్షియం, మెగ్నీషియం, మొదలైనవి విడుదలై శరీరానికి మేలు చేస్తాయి. వేసవిలో వడదెబ్బ సాధారణ సమస్య. మట్టి కుండలోని ఖనిజాలు వడ దెబ్బను నిరోధిస్తాయి. మనం తినే ఆహారం ఆమ్లంగా మారి శరీరంలో విషాన్ని సృష్టిస్తుంటుంది. ఆల్కలిన్ స్వభావం కలిగిన కుండ నీళ్ల దాన్ని నివారిస్తాయి. ఎసిడిటీ, గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి ఉప శమనం కలిగిస్తాయి. ప్లాస్టిక్ బాటిళ్లలోని ఫ్రిజ్ నీళ్ల హాని చేస్తాయి. రసాయనాల్లేని కుండనీరే శ్రేష్ఠం. ఈ నీటితో నాలుక తడారిపోవడం, కడుపులో మంట, అజీర్ణం లాంటి సమస్యలు తలెత్తవు. య కుండ నీరు శరీరంలో సమతుల్యతకు దోహదం చేస్తుంది. జీవక్రియను పెంచుతుంది. కుండలో నీళ్ల కొద్దికొద్దిగా ఆవిరవడం వల్ల చుట్టూ వాతావరణం కొంత చల్లబడుతుంది. కరెంట్ సాయంతో గాక.. సహజంగా చల్లబడే కుండనీరు దాహం తీర్చి, ఉపశమనం కలిగిస్తుంది. తాజాగా ఉండే ఈ నీటికి ప్రత్యేక రుచి, వాసన తోడవుతాయి కదా. ◻

# సత్యమే భగవంతుడు

అదాక్ మహా అరణ్యం. ఆ అరణ్యంలో ఒక ఋషి తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఒక రోజున ఆయన ఆ శ్రమంలోకి ఒక వేటగాడు మృగాన్ని తరముతూలోనికి రావడం చూశాడు. అతను వెంటపడుతున్న మృగం ముందే వచ్చి ఆశ్రమంలో ఒక మూలకు చేరడం ఆ ఋషి గమనించాడు. వేటగాడువచ్చి ఒక మృగం ఇటువైపుగా పరుగెత్తుకుంటూ వచ్చింది. మీరు చూశారా అని అడిగాడు. చూడలేదు అంటే అసత్య మాడినట్లే అవుతుంది. చూశాను అంటే ఆ మృగాన్ని పట్టి వేటగాడు చంపేస్తాడు. ఋషి కొంచెం ఆలోచించి ఈ విధంగా సమాధానం చెప్పాడు. నాయనా ఏది చూసిందో అది మాట్లాడలేదు. ఏది మాట్లాడగలదో అది చూడలేదు, అని చెప్పి కనులు మూసుకుని ధ్యానం ప్రారంభించాడు. ఆ విధంగానే కొన్ని సంకట పరిస్థితుల్లో, సత్యంగానీ అసత్యంగానీ, ఏదీ చెప్ప కూడదు. దీనినే ఆపద్ధర్మం అంటారు. సత్యంను చెప్పి మరొకరికి కీడు కలిగే టట్లుగా చేయరాదు. సమాజంలో వ్యవహరించే వారు. 'నొప్పింపక తానొవ్వక' అన్నట్లుగా వ్యవహరించాలి. ఈ ప్రపంచం సత్యం నుండే పుట్టింది. సత్యం చేతనే పోషింపబడుతున్నది. సత్యమునందే ఐక్యం అయిపోతున్నది. 'త్రికాలా బాధ్యం సత్యం' ఎప్పటికీ మారనిది సత్యం. ఎప్పటికీ ఉండేదే సత్యం. సర్వమూ పోయినా, సత్యం ఒక్కటి మాత్రమే శాశ్వతంగా నిలిచి వుంటుంది. అట్టి సత్యమే భగవంతుడు.

**- డా॥పులివర్తి కృష్ణమూర్తి**

**ఆరోగ్య భాగ్యం**

# 'కాలీఫ్లవర్' బలవర్ధకమైన ఆహారం



**డాక్టర్ కె.ఉమాదేవి**
**తిరుపతి**

గోబీ 65, గోబీ మంచూరియా, గోబీరైస్‌తో రకరకాల వంటకాలు తయారు చేయడం వల్ల వాటిని తినడం నేటి తరం ఫ్యాషన్ అయిందనే చెప్పాలి. ఏ రోగాన్ని ఆరికడుతుందో ఆ రోగాన్నే తెచ్చిపెట్టేదానిలాగా మార్చుకొని కాలీఫవర్‌ని తినలనుకోవటం కొన్ని ఆరోగ్యానికి చేటు తెచ్చుకోవడమే అని చెప్పవచ్చు. ఎందుకంటే దీన్ని అధిక ఉష్ణోగ్రతలో వండడం వల్ల ఎక్రిలమైడ్ అనే విషరసాయనం పుట్టి అది కేన్సర్‌కి కారణం అవుతుందే కాని దానిలో ఉండే సహజంగా ఉండే కేన్సర్‌ని నిరోధించే గుణాలు నశించిపోవడమే దీనికి కారణం. మన ఆధునిక అలవాట్ల వల్ల కాలీఫవర్‌లోని అతి తక్కువ కేలరీలతో అతి తక్కువ క్రొవ్వు పదార్థాలతో కూడిన అధిక బలవర్ధకమైన ఆహారాన్ని ఏ విధంగా వాడుకుంటున్నామో తెలుసుకుందాం. దీన్ని వండడానికి తక్కువ నూనె తక్కువ ఉష్ణోగ్రత, తక్కువ మసాలాలు అవసరం వీటిని ఉప్పునీళ్ళలో 10-20 నిమిషాలుంచి మరిగే నీళ్ళలో వేసి రెండు లేక మూడు నిమిషాల సేపు ఉడకనిస్తే సరిపోతుంది లేదా సలాడ్ రూపంలో పచ్చిగా తినగలిగితే ఇంకా మంచిదనే చెప్పాలి. కూరగాయల్లో అధిక విటమిన్ సి ఎక్కువగా ఉండేది కాలీఫ్లవంలోనే. 30-40 సె. డిగ్రీలలో దీన్ని వండితే దీనిలోని విటమిన్స్ ఆవిరైపోయి అనేక వ్యాధుల నివారణకి ముఖ్యంగా కేన్సర్ చికిత్సలో నిరూపయోగమైపోతుంది. కాలీఫ్లవర్ అనేది కొసవువ్వు, మట్టకొసు, ఫూల్‌గోబీ, గోబీ పువ్వు, కేతి అని వివిధ పేర్లతో వివిధ ప్రాంతాల్లో వ్యహరిస్తుంటారు. 12-13వ శతాబ్దంలో అంటే 2,000 సంవత్సరాల క్రితం అరబ్ వృక్షశాస్త్రజ్ఞులు మధ్యధరా ప్రాంతంలోని సైప్రస్ దీవిలో మొదట కనుగొన్నట్లు ఆధారాలున్నాయి. 14వ శతాబ్దంలో ఇది యూరోప్, ఇటలీకి డా.మూర్ ద్వారా వ్యాపించి అభివృద్ధి చెందింది. దీన్ని ఇటాలియన్లు 'కాలీషియోరీ'గా పిలుస్తారు. బాక్సర్ చెవి, ఆకారాన్ని కాలీఫ్లవర్‌తో పోలి ఉండడం వల్ల 'కాలీఫ్లవర్ చెవి' అనే పదం వచ్చింది. 1822 డా.జెన్సున్ బ్రిటిష్ వారి ద్వారా ఇండియాకా దీన్ని తీసుకొని రావడం విశేషం. ఇది భారత్‌లో దాదాపు 150 సంవత్సరాలుగా సాగులో ఉంది. ఇది భారత్‌లో యు.పి. కర్ణాటక పశ్చిమబెంగాల్, పంజాబ్ బీహార్.. ఉత్తర హిమాలయాలు, దక్షిణాన నీలగిరి కొండల్లో కూడా పెరుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా సాగు చేయబడుతున్న ఒక ముఖ్యమైన ఆహార పంటల్లో ఇది ఒకటి. కాలీఫ్లవర్ ఉత్పత్తిలో చైనా, భారత్, యుఎస్, మెక్సికో, స్పెయిన్ ముందంజలో ఉంది. ఇది కావోల్ఫియోర్ అనే ఇటాలియన్ పదం నుండి వచ్చింది. అంటే క్యాబేజీ పువ్వు అని అర్థం అలాగే ఇది లాటిన్ పదాలైన కౌలిస్ (క్యాబేజి), ఫ్లోస్ (పువ్వు) నుండి వచ్చింది. అంటే క్యాబేజీ అని అర్థం. అంటే గుండని శీర్ష భాగం కలిగిందని దీన్నే తల అని అంటారు. ఇది శీతాకాలంలో చల్లని వాతావర ణంలో పెరిగే ఒక కూరగాయ ఇది ఆగస్టు నుండి మార్చి వరకు పెరుగుతుంది. అయినప్పటికి సంవత్సరం పొడవుగా దొరికే కాలిఫ్లవర్‌ని వివిధ వంటకాల్లో వాడడం వల్ల దీన్ని సలాడ్‌బేల్ ఆఫ్ ది వరల్డ్ అని పిలుస్తారు. ఇది రుచికే కాకుండా అనేక పోషకాలున్న కూరగాయ. ఇది 1 1/2 అడుగులు మాత్రమే పెరుగుతుంది. దీని కాండం చాలా చిన్నదిగా ఉండి క్యాబేజీ మాదిరిగా మందంగా ఉంటుంది. దీని ఆకులు పెద్దవిగా, దీర్ఘచతుంస్రాకారంలో ఉంటాయి. పుష్పకాండాలు పొడవుగా మారక మందంగా, కండ కలిగినవిగా మారడం వల్ల గోళాకార చివరి కాంపాక్ట్ తల ఏర్పడుతుంది. ఇది 5 సెం.మీ కంటే ఎక్కువ వ్యాసం కల్గి ఉంటుంది. కొంతకాలం తర్వాత పూలకాండాలు పొడవుగా ఉండి వాటి అగ్రభాగాలు సాధారణ పువ్వులుగా అభివృద్ధి చెందుతాయి. దీని పుష్పగుచ్ఛం 1-2 మీ. పొడవుంటాయి. దీని పండ్లు 4-5 మి.మీ వెడల్పు మరియు 10 సెం.మీ కంటే ఎక్కువ పొడవు గల మెత్తటి సిలిక్యూలుగా మారతాయి. ఒక నిలిక్‌లో 10-30 విత్తనాలుంటాయి. ◻

# ఇంట్లోనే పాప్‌కార్న్



సినిమాకి వెళ్లాలంటే ఇంటర్వెల్లో పాప్‌కార్న్ ఉండాల్సిందే లేదంటే.. ఏదో వెలితిగా, చక్కగా ఉంటుంది. ఈ పేలాలు థియేటరుకే పరిమితం కాదు. ఇంట్లోనూ ఇష్టంగా తినేస్తాం. అంత ఇష్టమైన పాప్‌కార్న్ బయట కొనుక్కుంటే. ప్యాకెట్ తెరిచాక వెంటనే తినేయాలి. లేదంటే క్రిస్పీనెస్ ఉండదు. సాగినట్లవుతాయి. అంతకంటే ముఖ్యంగా.. అవి నిలవుండేందుకు రసాయనాలు ఉపయోగిస్తారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ఇంట్లోనే చేసుకుంటే బాగుంటుంది కదూ! ఎలాగంటారా.. ఎండు మొక్కజొన్న గింజలు కొన్నిటిని ఒక పాత్రలోకి తీసుకుని.. అందులో ఆలివ్ నూనె లేదా వెన్న, కొంచెం ఉప్పు వేసి కలియ తిప్పాలి. వీటిని అవెన్‌కు అనుకూలమైన పేపర్ బ్యాగ్‌లో వేసి, చివర్లో మూసేయాలి. ఇప్పుడు అవెన్‌లో పెట్టి, నిమిషంపాటు ఉంచితే సరి. వేడి వేడి పాప్‌కార్న్ సిద్ధం. ◻

# హిందీ వెండితెరకు సాయి పల్లవి



సౌత్ ఇండస్ట్రీలో సాయి పల్లవి ఎలాంటి ఇమేజ్ సంపాదించుకుందో చెప్పాల్సిన పనిలేదు. తెలుగు, తమిళ చిత్రాల్లో సాయి పల్లవి అంటే ఓ బ్రాండ్‌గా గుర్తింపు ఉంది. తాను రిజెక్ట్ చేసిన సినిమాలున్నాయి గానీ తనని రిజెక్ట్ చేసిన కథలు లేవు. అంతటి బలమైన ముద్రను రెండు భాషల్లోనూ వేయగలిగిన నేటి తరం ఏకైక నటి పల్లవి. తాజాగా ఈ బ్యూటీ బాలీవుడ్‌లోనూ సత్తా చాటేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. మిస్టర్ పర్ఫెక్ట్ నిస్ట్ అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా పరిచయమవుతున్న ఏక్ దిన్ సినిమాతో సాయి పల్లవి హిందీ వెండితెరకు పరిచయం అవుతుంది. ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసుకున్న నేడే రిలీజ్ అయింది. ఇక ఈ సినిమా షూటింగ్ సమయంలోనే సాయి పల్లవి అభినయం చూసి చిత్రబృందం మంత్ర ముగ్ధులైంది. ప్రివ్యూ చూసిన తర్వాత అమీర్ ఖాన్ అయితే ఏకంగా అభిమానిగానే మారిపోయారు. సాయి పల్లవి నటనకు ఫిదా అవ్వడమే కాక, ఆమెపై ప్రశంసల వర్షం కురిపించడం బిటౌన్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సాయి పల్లవిని ఏకంగా భారతీయ ఉత్తమ నటిగా ఆయన కీర్తించిన సంగతి తెలిసిందే. అమ్మడి నటనకు ఎంతో భావోద్వేగానికి సైతం గురయ్యారు. ఈనేపథ్యంలో అమీర్ ఖాన్ ఓ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు బీటౌన్ లో ప్రచారం మొదలైంది. సాయి పల్లవి ప్రతిభపై నమ్మకంతో అమీర్ ఖాన్ ఆమెకు మరో బంపర్ ఆఫర్ ఇచ్చారుట. అమీర్ ఖాన్ హీరోగా నటించే తదుపరి భారీ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన పాత్రను సాయి పల్లవికి ఆఫర్ చేసినట్లు సమాచారం. సాధారణంగా అమీర్ సినిమాల్లో పాత్రలకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. అలాంటిది ఆయనే స్వయంగా ఒక నటిని ఎంచుకున్నారంటే ఆ పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతుందో అర్థం చెప్పొచ్చు. సాయి పల్లవి కూడా అమీర్ వంటి లెజెండ్ కల్పిస్తున్న అవకాశాన్ని వెంటనే అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో సాయి పల్లవి పేరు ఉత్తరాదిన మరోసారి మారు మ్రుగుతోంది.

# సిల్క్ చీరలో క్లాసిక్ లుక్ బ్యూటీ శ్రద్ధాదాస్



తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలు అభిమానులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. అందం అభినయంతో ఆకట్టుకుంటూ అవకాశాలు అందుకుంటూ.. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ దూసుకుపోతు న్నారు హీరోయిన్లు. సినిమాల ద్వారానే కాకుండా ఇటు సోషల్ మీడియా ద్వారా కూడా అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్‌ను పెంచుకుంటున్నారు.. ఈ క్రమంలోనే తన అందాలతో మెస్మరైజ్ చేస్తూ నడుము అందాలతో గిలిగింతలు పెట్టేస్తోంది బన్నీ బ్యూటీ శ్రద్ధాదాస్. అల్లు అర్జున్ హీరోగా వచ్చిన ఆర్య 2 సినిమాలో అల్లు అర్జున్ ని ప్రేమించే అమ్మాయి పాత్రలో చాలా చక్కగా ఒదిగి పోయింది ఈ ముద్దుగుమ్మ. అందులో ఈమె పెర్ఫార్మెన్స్ కి మంచి మార్కులే పడ్డాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టివ్ అయి పోయిన శ్రద్ధాదాస్ తాజాగా లేటెస్ట్ ఫోటోషూట్ ను అభిమానులతో పంచుకుంది. ఇంస్టాగ్రామ్ వేదికగా క్రీం కలర్ సిల్క్ చీర కట్టుకొని అందాలతో హుయలు పోయింది. క్రీం కలర్ శారీ, బ్లౌజ్ ధరించి జుట్టును ఫ్రీగా వదిలేసి.. తన అందాలతో మెస్మరైజ్ చేసింది. పరదా చాటున అందాలు అధరహో అనే రేంజ్ లో శ్రద్ధాదాస్ షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇకపోతే తన నెక్‌ను ముత్యాలతో పొదిగిన చౌకర్తో ఫుల్ ఫిల్ చేయగా.. అదే ముత్యాలతో డిజైన్ చేసిన చేతి ఉంగరాలను ధరించి సింపుల్ లుక్ లో అందరి దృష్టిని ఆకట్టుకుంది శ్రద్ధదాస్ . తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలు అభిమానులకు కునుకు లేకుండా చేస్తున్నాయి.

# 'పెద్ది' సినిమా జూన్ 4న విడుదల



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా'పెద్ది విడుదలపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. ఈ చిత్రాన్ని 2026 జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. వేసవి సెలవుల కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా, జూన్ మొదటి వారంలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ నిర్ణయించారు.దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రామ్ చరణ్ ఒక పవర్‌ఫుల్ రెజ్లర్ పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. ఈ సినిమాలో చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతి బాబు, తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సహకారంతో వృద్ధి సినిమాస్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. జూన్ 4న థియేటర్లలో'పెద్ది బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# తిరుమలలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్య వివాహం



ఆధ్యాత్మి కతతో కూడిన పవిత్ర తిరుమలలో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్య వివాహ బంధంలో అడుగు పెట్టారు. కర్ణాటక భవన్‌లో జరిగిన ఈ వేడుక సంప్రదాయం, ప్రేమ, కుటుంబ అనుబంధాలతో ఓ అద్భుతమైన వేడుకగా నిలిచింది.బెల్లంకొండ శ్రీనివాస్ - కావ్య వివాహ కార్యక్రమాలు సనాతన ధర్మాన్ని అను సరించి, అన్ని సంప్రదాయ క్రతువులతో ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. ఇరువురు కుటుంబ సభ్యులు ప్రతి ఆచారంలో పాల్గొంటూ ఈ వేడుకకు ప్రత్యేకతను తీసుకు వచ్చారు. ఇది సంప్రదాయాల గౌరవం, ఆధునికత కలిసిన ఓ అందమైన వేడుకగా నిలిచింది. వేదికను ఆలయ వాతావర ణాన్ని ప్రతిబింబించేలా అద్భుతంగా అలంకరించారు. పూల అలంకరణలు, స్వర్ణ వర్ణ అలంకారాలు, సంప్రదాయ అలంకరణ కలిసి ఒక పవిత్రమైన దృశంగా నిలిచాయి. ఈ వేడుకలో సంప్రదాయాలకు ఇచ్చిన గౌరవం స్పష్టంగా కనిపించింది. సన్నిహిత కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో జరిగిన ఈ వివాహం ఎంతో ఆత్మీయంగా సాగింది. ఆశీర్వాదాలు, సంప్రదాయాలు, వైభవం అన్నీ కలిసి ఈ వేడుకని మరింత ప్రత్యేకంగా నిలిపాయి. హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించను న్నారు. సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, స్నేహితులు, ఆత్మీయులు పాల్గొనే ఈ కార్యక్రమం మరింత వైభవంగా జరగనుంది. ఈ ఆనంద క్షణాలకు మరో అందమైన అధ్యాయంగా రిసెప్షన్ నిలవనుంది.


## తెర

# సెల్ఫీ ఫోజులతో ఆకట్టుకుంటున్న బుట్ట బొమ్మ



అందులో భాగంగానే తాజాగా బ్లూ అవుట్ ఫిట్‌లో సెల్ఫీ ఫోజులతో షేర్ చేసిన కొన్ని ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో బుట్ట బొమ్మగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న పూజా హెగ్డే గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో అందరి దృష్టిని ఆకట్టుకొని ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ గత కొంతకాలంగా సరైన అవకాశాలు లేక వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక ఒక్క హిట్ కోసం ఎదురుచూస్తోంది. ప్రస్తుతం హిందీలో, తమిళ్లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టు కుంటున్న ఈమె ఇటు ఇంస్టాగ్రామ్ వేదికగా కూడా అందాలు ఆరబోస్తూ మరింత ఫాలోయింగ్ పెంచుకునే పనిలో పడింది. అందులో భాగంగానే తాజాగా బ్లూ అవుట్ ఫిట్‌లో సెల్ఫీ ఫోజులతో షేర్ చేసిన కొన్ని ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటు న్నాయి. మిడ్ నైట్ బ్లూ ఎంబ్రాయిడరీ లెహంగా ధరించిన ఈమె.. స్ట్రా ప్లేస్ బ్లౌజ్ ధరించి, డైమండ్ చౌకర్‌తో.. సహజ సిద్ధమైన స్ట్రెయిట్ హెయిర్‌తో తన అద్భుతమైన మేకోవర్ ను పూర్తి చేసింది. వ్యానిటీ మిర్రర్లో సెల్ఫీ ఫోజులతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి .ఇదిలా ఉండగా ఈమె హిందీలో హై జవానీతో ఇష్క్ హోనా హై అనే సినిమాలో నటిస్తోంది.

# జూన్ 5న 'అనకాపల్లి' గ్రాండ్ రిలీజ్



డిఫరెంట్ కంటెంట్‌తో, రా అండ్ రస్టిక్‌గా భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మిస్తున్న చిత్రం'అనకాపల్లి. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు. కంద్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాథరావు నక్కిన కూడా ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. ఈ మూవీని జూన్ 5న విడుదల చేయనున్నారు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేయగా అది అందరిలోనూ బజ్‌ను క్రియేట్ చేసింది. ఇక తాజాగా'అనకాపల్లి నుంచి జాతర సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటలో సంగీత స్టెప్పులు, గ్రాండియర్‌గా పాటను తెరకెక్కించిన తీరు, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ, మంగ్లీ గాత్రం ఇలా అన్నీ హైలెట్‌గా నిలుస్తున్నాయి. నిజంగానే ఓ జాతర చూస్తున్నామా? అన్న రేంజ్‌లో విజువల్స్ కనిపిస్తున్నాయి. ఇక ఈ పాటకు గణేష్ సలాది లిరిక్స్, దేవజండ్ బాణీ మరింత స్పెషల్ అట్రాక్షన్‌తా నిలిచాయి.

## రియాన్ పరాగ్ కెప్టెన్ ఇన్నింగ్స్
# రన్స్ ఛేదనలో ఢిల్లీ కింగ్




**జైపూర్:** పరుగుల ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ కింగ్‌గా నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ ఉంచిన 226 రన్స్ లక్ష్యాన్ని మరో 5బంతులు ఉండగానే 3వికెట్లు కోల్పోయి అందుకుంది. మూడు వరుస పరాజయాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ ఢిల్లీ గెలుపుపై నిలిచింది. ఈ సీజన్‌లో నాలుగో విజయంతో ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. రాజస్థాన్‌కు సొంతగడ్డపై ఓటమే దక్కింది.

భారీ టార్గెట్‌తో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి ఓపెనర్లు నిస్సాంక(33 బంతుల్లో 62), కేఎల్ రాహుల్(40 బంతుల్లో 75) ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడుతూ తొలి వికెట్‌కు 110 రన్స్ జోడించారు. ఆ తర వాత నితీష్ రాణా(17 బంతుల్లో 33)తో కలిసి రాహుల్ రెండో వికెట్‌కు 61 రన్స్ అందించాడు. రాహుల్‌ను ఆర్చర్ అవుట్ చేయడంతో మ్యాచ్ ఉత్కంఠకు చేరింది. ఈ దశలో రాయల్స్ బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ట్రిస్టన్ స్టబ్స్(18), అశుతోష్(25) ధాటిగా ఆడి ఢిల్లీ విజయాన్ని ఖాయం చేశారు.

సొంతగడ్డపై రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్(50 బంతుల్లో 90) దుమ్మురేపాడు. చక్కని శుభారంభాలు అందిస్తున్న ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(6), వైభవ్ సూర్యవంశీ (4) ఈసారి విఫలమయ్యారు. ఇన్నింగ్స్ తొలి బంతికే సిక్స్‌తో రాజస్థాన్ పరుగుల ఖాతాను తెరిచిన జైస్వాల్... మూడో బంతికి స్టార్క్‌కే క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరారు. స్టార్క్ ఈ సీజన్‌లో బరిలోకి దిగిన తొలి మ్యాచ్ తొలి ఓవర్‌లోనే వికెట్ పడగొట్టాడు. రెండో ఓవర్‌లో బౌండరీతో ఖాతా తెరిచిన వైభవ్‌ను యార్కర్‌తో జెమీసన్ బోల్తా కొట్టించాడు. దీంతో 12 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ రియాన్ పరాగ్.. ధృవ్ జురెల్(30 బంతుల్లో 42)తో కలిసి ఆదుకున్నాడు. ఆరో ఓవర్లో జెమీసన్ బంతులను 6, 4, 6 బాది 20 రన్స్ పిండుకున్నాడు. రియాన్ ఆ తర్వాత వేసిన అక్షర్ పటేల్ బౌలింగ్‌లో బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లు, నటరాజన్ బౌలింగ్‌లో 4,6 బాదాడు. మరోఎండ్‌లో ధృవ్ కూడా ధాటిగా ఆడాడు. అక్షర్ బంతికి సిక్స్ బాదిన జురెల్.. ఆ తర్వాతి బంతిని కూడా భారీ షాట్ ఆడబోయి అవుటయ్యాడు. ఇద్దరూ మూడో వికెట్‌కు 102 రన్స్ జోడించారు. జురెల్ అవుటైన తర్వాత రియాన్ మరింత జోరు పెంచాడు. ఈ క్రమంలో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. జెమీసన్ 16వ ఓవర్లో 3 వరుస బౌండరీలతో సెంచరీకి చేరువయ్యాడు. ఈ దశలో స్టార్క్ ఒకే ఓవర్లో జడేజా(20), పరాగ్‌ను అవుట్ చేశాడు.

ఆఖర్లో డొనొవన్ ఫెరియెరా(14 బంతుల్లో 47నాటౌట్) గత మ్యాచ్ తరహా లో చెలరేగాడు. 18వ ఓవర్లో కుల్‌దీప్ బంతులకు మూడు సిక్స్‌లతో 20 రన్స్, స్టార్క్ ఓవర్లో 4, 6తో 14 రన్స్, నటరాజన్ ఓవర్లో 4, 6, 6తో 18 రన్స్ దంచేయడంతో చివరి మూడు ఓవర్లలో 52 రన్స్ వచ్చాయి. దీంతో రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లోలో 6 వికెట్లకు 225 రన్స్ సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో స్టార్క్ మూడు వికెట్లు.. జెమీసన్, అక్షర్, నటరాజన్ తలా ఓ వికెట్ పడగొట్టారు.

## లక్కీ లూజర్‌పై మార్టా కోస్టియుక్ విజయం



**మాడ్రిడ్:** ఉక్రెయిన్ సంచలన తార మార్టా కోస్టియుక్... మాడ్రిడ్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో లక్కీ లూజర్ అనస్తాసియా పొటపోవాపై గెలుపొందింది. గంటా 36 నిమిషాల పాటు జరిగిన సెమీస్ పోరులో కోస్టియుక్ 6-2, 1-6, 6-1 తో పొటపోవాను కంగుతినిపించింది. డబ్ల్యుఏ 1000 టోర్నీ ఫైనల్‌కు చేరడం కోస్టియుక్‌కు ఇదే తొలిసారి. టైటిల్ కోసం 9వ సీడ్ మిర్రా ఆంద్రీవాతో తలపడనుంది. కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనతో సాగుతున్న మార్టా కోస్టియుక్.. సెమీఫైనల్లోనూ అదే జోరు చూపింది. లక్కీ లూజర్‌గా మెయిన్ డ్రాలో ఎంట్రీ ఇచ్చిన అనస్తాసియా పొటపోవా ఒక్కో విజయంతో సెమీఫైనల్ వరకు వచ్చింది. తొలి సెట్‌ను 6-2తో కోస్టియుక్ నెగ్గి ఆధిక్యం చాటింది. అయితే పుంజుకున్న పొటపోవా... రెండో సెట్‌లో కోస్టియుక్ సర్వీసులను పలుసార్లు బ్రేక్ చేసి 6-1తో నెగ్గి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో కోస్టియుక్ ఏస్‌ల ముందు పొటపోవా నిలువలేకపోయింది. పలుమార్లు డబుల్ ఫాల్ట్‌లతో సర్వీసులను చేజార్చుకుంది.

# థామస్ కప్ సెమీస్‌లో భారత్

## క్వార్టర్‌లో చైనీస్‌తైపీపై 3-0తో క్లీన్‌స్వీప్




**హార్సెన్స్:** డెన్మార్క్ వేదికగా జరుగుతున్న థామస్ కప్ బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల జట్టు అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. లీగ్ స్టేజ్‌లో రెండు విజయాలతో క్వార్టర్‌ఫైనల్‌కు వచ్చిన లక్ష్యసేన్ నేతృత్వంలోని భారత జట్టు అదే జోరు కొనసాగించింది. చైనీస్ తైపీపై 3-0 తో క్లీన్‌స్వీప్ చేసి సెమీఫైనల్లో ప్రవేశించింది. సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుష్ షెట్టి.. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జోడీ విజయాలు అందించారు.

తొలి సింగిల్స్‌లో లక్ష్యసేన్ శుభారంభం అందించాడు. చైనీస్ తైపీ ఆటగాడు చో తిన్ చెన్‌పై మూడు సెట్లపోరులో చెమటోడ్చి నెగ్గాడు. తొలి సెట్‌ను 18-21తో చేజార్చుకున్న లక్ష్యసేన్.. ఆ తర్వాత చక్కగా పుంజుకున్నాడు. పోటాపోటీగా జరిగిన రెండు సెట్లను 22-20, 21-17తో గంటా 28 నిమిషాల్లో ముగించాడు. భారత్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. రెండో సింగిల్స్‌లోనూ ఆయుష్ షెట్టి జోరు చూపాడు. ఇటీవలి విజయాలతో చక్కని ఆత్మవిశ్వాసంతో ఉన్న ఆయుష్ షెట్టి... వరుస సెట్లలో ఆల్‌ఇంగ్లాండ్ ఛాంపియన్ లిచ్ చున్‌యిపై గెలుపొందాడు. తొలి సెట్‌ను 21-16లో అలవోకగా ముగించిన ఆయుష్‌కు రెండో సెట్‌లోనూ పెద్దగా ప్రతిఘటన ఎదురుకాలేదు. ఈసెట్‌ను కూడా 21-17తో ముగించి భారత్ ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. ఇక డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మరో విజయం అందించింది. ఈ జోడీ మూడు సెట్ల పోరులో 23-21, 19-21, 21-12తో చైనీస్ తైపీ జోడీ వాంగ్ చిన్ లిన్-చ్యు హిసాంగ్ చే జోడీపై విజయం సాధించారు. ఇండోనేషియాపై భారత్‌కు 3-0తో క్లీన్ స్వీప్ అందించారు. భారత్ సెమీఫైనల్లో.. ఫ్రాన్స్, జపాన్ మ్యాచ్ విజేతతో తలపడనుంది. బ్యాడ్మింటన్ టీమ్‌లో ప్రతిష్టాత్మకమైన థామస్ కప్‌ను ఒకేఒకసారి అందుకుంది. 2022లోఛాంపియన్‌గా నిలిచింది. కాగా ఉబెర్ కప్‌లో భారత మహిళల టీమ్ లీగ్ దశలోనే నిష్క్రమించింది.



## టెస్ట్‌ల్లో టీమిండియాకు మూడో ర్యాంకు

**దుబాయి:** ఐసీసీ వార్షిక టెస్ట్ ర్యాంకుల్లో టీమిండియా మెరుగుపడింది. టాప్-3లో చోటు సంపాదించింది. తాజాగా టెస్ట్ ర్యాంకులను ఐసీసీ వెల్లడించింది. వార్షిక టెస్టు ర్యాంకుల్లో ఆస్ట్రేలియా (131 పాయింట్లు) అగ్రస్థానంలో నిలిచింది. రెండో ర్యాంకు దక్షిణాఫ్రికా (119) సొంతమైంది. ఇక భారత్ (104) కూడా ఒక ప్లేస్‌ను మెరుగుపర్చుకుని మూడో ర్యాంకును అందుకుంది. బజ్‌బాల్ క్రికెట్ అంటూ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తోన్న ఇంగ్లాండ్ (102) ర్యాంకు నాలుగుకు పడిపోయింది. న్యూజి లాండ్ (101) ఐదో స్థానంలో ఉండగా, ఆ తర్వాత పాకిస్థాన్ (89), శ్రీలంక (86), వెస్టిండీస్ (68), బంగ్లాదేశ్ (67), ఐర్లాండ్ (25), జింబాబ్వే (10) జట్లు కొనసాగుతున్నాయి.

వన్డే, టీట్వంటీ క్రికెట్‌లో చక్కని విజయాలు సాధించిన టీమిండియా.. గతేడాది టెస్టుల్లో ఇబ్బంది పడింది. స్వదేశంలోనూ పరాజయాలను చవిచూసింది. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్ నాలుగో సీజన్ నడుస్తోంది. ఈ ఏడాది ఆస్ట్రేలియా, శ్రీలంక, న్యూజిలాండ్‌తో టీమిండియా టెస్టులు ఆడబోతోంది. ప్రస్తుతం ఆరో స్థానంలో ఉన్న టీమిండియా... అన్నింట్లోనూ విజయాలు సాధించడంతో పాటు మిగతా జట్లు వెనకబడితేనే డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశం ఉంటుంది.

## సన్‌రైజర్స్ జట్టులోకి అండర్-19 హీరో

**హైదరాబాద్, మే2(వార్త క్రీడా ప్రతినిధి**

గాయపడిన ఆల్‌రౌండర్ శివమ్ మావి స్థానాన్ని అండర్19 ప్రపంచకప్ 2026 హీరో, యువ పేస్ బౌలింగ్‌ఆల్‌రౌండర్ ఆర్ఎస్ అంబ్రిష్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ భర్తీ చేసింది. ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. 18 ఏళ్ల అంబ్రిష్ ఈ ఏడాది అండర్-19 ప్రపంచకప్ భారత్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. టోర్నీలో 11 వికెట్లు తీసి భారత తరఫున సంయుక్తంగా అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. కుడిచేతి మీడియం పేసర్ అయిన అంబ్రిష్.. ఎడమచేతితో బ్యాటింగ్ చేస్తాడు. లోయర్ ఆర్డర్‌లో ఉపయోగకర బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఈ ఆల్‌రౌండ్ నైపుణ్యం ఎస్‌ఆర్‌హెచ్‌కు అదనపు బలంగా మారనుంది. ఇప్పటికే ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ వంటి దేశీయ యువ పేసర్లతో కలకలలాడుతున్న ఎస్‌ఆర్‌హెచ్‌కు అంబ్రిష్ మరో అస్త్రంగా మారే అవకాశం ఉంది. ఈ సీజన్ వేలంలో మావిని రూ.75 లక్షల బేస్ ధరకు ఎస్‌ఆర్‌హెచ్ కొనుగోలు చేసింది. అయితే అతను గజ్జలో గాయం కారణంగా సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. దీంతో అంబ్రిష్(రూ. 30 లక్షలకు)ను సన్‌రైజర్స్ ఎంపిక చేసుకుంది.

## అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ
# యేడాదిలోనే 2లక్షల కోట్ల ఆస్తులు జోడింపు



**ముంబయి, మే 1:** అదానీ గ్రూప్ తమ వ్యాపారాల్లో వేగవంతమైన వృద్ధిని కొనసాగిస్తూ ఈ ఒక్క ఏడాదిలోనే కొత్తగా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులను సమకూర్చుకోనున్నట్లు గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ప్రకటించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రూప్‌లోని 4 లక్షల మంది ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గడిచిన 35 ఏళ్లలో తాము సుమారు రూ.2లక్షల కోట్ల ఆస్తులను నిర్మించామని, ఇప్పుడున్న తమ సామర్థ్యంతో ఈ ఒక్క ఏడాదిలోనే మరో రూ.2 లక్షల కోట్ల ఆస్తులను జోడించబోతున్నామని చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో తమ వంతు పాత్ర పోషిస్తామని గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. తాము చేపట్టే ప్రాజెక్టులు కేవలం పనులు పూర్తి చేయడం కాదని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడమేనని ఆయన అన్నారు. ముంద్రా పోర్టు, గంగా ఎక్స్‌ప్రెస్‌వే వంటి ప్రాజెక్టులను ఉదాహరణగా చూపుతూ, ఇవి దేశ నిర్మాణంలో కీలకమైనవని పేర్కొన్నారు. పలు కీలక ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఒకప్పుడు బీడుభూమిగా ఉండి, ఇప్పుడు దేశంలోనే అతిపెద్దదైన ముంద్రా పోర్టు, కేరళలోని విజింజం పోర్టులు దేశ వాణిజ్యాన్ని, అంతర్జాతీయ సముద్ర వాణిజ్య పటంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. కచ్‌లోని ఖవ్దాలో నిర్మిస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఇంధనాన్ని అందిస్తుందన్నారు. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని, ఇటీవల ప్రారంభమైన గంగా ఎక్స్‌ప్రెస్‌వే ఉత్తరప్రదేశ్‌లో 8 కోట్ల మంది ప్రజల జీవితాలను మార్చబోతోందని వివరించారు. మీరట్,ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రయాణ సమయం 10-11 గంటల నుంచి 56 గంటలకు తగ్గుతుందని తెలిపారు. ముంబైలోని ధారవి మురికివాడల పునరాభివృద్ధి ప్రాజెక్టును కేవలం ఒక ప్రాజెక్టుగా కాకుండా, మానవ పరివర్తనలో ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత సవాలుతో కూడిన ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. దేశ నిర్మాణంలో భాగంగా తాము చేపడుతున్న ఈ ప్రాజెక్టులన్నీ తమ వంతు వినయపూర్వకమైన సేవలని గౌతమ్ అదానీ పేర్కొన్నారు.

## టెస్లా ఎలాన్‌మస్క్ వేతన ప్యాకేజి
# 15 లక్షలకోట్లు



**న్యూయార్కు, మే 1:** టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 2025 ఆర్థిక సంవత్సరానికి గాను 158 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీని పొందారు. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఆయన ప్యాకేజీని కంపెనీ పేర్కొంది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.15 లక్షల కోట్లు. ఎలాన్ మస్క్ నెలవారీ వేతనంగా ఎలాంటి మొత్తాన్ని పొందడం లేదు. స్టాక్ అవార్డులు, ఇతరత్రా రూపంలో పారితోషిక ప్యాకేజీని అందుకుంటారు. ఈ క్రమంలో గత సంవత్సరానికి గాను ఆయన ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. ఈ మొత్తంతో పోలిస్తే ఆయన పొందే విలువల్లో చాలా వ్యత్యాసం ఉంటుందని కూడా టెస్లా తన ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ పనితీరు ఆధారిత పారితోషికం విలువ 132 బిలియన్ డాలర్లుగా ఉంది. పనితీరు విషయంలో కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరితేనే ఈ మొత్తం మస్క్‌కు అందుతుంది. ప్యాకేజీలో మిగతా 26 బిలియన్ డాలర్లు కూడా టెస్లా బోర్డు ఆమోదిస్తేనే అందుతుంది. ఈ క్రమంలో 2025 సంవత్సరానికిగాను ఆయన ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. ప్రకటించిన మొత్తంతో పోలిస్తే ఆయన పొందే విలువకు చాలా వ్యత్యాసం ఉంటుందని కూడా టెస్లా తన ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ పనితీరు ఆధారిత పారితోషికం విలువ 132 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

# ఏటీఎఫ్ ధరల పెరుగుదలతో విమాన సర్వీసులు కుదింపు




**ముంబయి,మే 1:** ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు భారీగా పెరిగిన క్రమంలో ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా ఆర్థిక భారంగా మారిన పలు మార్గాలలో విమాన సర్వీసులను నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రోజువారీగా 100 సర్వీసులను తగ్గించుకోనుంది. ఏటీఎఫ్‌గా పిలుచుకునే ఈ ఇంధన ధరలు పెరిగినందున కొన్ని మార్గాలకు విమానాలను నడపడం ఆర్థిక భారంగా ఎయిరిండియా భావిస్తోంది. ఎయిరిండియా రోజుకు సగటున 1,100 సర్వీసులను నడుపుతోంది. ఇంధన వినియోగం అధికంగా ఉండి, మార్జిన్లు అంతగా లేని యూరప్, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి సుదూర అంతర్జాతీయ మార్గాలలోని సర్వీసులకు ప్రధానంగా కోత పెట్టనుంది. అలాగే, ఢిల్లీ, ముంబై నగరాలకు లండన్, ప్యారిస్, న్యూయార్క్, టొరంటో, శాన్‌ఫ్రాన్సిస్కో, సిడ్నీ, మెల్‌బోర్న్ నుంచి రాకపోకలు సాగించే విమానాల సంఖ్య కూడా తగ్గనుంది. అమెరికా, ఇజ్రాయెల్‌ఇరాన్ యుద్ధం నేపథ్యంలో వరుసగా రెండో నెల ఏటీఎఫ్ ధరలు పెరిగాయి. అంతర్జాతీయ విమాన సంస్థలకు ఏటీఎఫ్ ధరను 5 శాతం పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. తాజా ప్రకటనతో ఢిల్లీలో కిలోలీటర్ ఏటీఎఫ్ ధర ఐదు శాతం పెరిగి, 1,511.86 డాలర్లకు చేరుకుంది. ఇంధన ధరలు పెరగడంతో నిర్వహణ వ్యయాలు భారంగా మారుతాయని విమానయాన సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాగే అయితే తాము సర్వీసులు నడపలేమని ఎయిర్‌లైన్స్ ఫెడరేషన్ ఇండియా ఎఫ్ఐఎ కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖకు లేఖలు కూడా రాసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే కొన్ని సంస్థలు సర్వీసులు తగ్గించుకోగా మరికొన్ని అదే బాటలో ముందుకు వస్తున్నాయి. ఇపుడు ఎయిర్‌ఇండియా కూడా సర్వీసులు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది.





## దేశంలో యుపిఐ లావాదేవీలు
# రూ.29.03 లక్షలకోట్లు

**న్యూఢిల్లీ, మే 1:** భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యుపిఐ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. గత ఏప్రిల్ నెలలో లావాదేవీల సంఖ్య, విలువల పరంగా రికార్డుస్థాయి వృద్ధి నమోదైంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా 22.35 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరిగాయి. వీటి మొత్తం విలువ రూ.29.03 లక్షల కోట్లుగా ఉంది. పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 25 , విలువలో 21 శాతం వృద్ధి కనిపించింది. మార్చిలో రోజుకు సగటున 730 మిలియన్ల లావాదేవీలు జరగగా, ఏప్రిల్‌లో ఈ సంఖ్య 745 మిలియన్లకు పెరిగింది. అలాగే, రోజువారీ లావాదేవీల సగటు విలువ రూ.95,243 కోట్ల నుంచి రూ.96,766 కోట్లకు చేరింది. ఐఎంపీఎస్ ద్వారా 362 మిలియన్ల లావాదేవీలు జరగ్గా, వాటి విలువ రూ.7.01 లక్షల కోట్లుగా నమోదైంది. యూపీఐ సేవలు కేవలం దేశానికే పరిమితం కాలేదు. ఇప్పటికే యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్ సహా 8కి పైగా దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ అంతర్జాతీయ విస్తరణ ద్వారా విదేశాల నుంచి డబ్బు పంపడం సులభతరం అవ్వడమే కాకుండా, ప్రపంచ ఫిన్‌టెక్ రంగంలో భారత్ స్థానం మరింత పటిష్ఠమవుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం గత దశాబ్ద కాలంలో యూపీఐ లావాదేవీల సంఖ్యలో దాదాపు 12వేల రెట్ల వృద్ధి నమోదైంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2 కోట్ల లావాదేవీలు జరగ్గా, 2025-26 నాటికి ఆ సంఖ్య 24,162 కోట్లకు చేరింది. లావాదేవీల విలువ 0.07లక్షల కోట్ల నుంచి రూ.314 లక్షల కోట్లకు పెరిగి, నాలుగువేల రెట్ల వృద్ధిని నమోదు చేసింది. యూపీఐ పనితీరు, విశ్వసనీయత కారణంగా భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచింది. లావాదేవీల సంఖ్య పరంగా యూపీఐ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ పేమెంట్ సిస్టమని ఐఎంఎఫ్ గుర్తించింది.

## జిఎస్టీ వసూళ్లు రూ2.43 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, మే 1:** భారత జీఎస్టీ వసూళ్లు ఏప్రిల్‌ణెలలో రికార్డుస్థాయికి పెరిగాయి. స్థూల జీఎస్టీ వసూళ్లు 8.7శాతంపెరిగి ఏప్రిల్‌లో రూ.2.43 లక్షలకోట్లువరకూ వచ్చాయి. శుక్రవారం కేంద్రం విడుదల చేసిన గణాంకాలనున చూస్తే గత ఏడాది ఏప్రిల్‌లో కూడా ఆల్‌టైమ్ గరిష్టానికి వసూళ్లు నమోదయ్యాయి. ఆనాడు వసూళ్లు రూ.2.23లక్షలకోట్లుగా ఉన్న సంగతి తెలిసిందే. దేశీయ లావాదేవీలు కూడా 4.3శాతం పెరిగి రూ.1.85 లక్షలకోట్లు వసూలయ్యాయి. వినియోగ లావాదేవీలు పెరిగినట్లు తెలుస్తోంది. దిగుమతుల రెవెన్యూ కూడా 25.8శాతంపెరిగి రూ.57,580 కోట్లకు చేరాయి. ఈ వసూళ్లు జిఎస్టీ రాబడులకు మరింత ఊతం ఇచ్చాయి. ఇక జీఎస్టీ రీఫండ్‌లు కూడా 19.3శాతంపెరిగి రూ.31,793 కోట్లకు చేరాయి. నికరంగా రీఫండ్‌ల సర్దుబాటు తర్వాత నికర వసూళ్లు రూ.2.11 లక్షలకోట్లకు చేరాయి. 2025 ఏప్రిల్ నెలతో పోలిస్తే రూ.2.11 లక్షలకోట్లకు చేరాయి. దిగుమతులకు సంబంధించి రీఫండ్‌లు 14శాతం తగ్గాయి. 2027 ఆర్థికసంవత్సరానికి కేంద్రం జీఎస్టీ రాబడుల లక్ష్యం రూ.10 2 లక్షలకోట్లుగా నిర్ణయించింది. 2026 సంవత్సర టార్గెట్ 10.46 లక్షలకోట్లకంటే స్వల్పంగా తక్కువ విధించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలకారణంగానే ఈ లక్ష్యం తగ్గించిందని తెలుస్తోంది. అయితే రానున్న నెలల్లో జీఎస్టీ రాబడులు మరింతగా ఉంటాయని కూడా చెపుతున్నారు.

## ఒక్కనెలలో రూ.60,847 కోట్లు విత్‌డ్రా



**ముంబయి, మే 1:** విదేశీ ఇన్వెస్టర్లు స్థానిక ఈక్విటీ మార్కెట్లనుంచి ఏప్రిల్‌నెలలో 60,847 కోట్ల రూపాయలు విత్‌డ్రాచేసారు. భౌగోళిక ఉద్రిక్తతలు ఎక్కడా సర్దుబాటు కాకపోవడం, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో విదేశీ ఇన్వెస్టర్లలో అనిశ్చితి ఏర్పడింది. దీనితో స్టాక్ విత్‌డ్రా ఎక్కువయింది. విదేశ ఈపోర్టుఫోలియో ఇన్వెస్టర్లు గడచిన నాలుగు నెలల్లో 1.92 లక్షలకోట్లు విత్‌డ్రా చేసారు. గత ఏడాది మొత్తం కేలండర్‌సంవత్సరంలో రూ.1.66 లక్షలకోట్లు విత్‌డ్రా చేసిన మొత్తం కంటే ఈఏడాది నాలుగునెలల్లోనే అత్యధిక పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఫిబ్రవరి మినహా ఇతర అన్నినెలల్లోను ఎఫ్‌పిఐలు విత్‌డ్రాచేసారు. జనవరిలో రూ.35,962కోట్లు, ఫిబ్రవరిలో అయితే 22,165 కోట్లు పెట్టుబడులుపెట్టారు. మళ్లీ మార్చినెలలో రూ.1.17 లక్షలకోట్లు ఏప్రిల్‌లోరూ.60,847 కోట్లు విత్‌డ్రాచేసుకున్నారు. గ్లోబల్ స్థూల ఆర్థిక పరిస్థితులు సంక్లిష్టంగా మారడంతో ఉద్రిక్తతలు కూడా ఎక్కడా చల్లారకపోవడంతో పెట్టుబడులకు ఈక్విటీలు సురక్షితంకాదని ఎఫ్‌పిఐలు విత్‌డ్రాచేసారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడిచమురుధరలు గరిష్టంగాపెరిగాయి. ఫలితంగా డాలరుతోరూపాయి చెలామణి కూడా క్షీణించింది. ముడిచమురుధరలు 114 డాలర్లకు పెరగడం, రూపాయి మారకం విలువలు 95.35కు చేరుకోవడం వంటివి పెట్టుబడులు విత్‌డ్రాకు ఎక్కువ ఊతం ఇచ్చాయి. ఎంపికచేసిన ఎఫ్‌పిఐలు పెట్టుబడులు ఉన్నప్పటికీ మెజార్టీశాతం విత్‌డ్రా అయ్యాయి. దేశీయ ఇన్వెస్టర్లు కొంతమేర పెట్టుబడులు పెంచడంతో మార్కెట్లలో కొంతమేర స్థిరత్వం వచ్చింది. దీనికితోడు బాండ్ల రాబడులు 4.5శాతం పెరగడం అమెరికా బాండ్లపై అమ్మకాల వత్తిడి కూడా పెరిగింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.